www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 20-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 112
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి సా. 6.00 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 1.49 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: మ.12.04-1.36; దుర్ముహూర్తం: ఉ.5.54-7.37; అమృతఘడియలు: రా.9.14-10.45; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డిసెంబరుకు గ్రూప్-2 వాయిదా

డిప్యూటీ సీఎంను కలిసిన అభ్యర్థులు

వాయిదా అంశాన్ని పరిశీలించాలని టీజీపీఎస్సీ చైర్మన్‌కు సూచించిన భట్టి

పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన కమిషన్

హైదరాబాద్/తార్నాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు వాయిదా పడ్డాయి. ఆగస్టు 7, 8వ తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను డిసెంబరుకు వాయిదా వేశారు. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. వరుసగా పోటీ పరీక్షలు ఉన్నందున గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 18న ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

మిగతా 14వ పేజీలో...

ఎర్రర్.. టెర్రర్

విండోస్-10 కంప్యూటర్లలో 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో నిలిచిన విమాన, బ్యాంకింగ్ సేవలు



ఢిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో స్ర్కీన్‌పై ఎర్రర్ మెసేజ్


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అధికారులతో ప్రయాణికుల వాగ్వాదం

- శంషాబాద్‌లో 39 దేశీయ సర్వీసుల రద్దు.. 44 ఆలస్యం
- విశాఖలో 4 విమానాల రద్దు.. గన్నవరంలో 15 జాప్యం
- ఎయిర్‌పోర్టులు కిటకిట.. రద్దీతో ప్రయాణికుల బెంబేలు
- పలు దేశాల స్టాక్ మార్కెట్లలో లావాదేవీలకు అంతరాయం
- ఆస్పత్రుల్లో కంప్యూటర్ల మొరాయింపు.. రోగులకు ఇబ్బంది
- సైబర్ భద్రత సంస్థ 'క్రౌడ్‌స్ట్రైక్' అందించిన అప్‌డేట్‌లో బగ్
- సమస్యను గుర్తించి సంక్షోభాన్ని పరిష్కరించిన క్రౌడ్‌స్ట్రైక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌లో బగ్ వల్ల శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఆ ఓఎస్‌ను వాడుతున్న డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లలో 'బ్లూ స్ర్కీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' సమస్య తలెత్తింది! కంప్యూటర్ ఆన్ చేయగానే ఒక దశ దాకా వచ్చి బ్లూ స్ర్కీన్ ఎర్రర్ రావడం.. మళ్లీ దానంతట అదే రీస్టార్ట్ కావడం.. ఒక లూప్‌లో జరిగింది. ప్రపంచవ్యాప్తంగా విండోస్ ఓఎస్ వాడే డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌ల సంఖ్య దాదాపు 73 శాతం దాకా ఉండడం.. ఆ కంప్యూటర్లన్నీ ఆన్ కాకుండా

మిగతా 2వ పేజీలో...


సచివాలయంలో విద్యావేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

4 నుంచి 12వ తరగతి వరకు

సెమీ రెసిడెన్షియల్

రెసిడెన్షియల్ బడులు కూడా.. విద్యార్థులకు ఉచిత రవాణా!

ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీలు!.. త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు

వర్సిటీలకు వీసీలు, సిబ్బంది నియామకం.. విద్యావేత్తలతో సీఎం

విద్యారంగ బడ్జెట్‌ను గణనీయంగా పెంచుతామని వెల్లడి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీలను ప్రీస్కూళ్లుగా మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. మూడో తరగతి వరకు ప్రీస్కూళ్లలో; 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యమైన బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి పలువురు విద్యావేత్తలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు

మిగతా 13వ పేజీలో...

17 కోర్సులతో..

స్కిల్స్ వర్సిటీ

ఏటా 20 వేల మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు

తొలుత ఆరు కోర్సులు.. 2వేల మందికి శిక్షణ: సీఎం

13

'తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్'కు..

రక్షణ కవచంగా హైడ్రా

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు 13

విధివిధానాలు ఖరారు.. జీవో 99 విడుదల చేసిన సర్కార్


ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేటలో కోతకు గురైన పెంచికలపేట-లోడ్‌పల్లి ప్రధాన రహదారి

ఉధృతంగా వాగులు..

తెగిన రోడ్లు

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో 16.7 సెంటీమీటర్ల వర్షపాతం

సగానికి పైగా నిండిన తుంగభద్ర

జూరాలను చేరిన కృష్ణా జలాలు

నేడు, రేపు అత్యంత భారీ వర్షాలు

5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ

పెద వాగు ఖాళీ

ప్రాజెక్టుకు గండి.. 20 కోట్ల నష్టం

గుబ్బలమంగమ్మ అటవీ ప్రాంతంలో 31 సెం.మీ. వర్షం.. భారీ వరద

200పైగా పశువుల మృత్యువాత

నిరాశ్రయులైన 2 గ్రామాల ప్రజలు

వేలాది ఎకరాల్లో పంట నష్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 8 మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురవగా.. 35 మండలాల్లో భారీ వానలు పడ్డాయి. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. వానలతో చాలా చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లగా.. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. ఇళ్లలోకి నీరు చేరింది. కొన్ని జిల్లాల్లో

మిగతా 3వ పేజీలో...

కొందరికి ఇంకా పడలే!

జాబితాలో పేరున్నా ఖాతాలో జమ కాని రుణమాఫీ సొమ్ము

మెసేజ్ రాకపోవడంతో రైతుల ఆందోళన

నేటితో రూ. లక్షలోపు వారందరికీ వస్తాయంటున్న బ్యాంకర్లు 14

అధ్యక్ష రేసు నుంచి బైడెన్ ఔట్?



నేడో రేపో స్వీయ ప్రకటన?

కమలా హ్యారిస్‌కు మాత్రం మద్దతివ్వనంటున్న ప్రెసిడెంట్

రిపబ్లికన్ వర్గాల వెల్లడి 2

ఖేద్కర్.. 12 సార్లు సివిల్స్

- నకిలీ పత్రాలతో హాజరైనట్టు గుర్తింపు
- కేసు నమోదు చేసిన యూపీఎస్సీ
- ఐఏఎస్ ట్రైనీగా ఆమె అభ్యర్థిత్వం రద్దు?

12 సార్లు సివిల్స్ రాసిన పూజా ఖేద్కర్



నకిలీ పత్రాలతో హాజరైనట్టు గుర్తింపు

యూపీఎస్సీ కేసు నమోదు .. ఆమె అభ్యర్థిత్వం రద్దుకు చర్యలు

న్యూఢిల్లీ, పుణె, జూలై 19: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన ఆమె నిబంధనలకు విరుద్ధంగా 12 సార్లు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరైనట్టు గుర్తించింది. దీంతో ఆమెపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం తెలిపింది. అంతేకాకుండా సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2022 నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దుతోపాటు భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా బహిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఆ షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వడానికి రెండు వారాలు గడువు ఇచ్చింది. ఆమె తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటో, సంతకం, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, చిరునామాకు సంబంధించిన పత్రాలన్నీ మార్చడం ద్వారా మోసానికి పాల్పడినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని దీంతో.. పూజా ఖేద్కర్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్టు తెలిపింది. పూజ 2012 నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరైనట్టు గుర్తించడంతో ఆమెకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు ఇద్దరు సీనియర్ అధికారులు తెలిపారు. వాస్తవానికి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసేందుకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 32 ఏళ్ల వరకు ఆరుసార్లు మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఓబీసీ అభ్యర్థులకు 35 ఏళ్లు, ఓబీసీ దివ్యాంగ అభ్యర్థులకు 42 ఏళ్లు వచ్చేవరకు 9 సార్లు అవకాశం ఉంటుంది. కానీ, ఆమె నకిలీ పత్రాలతో యూపీఎస్సీని మోసంచేసి 12 సార్లు పరీక్ష రాశారని అధికారులు పేర్కొన్నారు.

కాగా, పూజా ఖేద్కర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం తన నివేదికను శుక్రవారం యూపీఎస్సీకి సమర్పించింది. ఆ కాపీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీకి కూడా పంపించింది. కాగా.. పూజా ఖేద్కర్ కేసుకు సంబంధించిన అంశాలు యూపీఎస్సీ నియామక ప్రక్రియ సమగ్రతపై సందేహాలు కలిగేలా చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. పూజా ఖేద్కర్‌పై యూపీఎస్సీ కేసు నమోదు చేయడంతో ఆమె శుక్రవారమే వాషిమ్ జిల్లాను వదిలి వెళ్లిపోయారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ గెస్ట్ హౌస్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చట్టం తన పని చేసుకుపోతుందని అన్నారు. తాను త్వరలోనే తిరిగొస్తానని చెబుతూ కారు ఎక్కి నాగపూర్ బయల్దేరి వెళ్లారు. 2023 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐఏఎస్‌గా ఎంపికైన పూజ ఈ నెల మొదటి వారంలో పుణె నుంచి వాషిమ్‌కు అసిస్టెంట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, పూజా ఖేద్కర్ తల్లికి సంబంధించిన ఇంజనీరింగ్ సంస్థను పింప్రి-చించ్‌వాడ నగరపాలక సంస్థ శుక్రవారం సీజ్ చేసింది. దాదాపు రూ.2లక్షలకు పైగా ఆస్తి పన్ను బకాయిలు ఉండడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. పూజా తల్లి మనోరమ ప్రస్తుతం పుణె పోలీసుల అదుపులో ఉన్నారు.

పోర్న్ వీడియోలు చూపి అసభ్యంగా తాకారు!

- విమానంలో మహిళకు 'జిందాల్' సీఈవో వేధింపులు
- సంస్థ వ్యవస్థాపకుడు నవీన్‌కు బాధితురాలి ఫిర్యాదు..

న్యూఢిల్లీ, జూలై 19: జిందాల్ స్టీల్ సీఈవో దినేశ్ కుమార్ తనకు పోర్న్ వీడియోలు చూపి లైంగికంగా వేధించారంటూ ఓ మహిళ ఆ సంస్థ వ్యవస్థాపకుడు నవీన్ జిందాల్‌కు 'ఎక్స్' వేదికగా ఫిర్యాదు చేశారు. విమానంలో తన పట్ల జరిగిన దారుణాన్ని ఆమె ఓ పోస్టులో వివరించారు. 'కోల్‌కతా నుంచి అబుధాబి వెళ్తున్న విమానంలో నా పక్కనే దినేశ్ కూర్చొన్నారు. నాతో మాటలు కలిపిన ఆయన తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. సినిమాలు చూడటమంటే ఇష్టమేనా అని అడుగుతూ ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూపుతూ నన్ను అసభ్యంగా తాకారు. దీంతో షాక్‌కు గురైన నేను వాష్‌రూమ్ వద్దకు వెళ్లి విమాన సిబ్బందికి విషయం చెప్పాను. వారు నన్ను మరో చోట కూర్చొబెట్టి జాగ్రత్తగా చూసుకున్నారు. అప్పటికీ నేను ఎక్కడికెళ్లానంటూ నా గురించి సిబ్బందితో ఆయన ఆరా తీస్తూనే ఉన్నారు. విమానం ల్యాండ్ అవగానే అక్కడి పోలీసులకు కూడా విమాన సిబ్బంది ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై ఆయన్ను ప్రశ్నించినప్పుడు కూడా కాదని ఖండించలేదు. ఇది ఎవరికైనా జరగొచ్చు. అందుకే మీ దృష్టికి తెస్తున్నాను.. ఈ వ్యక్తి సంస్థలోని మహిళా ఉద్యోగుల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తున్నాడో..?' అని పేర్కొంటూ నవీన్ జిందాల్ ఖాతాకు ట్యాగ్ చేశారు. మహిళ ఫిర్యాదుపై నవీన్ జిందాల్ స్పందించారు. 'మీరు చేసిన పనికి ధన్యావాదాలు.. దీనికి చాలా ధైర్యం కావాలి. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు చేయాల్సిందిగా మా బృందాన్ని కోరతా. అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటాం' అని హామీనిచ్చారు.

ఈ స్వాతంత్ర్య దినోత్సవ థీమ్ 'వికసిత్ భారత్'

న్యూఢిల్లీ, జూలై 19: భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల థీమ్‌గా 'వికసిత్ భారత్'ను ఎంపిక చేసినట్లు అధికారులు ప్రకటించారు. 2047 నాటికి భారత్‌ను 'అభివృద్ధి చెందిన దేశం'గా మార్చే ధ్యేయంతో ఈ థీమ్‌ను రూపొందించారు. ఈ మేరకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి భరత్ భూషణ్ బాబు శుక్రవారం తెలిపారు. "2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వంద సంవత్సరాలు పూర్తవుతాయి. నాటికి 'అభివృద్ధి చెందిన దేశం'గా అవతరించడానికి భారత్ కాంక్షిస్తోంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అలాగే ఎర్రకోటతో పాటు 'వికసిత్ భారత్' నినాద పోస్టర్‌ను షేర్ చేశారు.

ఐఐటీ మద్రాస్ నుంచి ఇస్రో చైర్మన్ పీహెచ్‌డీ



చెన్నై, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఐఐటీ మద్రాస్ నుండి పీహెచ్‌డీ డిగ్రీ స్వీకరించారు. శుక్రవారం జరిగిన ఐఐటీ మద్రాస్ 61వ స్నాతకోత్సవంలో ఆయన ఈ పట్టాను అందుకున్నారు. ఈ స్నాతకోత్సవంలో 3,016 మంది విద్యార్థులు పట్టాలను అందుకున్నారు. 444 మంది అభ్యర్థులు పీహెచ్‌డీలు స్వీకరించారు. వీరిలో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ కూడా ఉండటం విశేషం. మెకానికల్ ఇంజనీరింగ్‌లో విస్తృత పరిశోధనలు జరిపినందుకు ఈ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి తెలిపారు.

క్రిమినల్ చట్టాలపై డీఎంకే న్యాయపోరాటం

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న మూడు క్రిమినల్ చట్టాలను సవాల్ చేస్తూ తమిళనాడులోని డీఎంకే పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఎస్ భారతి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు స్వీకరించిన జస్టిస్ ఎస్ఎస్ సుందర్, జస్టిస్ సెంథిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం.. పూర్తి వివరాలు సమర్పించాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇళంగో వాదనలు వినిపిస్తూ.. ఈ క్రిమినల్ చట్టాల ఆమోదం కోసం విపక్ష సభ్యులందరినీ పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసి అత్యవసరంగా ఈ చట్టాలకు ఆమోదముద్ర వేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించలేదని, చట్టాల్లోని కొన్ని నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛ హరించేలా ఉన్నాయని, అందువల్ల వివాదాస్పద చట్టాలను రద్దు చేయాలని అభ్యర్థించారు.

బిల్కిస్ కేసు ముద్దాయిల పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, జూలై 19: గుజరాత్ అల్లర్ల సందర్భంగా బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు ముద్దాయిలు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. తమను మళ్లీ గోద్రా జైలుకు పంపడాన్ని వారు సవాలు చేశారు. ఈ కేసులో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడగా గుజరాత్ ప్రభుత్వం దాన్ని మాఫీ చేసింది. దీనిపై బాధితురాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా గుజరాత్ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ జనవరి 8న ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాధేశ్యాం భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనీ అనే ఇద్దరు ముద్దాయిలు పిటిషన్ వేశారు. పరిశీలించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం.. ఒక ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మరో ద్విసభ్య ధర్మాసనం ఎలా రద్దు చేస్తుందని ప్రశ్నిస్తూ వారి పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో వారు మధ్యంతర బెయిల్ కావాలంటూ మరో పిటిషన్ వేశారు.

పాకిస్థాన్‌లో పెరిగిన హిందూ జనాభా

ఇస్లామాబాద్, జూలై 19: పాకిస్థాన్‌లో హిందువుల జనాభా పెరిగింది. 2017లో 35 లక్షలుగా ఉన్న సంఖ్య 2023లో 38 లక్షలకు పెరిగింది. 2023 జనాభా లెక్కల వివరాలను ప్రముఖ పత్రిక డాన్ గురువారం ప్రచురించింది. దాని ప్రకారం పాకిస్థాన్ మొత్తం జనాభా సుమారు 24.4 కోట్లు. 2017తో పోలిస్తే 2023లో మైనార్టీల సంఖ్య పెరగడం గమనార్హం. క్రైస్తవులు 26 లక్షల నుంచి 33 లక్షలకు పెరిగారు. కాగా, మొత్తం జనాభాతో పోలిస్తే ఆరేళ్లలో హిందువులు 1.73 శాతం నుంచి 1.63 శాతానికి స్వల్పంగా తగ్గిపోగా, క్రైస్తవులు 1.27 నుంచి 1.37 శాతానికి పెరగడం విశేషం.

ఒలింపిక్స్ కోసం వేలు తీసేశాడు!

ఆస్ట్రేలియా హాకీ ఆటగాడు మాథ్యూ డాసన్ కఠిన నిర్ణయం



సిడ్నీ, జూలై 19: ఏదైనా పెద్ద టోర్నీకి ముందు గాయాలైతే క్రీడాకారులు కోలుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అప్పటికీ వీలు కాకుంటే.. అత్యంత ఆవేదనతో టోర్నీకి దూరమవుతారు. ఆస్ట్రేలియా పురుషుల హాకీ జట్టు సభ్యుడు మాథ్యూ డాసన్ (30) మాత్రం కఠిన నిర్ణయం తీసుకున్నాడు. మైదానంలో డిఫెండర్‌గా పోరాట పటిమ చూపే అతడు.. బయట కూడా పరిస్థితులతో పోరాడేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవల డాసన్ కుడిచేతి ఉంగరపు వేలికి పెద్ద గాయమైంది. శస్త్రచికిత్స చేయించుకున్నా.. కోలుకునేందుకు సమయం పట్టనుంది. కానీ, ఈ నెల 26 నుంచి ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. డాసన్ పాల్గొనే అవకాశం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏకంగా వేలి పైభాగాన్ని తొలగించుకున్నాడు. ప్రస్తుతం అతడు జట్టుతో కలిసి ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. కాగా, ఆరేళ్ల కిందటి హాకీ స్టిక్ తగిలి డాసన్ కంటికి చూపు పోయేంతటి గాయమైంది. అప్పుడు కూడా స్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో నిలిచాడు. కోలుకుని మైదానంలో అడుగుపెట్టాడు.

ఎర్రర్.. టెర్రర్

(మొదటి పేజీ తరువాయి)



బెంగళూరులోని కెంపెగౌడ ఎయిర్‌పోర్టులో ఆగిపోయిన ప్రయాణికులు

మొరాయించడంతో పెను సంక్షోభమే తలెత్తింది! చాలా దేశాల్లో విమానాలు ఎగరలేదు! బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లావాదేవీలు జరగలేదు! పలు మీడియా సంస్థల ప్రసారాలు నిలిచిపోయాయి. వ్యాపారాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఆస్పత్రుల్లో కంప్యూటర్లు పనిచేయక.. పేషెంట్లు కొన్ని గంటలపాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. అంతర్జాతీయస్థాయిలో సేవారంగం మొత్తం అల్లకల్లోలమైందంటే అతిశయోక్తి కాదు. మన విమానాశ్రయాల్లో అయితే.. ఎన్నడూ లేని విధంగా బోర్డింగ్ పాస్‌లను సిబ్బంది తమ చేత్తో రాసిచ్చారు! కొన్ని విమానాలను దారి మళ్లించారు. కొన్ని విమానాలను రద్దు చేశారు. మన దేశంలోనూ ఈ సమస్య కారణంగా పెద్ద సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. వాటిలో ఒక్క ఇండిగో కంపెనీకి చెందినవే 200కు పైగా ఉన్నట్టు సమాచారం. ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని.. ఈ సమస్య కారణంగా రష్యాకు తరలించినట్టు సమాచారం. ఇంకా.. స్పైస్‌జెట్, ఆకాశ, విస్తారా, ఇలా విమానాలు రద్దయిపోవడం, ఆలస్యం కావడంతో.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా పలు ప్రధాన నగరాల్లోని విమానాశ్రయాలు అక్కడ చిక్కుకుపోయిన ప్రయాణికులతో కిటకిటలాడిపోయాయి. శంషాబాద్ విమానాశ్రయంలో 39 దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. 44 దేశీయ.. 10 అంతర్జాతీయ సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో టికెట్లపై ప్రయాణికుల పేర్లు, సీటు నంబర్లు, ఇతర వివరాలను చేత్తో రాసిచ్చారు. అలాగే.. డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు పనిచేయకపోవడంతో సైన్ బోర్డులపై విమానాల రాకపోకల వివరాలు రాసి అక్కడక్కడా పెట్టారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం.. టికెట్లు రద్దు చేయకపోవడంతో పలువురు ప్రయాణికులు ఎయిర్‌పోర్టు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. "10 గంటలుగా పడిగాపులు కాస్తున్నా ఎయిర్‌లైన్స్, జీఎంఆర్ అధికారులెవరూ పట్టించుకోవట్లేదు" అంటూ మండిపడ్డారు. రాత్రి 10.30 గంటల సమయంలో ఆందోళనకు దిగడంతో.. సీఐఎస్ఎఫ్ అధికారులు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వారు ఆందోళన విరమించలేదు. ఒకదశలో కొట్టుకునే స్థాయిలో తోపులాట కూడా జరిగింది. అటు విశాఖ విమానాశ్రయంలోనూ నాలుగు విమానాలు రద్దు కాగా.. విజయవాడ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. మనదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రధాన విమానయాన సంస్థలు అన్ని సర్వీసులను రద్దు చేయడంతో.. ఎయిర్‌పోర్టుల్లో గందరగోళం నెలకొంది.

బ్యాంకింగ్, వాణిజ్య సేవలు..

మైక్రోసాఫ్ట్ ఓఎస్‌లో బగ్ కారణంగా మనదేశంలో.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ తదితర బ్యాంకుల ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలిగినట్టు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. అయితే, ఎస్‌బీఐ అధికారులు మాత్రం తమ సిస్టమ్స్‌లో ఎలాంటి సమస్యా తలెత్తలేదని వివరణ ఇచ్చారు. మొత్తం మీద 10 బ్యాంకింగ్, బ్యాంకింగేతర వ్యవస్థలపై కొద్దిపాటి ప్రభావం పడిందని ఆర్బీఐ తెలిపింది. అలాగే.., ఈ సమస్య వల్ల ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, 5పైసా వంటి బ్రోకరేజీ సంస్థలు, మోతీలాల్ ఓస్వాల్, ఎడెల్‌వెయిస్ వంటివాటి కార్యకలాపాలకు స్వల్ప అంతరాయం కలిగింది. పలు దేశాల స్టాక్ ఎక్స్ఛేంజీలపైనా దీని ప్రభావం పడిందిగానీ.. మన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మాత్రం ఎలాంటి ఇబ్బందీ లేకుండా పనిచేసింది. ఈ సమస్య కారణంగా కొద్దిసేపు తమ ఉత్పత్తి, డిస్పాచ్ ఆపరేషన్స్‌ను నిలిపివేసినట్టు మారుతి సుజుకి ఇండియా ప్రకటించింది. ఓఎస్ సమస్య కారణంగా తలెత్తిన సంక్షోభంపై కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. దీనిపై 'కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) సాంకేతిక మార్గదర్శకాలు జారీచేస్తుందని వెల్లడించారు. వెంటనే సెర్ట్-ఇన్ ఆ మార్గదర్శకాలు జారీ చేసింది. మైక్రోసాఫ్ట్ కూడా శుక్రవారం సాయంత్రానికి.. సమస్యను పరిష్కరించినట్టు ప్రకటించింది.

అసలేమిటి సమస్య?

మైక్రోసాఫ్ట్ సహా పలు సంస్థలు.. హ్యాకర్లు, సైబర్ దాడుల నుంచి రక్షణకు క్రౌడ్‌స్ట్రైక్ అనే క్లౌడ్ ఆధారిత సైబర్ సెక్యూరిటీ సంస్థ అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తాయి. ఆ సంస్థ తాజాగా ఇచ్చిన అప్‌డేట్‌లోని సెన్సర్ సాఫ్ట్‌వేర్‌లో ఒక బగ్ కారణంగానే బ్లూ స్క్రీన్ ఎర్రర్ వచ్చి.. లూప్‌లో రీస్టార్ట్ అవడం మొదలుపెట్టాయి. సమస్య తమ సాఫ్ట్‌వేర్‌లోనే ఉన్నట్టు గుర్తించామని.. వెంటనే దాన్ని పరిష్కరించామని క్రౌడ్‌స్ట్రైక్ సీఈవో జార్జ్ కర్ట్ ప్రకటించారు. 2011లో జార్జ్‌కర్ట్ మరో ముగ్గురితో కలిసి ఈ సంస్థను టెక్సాస్(అమెరికా)లోని ఆస్టిన్ నగరంలో స్థాపించారు. 2013లో ఈ సంస్థ తన తొలి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తి 'క్రౌడ్‌స్ట్రైక్ ఫాల్కన్'ను విడుదల చేసింది. మైక్రోసాఫ్ట్ సంస్థ తన విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌లో దీన్ని నిక్షిప్తం చేసింది. ఇది సంప్రదాయ యాంటీవైరస్‌లకన్నా అత్యంత శక్తిమంతంగా పనిచేస్తుంది. ఇప్పుడు ఆ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో వచ్చిన బగ్గే ప్రపంచాన్ని అల్లాడించింది.

లోకం తీరు



అరుంధతీరాయ్‌కి అంతర్జాతీయ సంఘీభావం

న్యూయార్క్, జూలై 19: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి జారీ చేయటాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా, కెనడాకు చెందిన 13 ప్రవాస భారతీయ సంఘాలు ఉమ్మడి ప్రకటన జారీ చేశాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దెబ్బతిన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'సాధారణంగానైతే ఇటువంటి ఫలితాలు వచ్చినప్పుడు ప్రభుత్వాలు తమ ఆధిపత్య పోకడలను మార్చుకుంటాయి. కానీ, మోదీ తన నియంతృత్వ ధోరణిని మార్చుకునే అవకాశాలు తక్కువని అర్థమవుతోంది' అని ఈ ప్రకటనలో విమర్శించారు. 2010లో కశ్మీర్ గురించి రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలతో ఉపా కింద అరుంధతీరాయ్, ప్రొఫెసర్ హుస్సేన్‌లపై కేసు నమోదు చేయటాన్ని ప్రస్తావిస్తూ.. 14 ఏళ్ల తర్వాత ఈ కేసును ఎలా తిరగదోడుతారని, మోదీ నిరంకుశ పోకడలకు ఇది నిదర్శనమని అన్నారు.

అమెరికాలో భారత రాయబారిగా వినయ్ క్వాత్రా



న్యూఢిల్లీ, జూలై 19: అమెరికాలో భారత రాయబారిగా విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి వినయ్ క్వాత్రా శుక్రవారం నియమితులయ్యారు. ఆయన ఆదివారమే కార్యదర్శిగా పదవీ విరమణ చేయడం గమనార్హం. త్వరలోనే ఆయన కొత్త బాధ్యతలు చేపడుతారని విదేశాల వ్యవహారాల శాఖ ప్రతినిధి తెలిపారు. క్వాత్రా 2022 మే నెల ఒకటో తేదీ నుంచి ఈ నెల 14 వరకు విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా పనిచేశారు. 1993 నుంచి 2003 వరకు న్యూఢిల్లీలోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో ఐక్యరాజ్యసమితి వ్యవహారాలను చూసేవారు. ఆయన 2015 నుంచి 2017 వరకు ప్రధాని కార్యాలయం (పీఎంఓ)లో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు.

దక్షిణ కొరియా డ్రామాలు చూసినందుకు 30 మంది టీనేజర్ల ఉరితీత


ప్యాంగ్యాంగ్, జూలై 19: దక్షిణ కొరియా డ్రామాలను(వినోద కార్యక్రమాలు) వీక్షించినందుకు 30 మంది టీనేజర్లకు ఉత్తర కొరియా ఉరిశిక్ష అమలు చేసిందని దక్షిణ కొరియా మీడియా పేర్కొంది. దక్షిణ కొరియాను తమ ప్రధాన శత్రువుగా ఉత్తర కొరియా కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. దక్షిణ కొరియా టీవీ కార్యక్రమాలు సహా అన్ని వినోద ప్రసారాలను ఉత్తర కొరియా నిషేధించింది. పెన్‌డ్రైవ్‌ల ద్వారా ఆ కార్యక్రమాలు ఉత్తర కొరియాలోకి వస్తుంటాయి. అయితే నిషేధించిన ఆ కార్యక్రమాలను చూసినందుకే 30 మంది టీనేజర్లను ఉత్తర కొరియా ఉరితీసిందని దక్షిణ కొరియా మీడియా పేర్కొంది.

రష్యాలో అమెరికా జర్నలిస్టుకు 16 ఏళ్ల జైలు శిక్ష

మాస్కో, జూలై 19: గూఢచర్యానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై అమెరికాకు చెందిన జర్నలిస్టు ఎవాన్ గెర్షికోవిచ్ (32)కు ఓ రష్యా కోర్టు 16 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. రష్యా యుద్ధ ట్యాంకుల కంపెనీకి చెందిన రహస్య సమాచారాన్ని అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు అందజేసినట్టు ఆయనపై కేసు నమోదయింది. ఈ వ్యవహారంలో రహస్యంగా విచారణ జరిపిన కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన అనంతరం గూఢచర్యం నేరంపై అమెరికా జర్నలిస్టును అరెస్టు చేయడం ఇదే తొలిసారి. అయితే తాను నేరం చేయలేదని ఎవాన్ అన్నారు.

అధ్యక్ష రేసు నుంచి బైడెన్ అవుట్?

రేపటిలోగా ప్రకటనకు అవకాశం!.. అయితే కమలా హ్యారిస్‌కు మద్దతివ్వనని స్పష్టీకరణ



వాషింగ్టన్, జూలై 19: వృద్ధాప్యంతో, అనారోగ్యంతో సతమతమవుతున్నా.. ప్రసంగాలు, డిబేట్ల సమయంలో తడబడుతూ సమర్థంగా వాదనలు వినిపించలేకపోతున్నా.. రెండోసారి అధ్యక్ష పదవిలో కొనసాగి తీరతానని భీష్మించుకున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81).. ఇప్పుడు వెనక్కి తగ్గుతున్నట్లు తెలిసింది. డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా తప్పుకొనేందుకు అంగీకరించిన ఆయన.. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వానికి మద్దతివ్వడానికి మాత్రం నిరాకరించారని ఆ పార్టీ వర్గాలను ఉటంకిస్తూ జర్నలిస్టు, న్యూస్‌మ్యాక్స్ చానల్ వ్యాఖ్యాత మార్క్ హాల్పెరిన్ వెల్లడించారు. ఆదివారంలోపు ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని గురువారం తెలిపారు. అయితే దీనిపై బైడెన్ గానీ, ఆయన ప్రచార బృందం గానీ ఇంతవరకు స్పందించలేదు. అభ్యర్థిని అధికారికంగా ఖరారుచేసేందుకు డెమోక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సు వచ్చే నెలలో జరుగనుంది. బైడెన్‌కు నిన్నమొన్నటిదాకా అండగా నిలబడిన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ.. ఇటీవలి కాలంలో ఆయన అనారోగ్యంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాజాగా ఆయనకు కొవిడ్ సోకింది. ఆయన విజయావకాశాలు బాగా తగ్గిపోయాయని ఒబామా పార్టీ సన్నిహితులతో అన్నారు. బైడెన్ అనారోగ్యం ఆందోళన కలిగిస్తోందని.. ఈ నేపథ్యంలో రెండోసారి బరిలో దిగే అంశంపై ఆయన తీవ్రంగా ఆలోచించాలని సూచించినట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తెలియజేసింది. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో కొన్నాళ్ల కింద జరిగిన డిబేట్‌లో బైడెన్ తేలిపోయాక.. చాలా మంది డెమోక్రాటిక్ సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు, సీనియర్ నేతలు ఆయన తప్పుకోవాలని డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. రేసు నుంచి వైదొలగకపోతే పరాజయం తప్పదని నాన్సీ పెలోసీ కూడా బైడెన్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. మరోవైపు.. కొవిడ్ కారణంగా బైడెన్ ప్రస్తుతం డెలవర్‌లో ఐసొలేషన్‌లో ఉన్నారు. తన అభ్యర్థిత్వంపై లేనిపోని ఊహాగానాలు వద్దని అన్నారు.

మహిళకు ముద్దుపెట్టబోయిన అమెరికా అధ్యక్షుడు!

- బైడెన్ పాత వీడియో వైరల్

వాషింగ్టన్, జూలై 19: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన వింత ప్రవర్తనతో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అధ్యక్ష పదవికి పోటీ నుంచి తప్పుకోవాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలోనే బైడెన్ వేదికలపై విచిత్రంగా ప్రవర్తించడం గమనార్హం. తాజాగా అలాంటి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో ఎప్పటిదనేది తెలియరాలేదు గానీ, అందులో ఓ కార్యక్రమంలో పాల్గొన్న బైడెన్.. వేదికపై ఓ మహిళతో మాట్లాడుతూ అతి దగ్గరగా వెళ్లారు. ఇంకొంచెమైతే ముద్దు పెట్టేసేవారే.. అనిపించింది! పక్కనే ఉన్న ఆయన భార్య జిల్ అప్రమత్తమై ఆయన్ను ఆపినట్లు వీడియోలో కనిపించింది. ఆ తర్వాత భద్రతా సిబ్బంది ఆ మహిళను అక్కడి నుంచి పంపారు. బైడెన్ మానసిక ఆరోగ్యంపై తలెత్తుతున్న అనుమానాలకు బలం చేకూర్చేలా తాజా వీడియో ఉండడం గమనార్హం.

బంగ్లాదేశ్‌లో జైలుకు నిప్పు.. ఖైదీల పరారీ

- శుక్రవారం 19 మంది మృతి.. 105కు పెరిగిన మృతులు
- మూడు వందల మంది భారతీయ విద్యార్థులు వెనక్కి



ఢాకాలో నిరసనకారులు

ఢాకా, జూలై 19: బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ రిజర్వేషన్లను సవరించాలని జరుగుతున్న ఆందోళనలు రోజురోజుకూ హింసాత్మకంగా మారుతున్నాయి. శుక్రవారం కొందరు ఆందోళనకారులు.. ఢాకాకు 40 కి.మీల దూరంలో గల నర్సింగ్దిలోని ఓ జైలును ముట్టడించారు. అందులోని వందల మంది ఖైదీలను విడిపించారు. అనంతరం జైలుకు నిప్పుపెట్టారని అక్కడి పోలీసు అధికారులు తెలిపారు. శుక్రవారం జరిగిన ఘర్షణల్లో 19 మంది పౌరులు మరణించగా.. పోలీసులతో పాటు వందల మంది గాయపడ్డారని చెప్పారు. కాగా, ఘర్షణల్లో ఇప్పటి వరకు మొత్తం 105 మంది మరణించారని అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం 1971లో అశువులు బాసిన వారి వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30% కోటా కల్పించారు. దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి వర్సిటీ విద్యార్థులు, ప్రజలు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. కాగా, బంగ్లాలో ఘర్షణలు తీవ్రతరమవుతుండడంతో శుక్రవారం ఎంబీబీఎస్ చదువుతున్న 300 మంది భారతీయులు వెనక్కి వచ్చారు.

అమెరికాలో కాల్పులు: అయిదుగురి మృతి

మాంట్‌గోమరీ, జూలై 19: అమెరికాలోని అలబామా రాష్ట్రం బిబ్ కౌంటీలో గురువారం రాత్రి ఓ వ్యక్తి కాల్పులు జరపడంతో అయిదుగురు మృతి చెందారు. వీరిలో ఓ మహిళ, నలుగురు పిల్లలు ఉన్నారు. పిల్లలంతా 14 ఏళ్ల లోపువారే. బ్రాండన్ కెండ్రిక్ (32) అనే వ్యక్తి హ్యాండ్‌గన్‌తో వారి తలపై గురిపెట్టి కాల్చి చంపాడు. ఇందుకుగల కారణాలు తెలియరాలేదు. కాల్పులు జరిపిన అనంతరం సంఘటన స్థలంలోనే ఉండడంతో పోలీసులు వచ్చి అరెస్టు చేశారు. మరణించిన వారిలో భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు తెలుస్తోంది.

యువతి తలలో 70 సూదులు గుచ్చేశాడు

వైద్యం పేరిట ఒడిసాలో ఓ తాంత్రికుడి పిచ్చిపని

సంబల్‌పూర్, జూలై 19: అనారోగ్యాన్ని నయం చేస్తానని నమ్మబలికిన ఓ తాంత్రికుడు.. 19 ఏళ్ల యువతి ప్రాణాలతో చెలగాటమాడాడు. వైద్యం పేరిట ఆ యువతి తలలో ఏకంగా 70 సూదులు గుచ్చేశాడు. ఒడిసాలోని బలాంగిర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన సదరు యువతి ఆస్పత్రిలో చేరడంతో బయటికొచ్చింది. సకాలంలో వైద్యం అందించిన వైద్యులు ఆ సూదులను బయటికి తీయడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. బాధిత యువతి కుటుంబసభ్యుల కథనం ప్రకారం... బలాంగిర్ జిల్లాకు చెందిన బిష్ణు బెహరా కుమార్తె రేష్మ బెహరా(19) నాలుగేళ్లుగా అంతుచిక్కని అనారోగ్యంతో బాధపడుతోంది. ఎందరు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించినా రేష్మ ఆరోగ్యంలో మార్పు కనిపించలేదు. దీంతో ఆ కుటుంబం సంతోష్ రాణా అనే తాంత్రికుడిని ఆశ్రయించింది. వారి సమస్య విన్న సంతోష్ రాణా అనారోగ్యాన్ని నయం చేస్తానని నమ్మించాడు. తల్లిదండ్రులను బయటే ఉంచే రేష్మను ఓ గదిలోకి తీసుకెళ్లాడు. గంట సేపటి తర్వాత తలుపులు తీసి యువతికి నయమైందని ఇంటికి తీసుకెళ్లవచ్చని చెప్పాడు. కాసేపటికి రేష్మ చాలా ఇబ్బంది పడుతుండగా చూసిన తల్లిదండ్రులు ఆమె తలలో సూదులు ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు. వెంటనే రేష్మను సమీపంలో ఆస్పత్రికి తరలించారు. సీటీ స్కాన్ చేసిన వైద్యులు రేష్మ తలలో పెద్ద సంఖ్యలో సూదులు ఉన్నట్టు గుర్తించారు. రేష్మకు గురువారం రాత్రి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు గంటన్నర సేపు శ్రమించి ఆమె తలలో నుంచి 70 సూదులను బయటికి తీశారు.

కావడి యాత్ర మార్గంలో హోటళ్లపై యజమాని పేరు ఉండాల్సిందే

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదేశం

ఇది భారత సంస్కృతిపై దాడి: కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూలై 19: ఉత్తరప్రదేశ్‌లో కావడి యాత్ర సాగే మార్గంలో అన్ని తినుబండారాల దుకాణాలపై వాటి యజమానుల పేర్లు తప్పనిసరిగా ఉండాల్సిందేనని సీఎం యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర పశ్చిమ యూపీలో దాదాపు 240 కిలోమీటర్ల పరిధిలో సాగుతుంది. ఏటా శ్రావణ మాసంలో 11 రోజుల పాటు జరిగే యాత్రలో భాగంగా ఈసారి దాదాపు 3కోట్ల మంది భక్తులు హరిద్వార్‌కు కాలినడకన వెళ్లి, గంగానదీ జలాలను సేకరిస్తారని అంచనా. యాత్ర సాగే మార్గంలోని హోటళ్లపై యజమానుల పేర్లు ప్రదర్శించాలన్న ఆదేశాలు వివాదాస్పదం కావడంపై ముజఫర్‌నగర్ పోలీసులు స్పందించారు. గతంలో యాత్ర మార్గంలో అన్ని రకాలైన ఆహార పదార్థాలను విక్రయించే కొందరు దుకాణదారులు...కావడిధారుల్లో గందరగోళం రేపి, శాంతిభద్రతల సమస్యలు సృష్టించే విధంగా తమ దుకాణాలకు పేర్లు పెట్టుకున్న ఘటనలు వెలుగు చూశాయని గుర్తుచేశారు. ఉపవాస దీక్షలో కావడి యాత్రకు వెళ్తున్న హిందువులకు స్వచ్ఛమైన శాకాహారం ఎక్కడ లభిస్తుందో తెలుసుకోవడానికి ఈ ఉత్తర్వులు ఉపయోగపడతాయని బీజేపీ సమర్థించుకుంది. అయితే, మతపరమైన విభేదాలను సృష్టించే ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని జేడీయూ నేత కేసీ త్యాగి పేర్కొన్నారు. కావడిధారులు ఎవరూ పొరపాటున కూడా ముస్లింలు నడిపే దుకాణాల్లో ఆహార పదార్థాలు కొనుగోలు చేయకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనినే దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష అని, హిట్లర్ జర్మనీలో 'యూదుల బాయ్‌కాట్' అని పిలిచేవారని ధ్వజమెత్తారు. దీనిని భారత సంస్కృతిపై దాడిగా కాంగ్రెస్ అభివర్ణించింది.





మంచిర్యాల జిల్లా భీమిని మండలం ఖర్జీభీంపూర్‌లో తెగిపోయిన వంతెన, భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గోపాల్‌పూర్‌లో వాగు ఉప్పొంగడంతో వరదనీటిలో మునిగిన పత్తి పంట

ఉధృతంగా వాగులు.. తెగిన రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 16.7 సెం.మీ., అదే జిల్లా పెంచికల్‌పేటలో 15.4, మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో 15.2, అదే జిల్లా కోటపల్లిలో 13.6, పెద్దపల్లి జిలా మంథని మండలంలో 12.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. బెజ్జూర్ మండలం కొత్తగూడలో భారీ వర్షానికి సోమిని-కృష్ణపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని ఏదులబందంలో తుతుంగ ప్రాజెక్టు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రహదారి తెగిపోయి సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా శ్రీరాంపూర్‌లోని ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పలు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం ఆలుబాకకు చెందిన బానారి రాజు అనే వ్యక్తి గోదావరిలో గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు వెళ్లిన అతడు వరదలో కొట్టుకుపోయాడు. నదీ ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభ్యం కాలేదు. వాజేడు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో గురువారం రాత్రి వర్షానికి స్లాబ్ పెచ్చులు ఊడిపడి కంప్యూటర్లు ధ్వంసమవ్వగా.. దస్తావేజులు దెబ్బతిన్నాయి. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో పత్తి, వరి పంటకు నష్టం వాటిల్లిందని సమాచారం. అదే జిల్లా కాటారం మండలంలో అలుగువాగు వద్ద బొలెరో వాహనం కొట్టుకుపోగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుసగా మూడో రోజూ వర్షం కురిసింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం పెరుగుతోంది. సాయంత్రానికి 26.5 అడుగులకు చేరుకుంది.

ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద

కృష్ణా-గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద క్రమంగా పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం సగానికి పైగా నిండింది. శుక్రవారం సాయంత్రానికి ఈ జలాశయానికి 1,07,632 క్యూసెక్కుల వరద వస్తోంది. తుంగభద్ర పూర్తి స్థాయి సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 59.80 టీఎంసీలున్నాయి. ఇక తుంగభద్ర ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండిపోయాయి. ఇక జూరాల ప్రాజెక్టును కృష్ణా జలాలు తాకాయి. ఈ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా... జలవిద్యుదుత్పాదనతో 37,905 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 32,673 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. నాగార్జునసాగర్‌కు 8,462 కూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. కాలువల ద్వారా 6,145 కూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక గోదావరి బేసిన్‌లోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు 17,283 క్యూసెక్కులు వరద వస్తోంది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)బ్యారేజీకి 3.75 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం)కు 3.47 లక్షల క్యూసెక్కులు, అదే మేడిగడ్డకు 3.41 క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... వచ్చింది వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు.

రెండ్రోజులు అత్యంత భారీ వర్షాలు..

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారానికి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి.. ఈ ఐదు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, భూపాలపల్లి, నిజామాబాద్.. ఈ 4 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది.

వరదలపై గంటకో సారి సమీక్షించండి: ఉత్తమ్

భారీ వర్షాల నేపథ్యంలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల్లోకి వచ్చే వరదను గంటకోసారి పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్లను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సూచించారు. కొత్తగూడెం జిల్లా పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటాన్ని దురదృష్టకర సంఘటనగా అభివర్ణించారు. ప్రాజెక్టుల నుంచి వరదను వదిలే క్రమంలో దిగువ ప్రాంతాల్లో తగిన హెచ్చరికలు జారీ చేయాలని, దీనికోసం స్టాండింగ్ ఆపరేషన్ ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా చూసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలోని ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు అందుబాటులో ఉండాలన్నారు. చీఫ్ ఇంజనీర్లు ఎవరూ కూడా హెడ్‌క్వార్టర్‌ను వీడరాదని నిర్దేశించారు. ఇటు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టులు, కాలువల గేట్లన్నీ పనిచేస్తున్నాయా? లేవా? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. భారీ వర్షాలతో 'మెరుపు వరదలు' వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల కింద నివాసముంటున్న వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.





కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో నీట మునిగిన పంట పొలాలు, భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

పెద వాగు ఖాళీ

- ప్రాజెక్టు గేట్ల వద్ద భారీ గండి.. దాదాపు రూ.20 కోట్ల నష్టం
- గుబ్బలమంగమ్మ అటవీ ప్రాంతంలో 31 సెం.మీ. వర్షం
- రాత్రికి రాత్రే ముంచెత్తిన వరద.. 70 ఇళ్లలోకి నీరు
- కూలిన 15 ఇళ్లు.. 200పైగా పశువుల మృత్యువాత
- తెలంగాణ, ఏపీలో 12 గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం
- నష్టం జల సంఘం దృష్టికి.. పూర్తి నిర్మాణానికి 100 కోట్లు అవసరం



ఖాళీ అయిన పెదవాగు ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ఖాళీ అయింది. గురువారం రాత్రి కట్ట పక్కనే పడిన గండి అర్ధరాత్రి తర్వాత క్రమంగా పెద్దదైంది. సుమారు 35 అడుగుల లోతులో ఉన్న నీరంతా దిగువకు పోయింది. ఎగువన ఉన్న గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతంలో ఆరు గంటల్లోనే 31.1 సెం.మీ. వర్షం కురవడంతో పెదవాగులోకి 80 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 21 అడుగులు కాగా ఔట్‌ఫ్లో కన్నా ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో మూడు గేట్లు తెరిచినా ప్రయోజనం లేకపోయింది. కట్టపై నుంచి వరద పొంగి ప్రవహించింది. అనేకచోట్ల కట్ట కోతకు గురైంది. గేట్ల పక్కనే పడిన గండి.. 150 మీటర్ల పొడవు, 15 మీటర్ల లోతుకు పెరిగింది. తెల్లారేసరికి పెదవాగు ఖాళీ అయింది. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణలో, ఆయకట్టు ఏపీ పరిధిలో ఉంది. తెలంగాణ పరిధిలోకి వచ్చే గుమ్మడపల్లి, కొత్తూరులో 70 ఇళ్లల్లోకి నీరు ప్రవేశించింది. ప్రాణనష్టం వాటిల్లలేదు. కాగా, కొత్తూరులో ఇళ్లలోకి 6 అడుగుల నీరు చేరడంతో ప్రజలు ఓ డాబాపైన, రేకుల కింద, మెట్లపైన నిలబడి ప్రాణాలు కాపాడుకున్నారు. రాత్రంతా జాగారం చేశారు. గుమ్మడపల్లిలో 15 ఇళ్లు కూలిపోయాయి. వీటితో పాటు బచ్చువారిగూడెం, నారాయణపురంలో 700 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 70 విద్యుత్ స్తంభాలు విరిగాయి. పెదవాగుకు గండి పడడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఈని ఆదేశించామని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. గండితో రూ.20 కోట్లపైగా నష్టం జరిగిందని నీటి పారుదల శాఖ అధికారులు నిర్ధారించారు. దీన్ని కేంద్ర జల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో కేంద్ర జలసంఘం, తెలంగాణ, ఆంధ్రా అధికారులు.. గండిని పరిశీలించనున్నారు. సత్వర మరమ్మతులకు సాధ్యమవుతుందా లేదా తాత్కాలిక మరమ్మతుల చేస్తారన్నది నిపుణుల బృందం తేల్చాల్సి ఉంది. పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.100 కోట్ల వరకు అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. తాత్కాలిక మరమ్మతులకు రూ.కోటి అవుతుందని సమాచారం. మంత్రి తుమ్మల నష్టం వివరాలను తెలుసుకున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో సమీక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ హెచ్చరికలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలబరినుంచి జోబైడెన్ తప్పుకోబోతున్నారని, సదరు నిష్క్రమణ ఉన్నతంగా, గౌరవంగా ఉండేందుకు ఏమిచేయాలన్న వ్యూహరచన ప్రస్తుతం సాగుతోందని వార్తలు వస్తున్నాయి. ఇటీవలి ప్రెసిడెన్షియల్ డిబేట్ తరువాత బైడెన్‌కు ఎదురుగాలి మరీ ఎక్కువైంది. ఒకపక్క సర్వేలు బైడెన్ వెనుకబడినట్టుగా చెబుతూంటే, మరోపక్క ఆయన ఇలా మాటల్లోనూ, చేతల్లోనూ తడబడుతూంటే ఈమారు విజయం అసాధ్యమని డెమోక్రాట్లకు అనిపించింది. ఇంతలో, ట్రంప్‌మీద హత్యాయత్నం జరగడంతో ఉన్న ఆశలు కూడా నీరుగారిపోయాయి. ట్రంప్ రెండడుగులు ముందున్నారని సర్వేలు తేల్చేశాయి. దీనికితోడు, ఇప్పుడు బైడెన్‌ను కరోనా చుట్టుముట్టి కదల్లేకుండా చేసింది. ఇన్ని కష్టాల మధ్య, ఇంతవయసులో పదవికోసం పాకులాడటం దేనికని బైడెన్‌కు జ్ఞానోదయం కలిగివుండవచ్చు. ఆయన తప్పుకొని ఆ స్థానంలో ఎవరు వచ్చినా ఈ ఆఖరుదశలో ఏమి అద్భుతాలు చేయగలరన్న ప్రశ్న ఉండనే ఉంది. ఎవరిని అధికారపీఠంమీద కూచోబెట్టాలన్నది అంతిమంగా అమెరికన్ల ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుంది కానీ, అది డోనాల్డ్ ట్రంప్ అయినపక్షంలో అమెరికా విదేశాంగవిధానంమీద ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందన్న మాట నిజం.

ఇటీవల రిపబ్లికన్ పార్టీ కన్వెన్షన్ సందర్భంగా తైవాన్‌కు సంబంధించి ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అలవోకగా అన్నవి కావు. చైనానుంచి దానిని రక్షించాలంటే అమెరికాకు తైవాన్ మరింత ఎక్కువ కప్పం కట్టాలన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. తైవాన్‌ను కాపాడటానికి చాలా ఖర్చవుతోందనీ, అమెరికా చిప్‌మార్కెట్‌ను తన్నుకుపోయి, ఇక్కడి ఉపాధి అవకాశాలను చావుదెబ్బతీసిన తైవాన్ భద్రతకు పూచీపడాలంటే ఆ రేటు ఎక్కువగా ఉంటుందని ఆయన నర్మగర్భమైన వ్యాఖ్యలు చేశారు. తైవాన్ అతిజాగ్రత్తగా ప్రతిస్పందించింది కానీ, ట్రంప్‌మాటలు అమెరికా విశ్లేషకులకు, మీడియాకు ఆగ్రహాన్ని కలిగించాయి. నేను అధికారంలోకి రాగానే నువ్వు తైవాన్‌తో యుద్ధం చేయి, దానిని వశం చేసుకో, నేను నోరువిప్పను, జోక్యం చేసుకోను అని ట్రంప్ ముందే చైనాకు సందేశం ఇచ్చేశారని, దానిముందు సాగిలబడ్డారని సుప్రసిద్ధ అమెరికన్ దినపత్రిక తీవ్రంగా విరుచుకుపడ్డది. తైవాన్‌ను ఆదినుంచీ అమెరికా కాపాడుకొస్తున్నది. ఈ మధ్యన చైనా సైనికకవాతులతో, యుద్ధవిమానాలతో తైవాన్‌ను బెదిరించినప్పుడు అమెరికా మరింత తీవ్రంగా రంగంలోకి దిగింది. తైవాన్‌ను తనలో విలీనం చేసుకోవాలన్న చైనా లక్ష్యం, దాని ప్రాతిపదికలు, విధానాలు అందరికీ తెలిసినవే. ఈ నేపథ్యంలో, తైవాన్‌ను ట్రంప్ తూలనాడటం, అది తన భద్రతను తానే చూసుకోవాలని అనడం, 68మైళ్ళ దూరంలో ఉన్న చైనా దానిని దురాక్రమించిన పక్షంలో 9, 500మైళ్ల దూరంలో ఉన్న అమెరికా వచ్చి రక్షించడం అసాధ్యమన్న భావన వెలిబుచ్చడం ఆశ్చర్యం కలిగిస్తాయి. ఏటా కొన్ని వందలకోట్ల ఆయుధసామగ్రిని అమెరికానుంచి అది కొంటున్నది. పెడుతున్న ఖర్చుకంటే అమెరికా పొందుతున్నదే ఎక్కువని లెక్కలు చెబుతున్నాయి. గత నలభైయేళ్ళ కాలంలో కనీసం వందసార్లు అమెరికా అమ్మిన ఆయుధాలన్నీ బేరం లేకుండా కొని తైవాన్ తన రక్షణఫీజు చెల్లించుకుంటూనే ఉంది. అయినా కూడా ట్రంప్, అనంతరం ఆయన విధాన సలహాదారు ఈ వ్యాఖ్యలు చేశారంటే, తైవాన్‌నుంచి మరింత పిండుకోవాలన్నది ఉద్దేశం కావచ్చు, లేదా చైనాకు శాంతి, సయోధ్యల సందేశమూ కావచ్చు. చైనాతో బేరసారాలకు తైవాన్‌ను ఎరవేసేప్రయత్నమూ కావచ్చు. ఈ సందర్భంగా ఆయన అమెరికాను ఓ బీమాకంపెనీతో పోల్చడం విశేషం. మరి, ప్రాణంమీదకు వస్తే, తైవాన్‌ను వచ్చి రక్షిస్తుందా? ట్రంప్ వ్యాఖ్యల్లో లేదన్న సమాధానం స్పష్టంగా ఉంది. ఆయన గతంలో జింగ్‌పింగ్‌తో మాట్లాడుతూ ఒకే చైనా విధానానికి సానుకూలత వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనూ ట్రంప్ ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. తాను అధికారంలో ఉండివుంటే యుద్ధమే జరిగేది కాదన్న ట్రంప్ ఆ తరువాత ఉక్రెయిన్‌కి అందించే ఆయుధ, ఆర్థిక సహాయాల విషయంలో ఇప్పటివిధానానికి పూర్తిభిన్నంగా వ్యాఖ్యలు చేస్తూ జెలెన్‌స్కీని ఇరుకునపెట్టారు. తాను గెలిస్తే సైనికసాయం ఆపేస్తానని ప్రకటించి, పుతిన్‌తో బేరాలాడుకున్న విమర్శలు ఎదుర్కొన్నాడు. తైవాన్, ఉక్రెయిన్, గాజా ఇత్యాది విషయాల్లో రేపు ఒకవేళ అధికారంలోకి వస్తే గనుక ట్రంప్ ఏవిధంగా వ్యవహరిస్తారో చూడాలి.

బడ్జెట్: సగటుజీవికి భరోసానిచ్చేనా?

దేశ ఆర్థిక వ్యవస్థ సదా అభివృద్ధిదాయకంగా ఉండాలని కోరుకోనివారు ఎవరు ఉంటారు? సామాన్యుల శ్రేయస్సును హృదయపూర్వకంగా కోరుకుంటున్న వ్యక్తిగా కేంద్ర వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే తరుణంలో సంబంధిత విషయాలను నేను శ్రద్ధగా చదువుతాను, నిశితంగా ఆలోచిస్తాను, సవివరంగా రాస్తాను... అయినా బడ్జెట్ రోజున తరచు అసంతృప్తితోనే పార్లమెంటు నుంచి ఇంటికి వెళ్లడం పరిపాటి అయిపోయింది. ఆ తరువాత ప్రజల వద్దకు వెళతాను, శాసనసభ్యులు, ఆర్థికవేత్తలు, వ్యాపారస్తులు, రైతులు, మహిళలు, యువజనులు, మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలతో సహా వివిధ జీవన రంగాలలోని వారితో మాటామంతీ జరుపుతాను. కొత్త బడ్జెట్ గురించి ప్రజల, ముఖ్యంగా స్థానిక మార్కెట్లలో సామాన్యుల ప్రతిస్పందనలు ఎలా ఉన్నాయో పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకుంటాను గత పదేళ్లుగా ఏటా, బడ్జెట్ 'ప్రకటనలు' కేవలం 48 గంటలలోనే జాడలేకుండా పోవడాన్ని, ప్రజల ఆసక్తి బడ్జెటేతర అంశాలపైకి మళ్లడాన్ని నేను గమనిస్తూ వస్తున్నాను.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కేంద్ర వార్షిక బడ్జెట్‌లు ఎందుకు ఆశాభంగం కలిగిస్తున్నాయి? ప్రజల జీవన వ్యయాల వాస్తవాలపై బడ్జెట్ రూపకర్తలకు అవగాహన కొరవడడంతో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై నిష్పాక్షిక అంచనాకు రావడంలో విఫలమవుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లు కలిగిస్తున్న ఆశాభంగానికి అదే ప్రధాన కారణమని నేను విశ్వసిస్తున్నాను. ఈ నెల 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 వార్షిక బడ్జెట్‌నే తీసుకోండి. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై వాస్తవిక అంచనా వెల్లడించే సత్యాలు ఏమిటి? యువజనుల, కుటుంబాల శ్రేయస్సుకు, సామాజిక శాంతికి నిరుద్యోగిత అతి పెద్ద సవాల్‌గా ఉన్నది. కొన్ని డజన్ల ఉద్యోగ ఖాళీలకు వేలాది యువజనులు దరఖాస్తు చేస్తున్నారు. కేవలం ఒకటి రెండు వేల ఉద్యోగ ఖాళీలకు లక్షలాది నిరుద్యోగులు దరఖాస్తు చేస్తున్నారు. పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారు. ప్రశ్న పత్రాలు లీక్ అవుతున్నాయి. ఉద్యోగాలకు ముడుపులు చెల్లిస్తున్నారు. కొన్ని పరీక్షలు లేదా ఇంటర్వ్యూలు ఆఖరి నిమిషంలో రద్దవుతున్నాయి. దీనివల్ల మాటల్లో చెప్పలేని అవస్థలకు లోనవుతున్నవారు ఎందరో! ఇవన్నీ, ముమ్మరమవుతోన్న నిరుద్యోగిత పర్యవసానాలే అనడంలో సందేహం లేదు. సీఎమ్ఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) తాజా నివేదిక ప్రకారం అఖిల భారత నిరుద్యోగిత రేటు 9.2 శాతం. వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని అంటున్నారు (నిజానికి ఆ పెరుగుదల ప్రచ్ఛన్న నిరుద్యోగితే). అలాగే నిర్మాణ రంగంలోనూ ఉద్యోగాలు పెరిగాయని అంటున్నారు (వాస్తవానికి ఇవి అవ్యవస్థిత ఉద్యోగాలు). ఇక గిగ్ ఎకానమీ (ప్రజల శ్రామిక శక్తి తాత్కాలిక లేదా పార్ట్–టైమ్ ఉద్యోగంలో పాల్గొనే ఆర్థిక వ్యవస్థ)లో ఉద్యోగాలు ఏ మాత్రం భద్రత లేనివి.

భద్రత, మంచి వేతన భత్యాలు లభించే ఉద్యోగాలనే యువజనులు సహజంగా ఆశిస్తున్నారు. అటువంటి ఉద్యోగాలు ప్రభుత్వంలోను, ప్రభుత్వ రంగ లేదా ప్రభుత్వ నియంత్రిత సంస్థలలో మాత్రమే లభిస్తాయి. 2024 సంవత్సరం ఆరంభంలో కేంద్ర ప్రభుత్వంలో 10 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అయితే వాటిని భర్తీ చేసేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టడం కాదు కదా కనీసం శ్రద్ధ చూపుతున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. భద్రత, మంచి వేతన భత్యాలు లభించే ఉద్యోగాలను తయారీ రంగంలోను, సేవల రంగంలోను సృష్టించవచ్చు. ముఖ్యంగా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, షిప్పింగ్, పౌర విమానయానం, ఆతిథ్యం, ఆరోగ్య భద్రత, విద్య, పరిశోధన... అభివృద్ధి రంగాలలో కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. తయారీ రంగంలో ఉత్పత్తి విలువ జీడీపీలో 15 శాతంగా మాత్రమే ఉన్నది. అది అంతకు మించడం లేదు. కారణమేమిటి? దేశీయ పారిశ్రామికవేత్తలు వస్తూత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనుకాడడమేనని చెప్పక తప్పదు.

దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాల్ ధరల పెరుగుదల లేదా ద్రవ్యోల్బణం. ప్రభుత్వ అంచనాల ప్రకారమే టోకు ధరల ద్రవ్యోల్బణం 3.4 శాతంగా ఉన్నది. వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉండగా ఆహార ద్రవ్యోల్బణం 9.4శాతంగా ఉన్నది. మన సువిశాల భారత దేశం ఒక అఖండ మార్కెట్ కాదు. సరుకులు, సేవలు దేశంలోని ప్రతి ప్రాంతానికి స్వేచ్ఛగా ప్రవహించే పరిస్థితి లేదు. వస్తు సేవల ధరలు ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి భిన్నంగా ఉంటాయి. అలాగే ఒక రాష్ట్రం పరిధిలోని బాగా అభివృద్ధి చెందిన జిల్లాలలోను, మారుమూల జిల్లాలలోను ఆ రేట్లు ఒకే విధంగా ఉండవు. పై స్థాయిలో ఉన్న 20 నుంచి 30శాతం కుటుంబాలను మినహాయిస్తే మిగతా జనాభాలో ప్రతి కుటుంబమూ ద్రవ్యోల్బణంతో సతమతమవుతోంది. ఈ దురవస్థపై కొంత మంది చిరచిరలాడుతుండగా అత్యధికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

సరే, మరో నాలుగు రోజుల్లో కొత్త బడ్జెట్ రానున్నది. గౌరవనీయ ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసాన్ని మీరు వింటారు లేదా చదువుతారు. నిరుద్యోగిత సమస్య తీవ్రతను తగ్గించేందుకు, నింగినంటిన ధరలను భూమి మీదకు తీసుకువచ్చేందుకు బడ్జెట్‌లో ఆమె చేపట్టే చర్యలపై మీ సంతృప్తి స్థాయిని బట్టి ఆ బడ్జెట్‌కు 50 మార్కుల మేరకు ఇవ్వవచ్చు. మిగతా 50 మార్కులను విద్యా వైద్య రంగాలకు, ప్రజలు ప్రాధాన్యమిచ్చే ఇతర రంగాలకు చేసిన కేటాయింపులను బట్టి ఇవ్వవచ్చు. ఉత్కృష్ట ప్రమాణాలు లోపించిన విద్యారంగం, నాసిరకం ఆరోగ్య భద్రతా సేవలు కొనసాగుతున్నంతవరకు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం కాదు, కాబోదు. విద్యారంగం, ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగంలో ప్రమాణాలు చాలా చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. బాలలు 7 నుంచి 8 సంవత్సరాల పాటు పాఠశాల విద్యాభ్యాసం చేస్తారు. దాదాపు సగం మంది బాలలు మాతృభాషలో సైతం సరిగా చదవలేని, రాయలేని పరిస్థితి ఉన్నది. అలాగే చాలా తేలిక కూడికలు, తీసివేతలు, భాగహారాలు కూడా వారు చేయలేకపోతున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మరి ఇటువంటి బాలలు ఎటువంటి నైపుణ్యాలతో పెరిగి పెద్దవారవుతారు? ఎటువంటి ఉద్యోగాలకు వారు అర్హులవుతారు? ఏకోపాధ్యాయ పాఠశాలలు వేల సంఖ్యలో ఉన్నాయి. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. లైబ్రరీలు, లేబొరేటరీలు అలా ఉంచి కనీస బోధనా సహాయ పరికరాలు లేని పాఠశాలలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఈ మౌలిక సమస్యలను సత్వరమే పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ప్రోద్బలించాలి. అంతేగాని విలువైన వనరులు, సమయాన్ని వివాదాస్పద నూతన విద్యా విధానం, కుంభకోణాల మయమైన ఎన్‌టీఏ/ నీట్‌పై వృథా చేయకూడదు.



నిరుద్యోగిత సమస్య తీవ్రతను తగ్గించేందుకు, నింగినంటిన ధరలను భూమి మీదకు తీసుకు వచ్చేందుకు ఈ నెల 23న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో పటిష్ఠ చర్యలు ఉంటాయా? ప్రజల జీవన వ్యయాల వాస్తవాలపై సరైన అవగాహన కొరవడడంతో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులపై నిష్పాక్షిక అంచనాకు రావడంలో బడ్జెట్ రూపకర్తలు విఫలమవుతున్నారు. కేంద్ర వార్షిక బడ్జెట్‌లు కలిగిస్తున్న ఆశాభంగానికి ఇదే ప్రధాన కారణమనడంలో సందేహం లేదు.

విద్యారంగం కంటే ఆరోగ్య భద్రతా రంగం మెరుగ్గా ఉందేమో గానీ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అదే సరిపోదు. ప్రజారోగ్య వ్యవస్థ పరిమాణాత్మకంగా పెరుగుతుందే గానీ నాణ్యతాపరంగా పెరగడం లేదు. ఆరోగ్య భద్రతకు దేశ ప్రజలు చేస్తున్న మొత్తం వ్యయంలో 47 శాతాన్ని స్వయంగా తమ ఆదాయం నుంచి భరిస్తున్నారని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రైవేట్ వైద్యరంగం పరిమాణాత్మకంగానే కాకుండా నాణ్యతతో కూడిన సేవలపరంగా కూడా విస్తృతంగా పెరుగుతోంది. అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యానికి అయ్యే ఖర్చులను భరించగల శక్తి దేశ జనాభాలో ఎంత మందికి ఉంది? అత్యధికులకు లేదనేది స్పష్టం. మొత్తం మీద డాక్టర్ల, నర్సుల, మెడికల్ టెక్నీషియన్ల లోటు, డయాగ్నోస్టిక్ పరికరాల కొరత చాలా తీవ్రంగా ఉన్నది. ఇదొక కఠోర వాస్తవం. ఆరోగ్య భద్రతపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయం జీడీపీలో 0.28 శాతానికి తగ్గి పోయింది. ఆరోగ్య భద్రతకు చేస్తున్న మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం 1.9 శాతంగా మాత్రమే ఉంది. ప్రజారోగ్య వ్యవస్థ తీరుతెన్నుల పట్ల ప్రజల సంతృప్తి చాలా చాలా స్వల్పంగా మాత్రమే ఉన్నది.

సరే, ఎదుగు బొదుగు లేని వేతనాలు, కుటుంబ రుణ భారం పెరుగుదల, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, విద్యారుణాల భారం, అగ్నిపథ్ పథకం మొదలైన సమస్యలకు ప్రాధాన్యమిస్తున్నవారు ఎందరో ఉన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే మార్గాలు ఉన్నాయి: కనీస వేతనాన్ని రూ.400గా నిర్ణయించడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం; విద్యారుణాల మాఫీ, అగ్నిపథ్ రద్దు. మరి ప్రస్తుత పాలకులు ఈ పరిష్కార మార్గాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతే కాదు, వాటిని అవహేళన చేస్తున్నారు! తత్కారణంగానే 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ గెలుచుకున్న సీట్ల సంఖ్య ఘోరంగా తగ్గిపోయింది. అయినా బీజేపీ పశ్చాత్తాపపడటం లేదు! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాపై పునరాలోచించే యోచన ఏ మాత్రం లేదని ఆ పార్టీ నాయకుల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి బుద్ధిచెప్పిన ఓటర్లు ఆ తరువాత 13 అసెంబ్లీ ఉపఎన్నికలలో మరోసారి ఆ పార్టీకి చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు. ఆ ఉపఎన్నికలలో ఇండియా కూటమి 10 స్థానాలను గెలుచుకున్నది. ప్రతిపక్ష కూటమి ఓట్ల వాటా సైతం గణనీయంగా పెరగడం గమనార్హం. యధార్థమేమిటంటే మోదీ సర్కార్ పాలన పట్ల దేశ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కనుకనే ఎన్నికలలో ప్రతిపక్ష కూటమికి ఓటు వేయడం ద్వారా పాలనా పద్ధతులను మార్చుకోవాలని దేశ పాలకులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరి వచ్చేవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2024–25 సంవత్సర వార్షిక బడ్జెట్ ఆ హెచ్చరికలకు సరైన రీతిలో ప్రతిస్పందిస్తుందా?


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సమగ్రాభివృద్ధికి జీడీపీ కొలమానం కాదు

ఒక దేశ జీడీపీ పెరిగినంత మాత్రాన అక్కడి పేదరికం, నిరుద్యోగం తొలగిపోయి ఆ దేశం సమగ్రాభివృద్ధి చెందినట్టు భావించకూడదు. పెరిగిన అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలకు, సామాన్యులకు అందినప్పుడే వారి ఆదాయాలు పెరిగి, తద్వారా కొనుగోలు శక్తి పెరిగి, జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

భారతదేశంలో కానీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జపాన్, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, కెనడా దేశాలలో గానీ, ఆదాయ సంపదలు కొద్ది శాతం పెట్టుబడిదారులు, వ్యాపారస్థుల చేతిలో కేంద్రీకృతమైపోయాయి. అందువల్ల ఆ దేశాలలో మౌలిక సమస్యలైన పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు.

మన భారతదేశంలో వివిధ సంస్థల అధ్యయనం ప్రకారం 5 శాతం జనాభా చేతిలో సుమారు 65శాతం దేశ సంపద కేంద్రీకృతమై ఉంది. మిగతా 95 శాతం మంది చేతిలో సుమారు 35 శాతం సంపద మాత్రమే ఉన్నది. అందువల్ల మన దేశంలో 90 శాతం ప్రజలు ప్రతి నిత్యం కనీస మౌలిక సదుపాయలైన గృహవసతి, విద్య, వైద్యం, పోషకాహారం, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ఇబ్బంది పడుతూ జీవనం సాగిస్తున్నారు.



మనకు స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో మన దేశం వ్యవసాయ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక సేవా రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినప్పటికీ, మన జీడీపీ గతంలో ఎన్నోసార్లు 6 నుంచి 8 శాతం చేరుకున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ సమస్య ప్రతి ఏటా పెరుగుతున్నది. మన దేశంలోని జనాభాలో 35 సంవత్సరాల లోపు యువకులు దాదాపు 50 శాతం ఉన్నప్పటికీ వారికి స్థానికంగా ఉద్యోగాలు లభించక ప్రతి ఏటా కొన్ని లక్షలమంది యువకులు ఉద్యోగాలు వెతుక్కుంటూ అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, జపాన్, జర్మన్, గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు.

మన దేశంలో పుష్కలమైన సహజ వనరులు, సారవంతమైన వ్యవసాయ భూములు, జీవనదులు, అటవీ సంపద, ఖనిజ సంపద, సమర్థవంతమైన మానవ వనరులు, శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లు, సాంకేతిక నిపుణులు, ఉన్నత విద్యావంతులు ఉన్నప్పటికీ దేశ ప్రజలు ఆర్థికంగా వెనకబడి ఉన్నారు. జీఎస్టీ, ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు 80లక్షల కోట్ల దాకా ప్రతి ఏటా రాబడి వస్తున్నది. అయినప్పటికీ చెప్పుకోతగ్గ అభివృద్ధి సాధించలేకపోతున్నాం. ప్రభుత్వాలు రెవెన్యూ రాబడికి అదనంగా కొన్ని లక్షల కోట్ల రూపాయలు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల ద్వారా అప్పుల రూపంలో సమీకరించి అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నప్పటికీ దేశంలో ప్రజల ఆదాయాలు ప్రభుత్వ ఖర్చులకు అనుగుణంగా పెరగటం లేదు.

ప్రభుత్వానికి ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకున్నట్లయితే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకెళ్ళగలదు. పన్నుల ఎగవేతను, నిధుల దుర్వినియోగాన్ని అవినీతిని నిర్మూలించగలగాలి. బినామీ ఆస్తుల నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చెయ్యడంతో పాటు భూముల నిజ విలువ (మార్కెట్) ఆధారంగా స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ ఛార్జీలు విధించటం, నల్లధనాన్ని పూర్తిగా అరికట్టి 90 శాతం డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించటం ద్వారా ఆదనపు ఆదాయాన్ని రాబట్టి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చును. ఇందులో భాగంగా 500 రూపాయల నోట్లు రద్దు చెయ్యాలి. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రోడ్లు, రైల్వేలు, నౌకయానం, ప్రజా రవాణ, విద్యుత్‌శక్తి మొదలైన మౌలిక వసతుల రంగాలలో మూలధన పెట్టుబడి పెంచాలి. ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలు సమాజంలో పేదలు, అర్హులు, సామాన్యులకు మాత్రమే ఇవ్వడం ద్వారా వృథా ఖర్చులు అరికట్టి బడ్జెట్‌లో మిగులు సాధించి పేదల సంక్షేమానికి అదనంగా ఖర్చు పెట్టవచ్చు.


అంతే కాకుండా ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో 60 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి వయోవృద్ధునికి ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుంది. మన దేశంలో కూడా ఎలాంటి పెన్షన్ పొందని 60 ఏళ్ళు నిండిన వృద్ధులందరికీ ప్రతి నెలా కనీసం రూ.5000 పెన్షన్ అందజేయాలి. ప్రఖ్యాత నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్య సేన్ అభిప్రాయం ప్రకారం పేద ప్రజలు, రైతులు, కూలీలు, సామాన్యులు, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలు రెట్టింపు అయినట్లయితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వస్తువు సేవలకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా పారిశ్రామిక, సేవా రంగాలు అభివృద్ధి చెంది మొత్తం ఆర్థిక వ్యవస్థలలోని అన్ని రంగాలు సమతుల్యంగా అభివృద్ధి చెందుతాయి. ఆ విధంగా పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తొలగిపోగలవు. దేశంలోని ప్రతి పౌరునికి ఆర్థిక, సామాజిక భద్రత లభించినప్పుడే దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లుగా భావించాలి.

○ కోట విద్యాసాగర్ రెడ్డి
న్యాయవాది

నోటిఫికేషన్లను చూసి ఓర్వలేక!

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎలాగైనా పడగొట్టాలన్న ధ్యాసే తప్ప గత పదేళ్లలో చేసిన తప్పులను గ్రహించి సరైన ప్రతిపక్ష పార్టీగా ఎదగాలన్న సోయి లేని బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొంగే 'దొంగ దొంగ' అని అరిచినట్టు వ్యవహరిస్తున్నారు. ఎల్లవేళలా నిరుద్యోగుల పక్షాన ఉంటూ వారి కోరికలు నెరవేర్చడానికి ఏర్పడిందే కాంగ్రెస్ ప్రభుత్వం. కానీ కేసీఆర్ మాత్రం ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వాన్ని ఏడు నెలలకే గాయపరచాలని, ఇంకో ఆరు నెలల లోపు భూస్థాపితం చేయాలని విచిత్రమైన కలలు కంటున్నారు.

ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకు విద్యా వ్యవస్థను అత్యంత నిర్లక్ష్యానికి గురి చేసిన చరిత్ర కేసీఆర్ పాలనదే! తెలంగాణలో చాలా స్కూళ్లు పాతబడి కూలడానికి సిద్ధంగా ఉన్నా వాటి వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ పాఠశాలలకు, గురుకుల పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులు, సొంత భవనాలు లేక అద్దె భవనాలలో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదు. మధ్యాహ్న భోజనానికి సరైన నిధులు కేటాయించమని ఎన్నిసార్లు విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు మొత్తుకున్నా కనికరించలేదు. విద్యార్థులు లేరన్న సాకుతో ఎన్నో ప్రభుత్వ పాఠశాలలను, జూనియర్ కాలేజీలను మూసివేశారు. యూనివర్సిటీల పరిస్థితి చెప్పనవసరం లేదు. సరైన మౌలిక వసతులు లేక, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ లేక వాటిని మూసివేసే పరిస్థితికి దిగజార్చారు. పార్టీ అనుచరులతోనే ప్రైవేటు యూనివర్సిటీలను పెట్టించి ప్రైవేటు విద్యా రంగాన్ని ప్రోత్సహించారు. నాడు నిరుద్యోగుల విషయంలో జరిగిన పొరపాటు వల్లనే అధికారాన్ని కోల్పోయామని గ్రహించిన బీఆర్ఎస్ పార్టీ పెద్దలు నేడు అదే నిరుద్యోగులను మరోసారి అస్త్రంగా తీసుకొని వారి జీవితాలతో చెలగాటం ఆడాలని చూస్తున్నారు.



నిరుద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు ఎవరైనా ఎప్పుడైనా పోరాటం చేయాల్సిందే, తప్పులేదు. కానీ గత పదేళ్లలో ఏ నోటిఫికేషన్ కూడా సరైన పద్ధతిలో వేసి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చిన సందర్భం లేదు. తెలంగాణ వస్తే ప్రతి నిరుద్యోగికీ ఉద్యోగం వస్తుందని చెప్పి వారిని ఉద్యమంలోకి లాగి ప్రాణాలను బలితీసుకున్న కేసీఆర్, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా నిరుద్యోగుల బలిదానాలు ఆగకపోవడానికి కారణాలు ఏంటో తెలుసుకోలేకపోయాడు. పైగా ఉద్యోగాలు వేయమని ధర్నాలు, ఉద్యమాలు చేసినవారిపై అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు మిగతా అన్ని యూనివర్సిటీలలో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేయకుండా కట్టడి చేసేందుకు యూనివర్సిటీ వీసీలను తోలుబొమ్మల్లాగ ఆడించారు. ప్రతి రోజు యూనివర్సిటీలో పోలీస్ పికెటింగులు నిర్వహించారు. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఇన్‌ఫార్మర్ పోలీసులతో ఉద్యమకారులపై నిఘా పెట్టి అరెస్టు చేశారు. ఆర్ట్స్ కాలేజ్ ముందు ధర్నాలు చేయొద్దు, మీటింగులు పెట్టొద్దు, దిష్టిబొమ్మలు దగ్ధం చెయ్యొద్దంటూ, కనీసం నిరసన తెలిపే హక్కు లేదన్నట్లు నిర్బంధించారు. నిరుద్యోగులను, విద్యార్థి సంఘాలను హాస్టల్లోనే నిర్బంధించి గది గదికీ తిరిగి అరెస్టు చేయించేలా వైస్ ఛాన్సలర్ల చేత నోటీసులు ఇప్పించారు. ఏం అప్పుడు విద్యార్థులు చేసిన ఉద్యమాలు మీ కంటికి కనిపించలేదా? అధికారంలో ఉంటే ఒకలా లేకపోతే ఇంకోలా ప్రవర్తిస్తారా!

నోటిఫికేషన్లు ఇచ్చిన కొన్ని రోజుల వ్యవధిలోనే గురుకుల పరీక్షలు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా! అప్పుడు గుర్తు రాలేదా పరీక్ష పరీక్షకు మధ్య వ్యవధి ఉండాలని? అప్పుడు పోస్టులు పెంచాలని అడిగిన నిరుద్యోగులను హేళన చేసింది మీరే కదా! జీవో 46ను మీకు సోయి లేకుండానే ఇచ్చారా? ఎన్నోసార్లు ఈ జీవోను ఎత్తేయండి అని నిరుద్యోగులు మిమ్మల్ని కలవాలని ప్రయత్నించినా ఒక్కసారీ కలవలేదు. నిరుద్యోగులతో ఏమైతుందిలే అనుకుని వారి ఉద్యమాలను అణచివేశారు. గత 10 ఏళ్ల నుంచి గ్రూప్–1 పరీక్ష నిర్వహించకుండా పేపర్ లీక్ చేస్తూ పోస్టులు అమ్ముకొని, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా అన్యాయం చేశారు. 2016, 2017లో నిర్వహించిన డీఎస్సీ గ్రూప్–2 పరీక్షల తర్వాత దాదాపు ఎనిమిదేళ్ళుగా మళ్లీ నోటిఫికేషన్లు లేవు. ఇప్పుడు ఈ అన్ని పరీక్షలూ నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రధాన ఎజెండాతో పనిచేస్తున్నారు! మీరు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఇప్పటి నోటిఫికేషన్లకు తేడా మీరే చూస్కోండి. అయినా మీరు చెప్పకపోయినా నిరుద్యోగుల కోరికలను పరిగణనలోకి తీసుకొని పరీక్షకూ పరీక్షకూ మధ్య వ్యవధి ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తపడుతూనే ఉంది.

– మండ్ల రవి
ఉస్మానియా యూనివర్సిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం

యెల్లలూ యవనికలూ లేని వేదికల మీద కొందరు ముందు తరాలకు గుర్తుండిపోయే జుగల్బందీలు ఆలపిస్తారు; ప్రగతికి నిలువెత్తు బుజువులై నిలిచిపోతారు. జీవన ఉద్గ్రంథంలో సరికొత్త అధ్యాయాలకు తెరతీసే పవిత్ర యాగం చేస్తారు. పృథ్వి మీద తాము వేసే ప్రతీ పాదముద్రా ఒక చిత్రకల్పన చేసుకుంటారు. కొందరే కోట్లాది జనులకు నడక నేర్పుతారు. కొందరే ప్రవాహానికి ఎదురీదు పైన నిలిచి పరిప్లవిస్తారు. ఈ కోవకు చెందిన మహిళ ముత్తు లక్ష్మి రెడ్డి.

స్త్రీల దాస్య విమోచనాన్ని జీర్ణించుకోలేని పితృస్వామ్య భావజాలాన్ని ఆమె శతాబ్దం కిందటే ప్రశ్నించారు. పురోగమనం వాంఛించే చాలామందిలా ఆమె సామాజిక రుగ్మతలను ప్రశ్నించడంతో ఆగిపోలేదు; ఆగ్రహం వ్యక్తం చేసి ఊరుకోలేదు. క్రియాత్మక పరిష్కారాలు ఆవిష్కరించి అమలు చేసిన అరుదైన ధీరోదాత్త ముత్తు లక్ష్మి రెడ్డి.

ముత్తు లక్ష్మి పుదుక్కోటైలో 1886 జూలై 30న జన్మించింది. నారాయణస్వామి, చంద్రమ్మాళ్ ఆమె తల్లిదండ్రులు. చంద్రమ్మాళ్ దేవదాసి వనిత. ఆ కారణంగానే తండ్రివైపు జనం ఈ కుటుంబాన్ని దూరం నెట్టారు. మిగిలిందిక తల్లివైపు దేవదాసి కుటుంబాల సాన్నిహిత్యమే. ఈ సామీప్యమే లింగ వివక్ష, స్త్రీల కనీస హక్కుల గురించి ముత్తు లక్ష్మి జీవితంలో సాగించిన పోరాటానికి పునాది.

మహిళల్ని చుట్టుకున్న న్యూనత సర్వం సమాజం అల్లిన సాలెగూడేనని ముత్తు లక్ష్మి ఎదుగుతున్న ఆడపిల్లగా తొలి నాళ్ళలోనే తెలుసుకున్నారు. నొక్కేసిన గొంతులకు ఆవిడ వక్త, వ్యవహర్త అయ్యారు. దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలూ, పురుషాధిపత్య సమాజంలో ఒంటరి మహిళల అగచాట్లూ ముత్తు లక్ష్మిని తొలి నుంచీ కలవరపెట్టాయి. ఆడపిల్లల చదువుకు ఆంక్షలు ఉన్న ఆ కాలంలోనే ముత్తు లక్ష్మి రెడ్డి 1912లో మద్రాసు వైద్య కళాశాల నుంచి పట్టా అందుకున్నారు.



జాతి మనుగడకు జవం, జీవం నింపాలని తనవంతు సంపూర్ణ కృషి నిరంతరాయంగా నిర్వహించి నిష్క్రమించిన పురోగమనాభిలాషి ముత్తులక్ష్మి రెడ్డి. 'గుంపుకి పరిమితమైతే మహిళ అక్కడే నిలబడిపోతుంది; ఒంటిగానైనా సరే ముందుకెళ్ళే స్త్రీ ఇతరులకు దుస్సాధ్యమైన మజిలీలు చూస్తుంది' అని ఐన్‌స్టీన్ అన్నారు. దేవదాసీ విధానం రద్దు, కనీస వివాహ వయసు పెంపు, నిర్బంధ వ్యభిచారం రద్దు, బాలల హక్కుల రక్షణ తదితర లక్ష్యాలకోసం పాటుపడిన మహనీయురాలు ముత్తులక్ష్మి.

పుదుక్కొటై మహారాజా హైస్కూల్‌లో చదువు ముగించుకుని ముత్తు లక్ష్మి 1907లో మద్రాసు వైద్య విద్యా కళాశాలలో చేరారు. సర్జరీ విభాగానికి ప్రవేశం పొందిన తొలి భారతీయ మహిళ ముత్తు లక్ష్మి అని వినికిడి. వైద్య విద్యార్థినిగా ఉన్నప్పుడే సరోజినీనాయుడు, అనీబిసెంట్‌లతో ఆమెకు పరిచయమైంది. కారణాలేమైనప్పటికీ ఆ రోజుల్లో సంపన్న వర్గాల స్త్రీలు చాలా వరకు తమ సంతానానికి తామే స్తన్యం ఇచ్చేవారు కాదు. నిమ్న జాతి మహిళలెవరో ఆ పసిబిడ్డలకి పాలిచ్చేవారు. డాక్టర్ అయ్యాక ముత్తు లక్ష్మి ఈ అవివేక, అశాస్త్రీయ దురాచారాన్ని రూపుమాపేందుకు కృషి చేశారు.

1914లో ఆమెకు 28 ఏళ్ళ వయసులో ఆమె డాక్టర్ సుందర రెడ్డిని పరిణయమాడారు. వ్యక్తిగా, ఒక మహిళగా తన సంపూర్ణ స్వాతంత్ర్యానికి వివాహం ఏ రకంగానూ అడ్డంకి కాకూడదని భర్తతో అంగీకారం కుదిరాకే వాళ్ళ వివాహం అయిందని అంటారు. సంస్కరణాపేక్ష ఉన్నవాళ్ళు జీవితాన్ని క్షేమంగా, నిమ్మళంగా ఏదో తూగుటూయల ఊగినట్టు తీసుకోరు. కీర్తి, యశస్సు వాళ్ళ ప్రాధాన్యాలెప్పటికీ కావు. ఒక చిన్నపాటి ముందడుగు కోసం వాళ్ళు పెద్ద సాహసాలే నెత్తికెత్తుకుంటారు.

1927లో ముత్తు లక్ష్మి భారతదేశపు మొట్టమొదటి మహిళా శాసనసభ్యురాలు అయ్యారు. నాటి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యురాలిగా దేవదాసీ విధానం రద్దు, కనీస వివాహ వయసు పెంపు, నిర్బంధ వ్యభిచారం రద్దు, బాలల హక్కుల రక్షణ తదితర విషయాలపై పోరాడారు.

దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలూ, పురుషాధిపత్య సమాజంలో ఒంటరి మహిళల అగచాట్లూ ముత్తు లక్ష్మిని తొలి నుంచీ కలవరపెట్టాయి. విరిసీ విరియని, ఊహ తెలియని స్నిగ్ధ ముగ్ధ మందారాల్లాంటి ఆడపిల్లలని దైవ కైంకర్యం పేరు మీద గుడిలో నాట్యగత్తెను చేసి అందినవాళ్ళు తమ కామార్తికి వాడుకునే అనాచారం దేవదాసీల జీవితం. దేవదాసీలు చేసే నృత్యగానాల్ని గుడిలో విగ్రహమై నెలకొన్న పరమాత్మకు చేసే షోడశోపచారాల్లో భాగంగా చూడాలే తప్ప అందులో అనైతికం ఏముందని అప్పట్లో సంప్రదాయవాదులు వెనకేసుకొచ్చినప్పటికీ 1947లో దేవదాసీ సంప్రదాయాన్ని నిషేధిస్తూ మద్రాసు ప్రభుత్వం ఒక శాసనాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టానికై ఏళ్ళ తరబడి ముత్తు లక్ష్మి రెడ్డి సాగించిన ఉద్యమం విస్మరించలేనిది.

ఒంటరి ప్రయాణాలు ఒకింత భయపెడతాయి; నిజమే. కానీ ఆ నిర్భీతి విముక్తికి తొలి అడుగు అవుతుంది. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనం కావచ్చు, మానవాళికి మృత్యుగహ్వరమైన క్యాన్సర్ మీద వైద్యశాల పెట్టి ఆమె ప్రకటించిన సమరం కావొచ్చు ఆమె ఒకానొక తాత్త్విక ఒంటరితనంతోనే చేసింది. ఒక గమ్యం, ఒక పయనం, ఒక నిమగ్నత. ఇవే ఆమె కడదాకా అక్కున చేర్చుకున్న విలువలు. కడలిలో కల్లోలాల గురించి ఆమె ఎన్నడూ ఆలోచించలేదు; నావ సాగించడమే ఆమె ఎన్నుకుంది. లేకపోతే ఆరు దశాబ్దాల క్రితం అడయార్ ఆస్పత్రి అంకురించేదే కాదు. 1952 అక్టోబరులో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాదిరాయి వేసిన అడయార్ ఆస్పత్రి 1954లో 12 పడకల వైద్యశాలగా ఆరంభం అయ్యింది. ఈ వైద్యశాల ఇప్పటికీ ఏటా 80,000 మంది రోగ పీడితులకు ఆపన్న హస్తం అందిస్తోంది. ఇప్పటి కార్పొరేట్ వైద్యశాలలకు పూర్వ రంగంలో, అంటే దాదాపు 20 ఏళ్ళ క్రితం వరకు యావద్భారతావనిలో క్యాన్సర్ పీడితులకు ఉపశమనం, చికిత్స నెరపిన గమ్యస్థానం అడయార్ హాస్పిటలే.

చెన్నై అడయార్‌లో ఉన్న 'అవ్వై హోం' ఆమె 1931లో నిర్భాగ్య మహిళల నిమిత్తం నెలకొల్పిన శరణాలయం. విద్య, ఆత్మ గౌరవంతో మహిళలు స్వతంత్రంగా బతికేందుకు అవ్వై హోం తోడ్పడుతోంది. ఈ ప్రయాణం అంతా ఆమె అవినాభావంగా, అనురాగపూరితంగా సాగినట్టు సుస్పష్టంగా తెలుస్తుంది. జాతి మనుగడకు జవం, జీవం నింపాలని తనవంతు సంపూర్ణ కృషి నిరంతరాయంగా నిర్వహించి నిష్క్రమించిన పురోగమనాభిలాషి శ్రీమతి ముత్తు లక్ష్మి.

లెక్కకు మనం ప్రప్రథమంగా ఇన్ని ఘనతలు సంతరించుకుంది అని చెప్పుకున్నా, ఆవిడను ప్రేరేపించింది మాత్రం సమాజానికి ఒకింత సేవ చెయ్యాలన్న ఏకైక దృక్పథమే. సాగించిన ప్రయాణంలో ఎన్నేసి అడ్డంకులు, అవరోధాలు, కంటకాలూ చవి చూసి ఉంటారో కేవలం ఆవిడే చెప్పగలరు. ప్రగతి కేసి నడక తేలిక కానేరదు. దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం ఆమె. దాశరథి మాటల్లో 'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానల మెంతో' బహుశా ఆమెకే తెలిసి ఉంటుంది. శుష్క వచనాల వరదలో కొట్టుకుపోకుండా ధీర గంభీర కార్యాచరణ ఆమె యెంచుకున్న రీతి; నిర్భీతి. సానుకూలతా, అవకాశమూ ఉంటే ప్రతి మహిళా తళుకులీనే ఒక తారక కాగలదని ఆమె నమ్మారు.


1930లో లండన్‌లో, 1932లో చికాగోలోనూ జరిగిన ప్రపంచ స్థాయి మహిళా సాధికార వేదికల నుంచి ఆవిడ భారతీయ మహిళల కడగళ్ళ గురించి ప్రపంచానికి చాటారు. 1931లో అఖిల భారత మహిళల సదస్సు (ఆల్ ఇండియా విమెన్స్ కాన్ఫరెన్స్)కు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సదస్సు తరఫున మహిళల ఓటు హక్కుకై పోరాడారు. ఉప్పు సత్యాగ్రహ పిలుపుతో శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. మహిళాభ్యుదయం కొరకు 'స్త్రీధర్మ' అనే పత్రికను నడిపారు. 1956లో 'పద్మ భూషణ్' పురస్కారంతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది. ఈ వరుస స్త్రీ జనహిత ప్రయాసల మాటున అసలు సిసలు మానవ హక్కుల నినాదం ఒకటి తొంగిచూసిన ప్రక్షాళన ఆమెది.

స్వీయ జీవిత చరిత్రతో పాటు, ముత్తు లక్ష్మి 'శాసనసభలో నా అనుభవాలు' అనే రచనలు చేశారు. 82 ఏళ్ళ పరిపూర్ణ జీవితం గడిపిన త్యాగశీలి ముత్తు లక్ష్మి రెడ్డి 1968 జూలై 22న కీర్తి శేషురాలు అయ్యారు. 'గుంపుకి పరిమితమైతే మహిళ అక్కడే నిలబడిపోతుంది; ఒంటిగానైనా సరే ముందుకెళ్ళే స్త్రీ ఇతరులకు దుస్సాధ్యమైన మజిలీలు చూస్తుంది' అని ఐన్‌స్టీన్ అన్నారు. ఆయనకు సమకాలీన ప్రపంచంలో ఎక్కడో మరోచోట, మరో వ్యాపకం, మరో తపనతో ఈ వాక్కును రూఢి చేసిన మహిళగా ముత్తు లక్ష్మి రెడ్డి జీవితం, కృషిని మనం ఇవాళ పునస్సమీక్షించుకోవచ్చు. నీడలూ జాడలూ ఉపేక్షించి నిత్యం వెలుతురుకేసి సాగిన గమనం ముత్తు లక్ష్మిది.

■ తిరువాయపాటి రాజగోపాల్

(జూలై 22: ముత్తులక్ష్మి రెడ్డి వర్ధంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 20 జూలై 2024





బొగత.. జలసవ్వడుల పులకరింత..

తెలంగాణ నయాగరాగా పేరొందిన ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు, మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వస్తున్న వరదలతో బొగత ఉప్పొంగుతోంది. జలపాతం ముందరి భాగంలోని ట్రీహౌస్ వరకు వరద నీరు చేరగా.. అల్లంత ఎత్తునుంచి దుంకుతున్న జలధారలను చూసి సందర్శకులు పులకరిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ, జలపాతం అందాలను కెమెరాలలో బంధిస్తూ మురిసిపోతున్నారు.

- వాజేడు



సర్వమంగళ అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 19: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొన సాగుతున్న శాకంబరీ ఉత్సవాలు శుక్రవారానికి 14వ రోజుకు చేరాయి. ఉద యం నిత్య పూజ నిర్వహించిన అనంతరం తిథి మండల దేవత యజనం లో భాగంగా ఉత్సవమూర్తికి ఇచ్ఛా శక్తిగా మాత్ర అలంకరణ చేసి పూజలు చేశారు. జ్ఞానశక్తి అయిన భద్రకాళి అమ్మవారికి సర్వమంగళ అలంకరణ చేసి పూజ ఆరాధన చేశారు. దశమహా విద్యలలో త్రయోదశికి ఆది దేవత మన్మథుడని, అమ్మవారి విభూది సర్వమంగళగా భక్తులకు సమస్త మండ లాలను, శుభములను భక్తులకు అందజేస్తుందని అర్చకులు తెలిపారు. ఈనెల 21అమ్మవారి శాకంబరీ అలంకరణను పురస్కరించుకొని కూరగాయ లు, పండ్లు సమర్పించుకున్న భక్తులు శనివారం సాయంత్రంలోగా ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఈవో శేషు భారతి కోరారు.

మోస్తరు వాన

హనుమకొండ జిల్లాలో 23.5మి.మీ, వరంగల్‌లో 20.7 మిమీ వర్షపాతం నమోదు

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ , వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి మోస్తరు వానలు పడ్డాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో సరాసరి 23.5 మిల్లీమీటర్లు, వరంగల్ జిల్లాలో 20.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో అత్యధికంగా 39.3 మిమీ వర్షం పడగా భీమదేవరపల్లి మండలంలో 22.1, వేలేరులో 20.1, ఎల్కతుర్తిలో 21.5, హసన్‌పర్తిలో 24.1, ధర్మసాగర్‌లో 18.4, కాజీపేటలో 23.6, హనుమకొండలో 18.4, ఐనవోలులో 13, పరకాలలో 18.9, దామెరలో 24.7, ఆత్మకూరులో 27.6, శాయంపేటలో 25.3 మిమీ వర్షం పాతం నమోదైంది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో అత్యధికంగా 42.8మిమీ వర్షం కురిసింది. గీసుకొండలో 35.4, దుగ్గొండిలో 22.4, నల్లబెల్లిలో 16.2, నర్సంపేటలో 17.2, ఖానాపూర్‌లో 18, చెన్నారావుపేటలో 3.6, సంగెంలో 14.8, వర్ధన్నపేటలో 19.6, పర్వతగిరిలో 18.6, నెక్కొండలో 10.2, ఖిలా వరంగల్‌లో 22,4, వరంగల్‌లో 28మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో సగటున 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక జనగామ జిల్లాలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి.

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు

జయశంకర్‌భూపాలపల్లి, ఏజెన్సీ జిల్లా అయిన ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ములుగు జిల్లాలో 59మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. సమ్మక్క బ్యారేజీకి 4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఏటూరునాగారం, మంగపేట వద్ద నీటిమట్టం పెరుగుతోంది. పలుచోట్ల కరకట్ట బలహీనపడగా ఇసుక బస్తాలు వేసి మరమ్మతు చేస్తున్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో వాజేడు మండలంలో గోదావరికి వరద నీరు భారీగా వస్తోంది. మరోవైపు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం కుండపోత వర్షం పడగా జిల్లా వ్యాప్తంగా 69.6మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. కాటారం మండలంలోని పలు గ్రామాలకు గంటల వ్యవధికి రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో పత్తి, వరి పంటకు నష్టం వాటిల్లింది. కాళేశ్వరం వద్ద గోదావరి 8.320 మీటర్లు ప్రవహించగా మేడిగడ్డ వద్ద వరద ఉధృతి తీవ్రమై 3.10లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది.

డీఎంహెచ్‌వో సాంబశివరావు బదిలీ



వరంగల్ మెడికల్, జూలై 19: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు బదిలీ అయ్యారు. ఈయనను వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా ప్రభుత్వం బదిలీ చేసింది. హనుమకొండ జిల్లా డీఎంహెచ్‌వోగా ములుగులో వర్క్ ఆర్డర్‌తో పని చేస్తున్న డాక్టర్ ఎ.అప్పయ్యను నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అదే విధంగా జనగామ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హరీస్‌రాజ్ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రోగ్రామ్ అధికారిగా సివి ల్ సర్జన్ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ సుధార్‌సింగ్ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో సర్జన్ ఆర్ఎంవోగా బదిలీ అయ్యారు. అయితే ఇంకా మరికొన్ని జిల్లా డీఎంహెచ్‌వోలకు సంబంధించిన జీవో విడుదల కానున్నట్లు సమాచారం. సివిల్ సర్జన్ హోదాలో 40శాతం సీలింగ్‌తో కొందరికే బదిలీలు జరిగినట్లు తెలిసింది.



ఆర్టీసీ వరంగల్ నూతన బస్‌స్టేషన్ నమూనా చిత్రం



వరంగల్ పాత బస్‌స్టేషన్‌లో ఇంకా కొనసాగుతున్న భవనాల కూల్చివేతలు

అంతులేని నిర్లక్ష్యం

వరంగల్ బస్టాండ్ పనుల్లో తీవ్ర జాప్యం

- ఇంకా పూర్తికాని పాత భవనాల కూల్చివేత
- శంకుస్థాపన చేసి ఇప్పటికే ఏడాది
- పట్టించుకోని 'కుడా' యంత్రాంగం
- అధికారుల తీరుపై ప్రయాణికుల ఆగ్రహం
- మంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి

గిర్మాజీపేట, జూలై 19: అధికారుల నిర్లక్ష్యం ప్ర యాణికులకు శాపంగా మారుతోంది. వరంగల్ ఆ ర్టీసీ నూతన బస్టాండ్ నిర్మాణంలో అంతులేని జాప్యం జరుగుతుండడంతో మండిపడుతున్నారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అధికా రుల నిర్లక్ష్యంపై జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి శంకుస్థాపన జరిగి ఏడా ది దాటినా ఇంకా పాత భవన కూల్చివేత పనులే పూర్తికాలేదు. అభివృద్ధి పనుల పేరుతో బ్రోచర్లను అందమైన రంగుల్లో ముద్రించిన చొరవ.. పనుల్లో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

38 ఏళ్ల కిందట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1986 డిసెంబ రు 21న నాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరా మారావు వరంగల్ బస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. నిత్యం 48లోకల్, 200జిల్లా బస్సుల ద్వారా నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగి స్తుంటారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినా ఆ మే రకు అభివృద్ధి చేయడంలో పాలకులు, ప్రజా ప్ర తినిధులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో బ స్టాండ్ శిథిలావస్థకు చేరింది.

పూర్తి కూల్చివేతలు

కొత్త బస్టాండ్ కోసం తాత్కాలికంగా వరంగల్ రైల్వేగూడ్స్ షెడ్ ప్రహరీ, ఎస్ఎస్ఎం క్లబ్ ఎ దు రుగా బస్టాండ్ ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో పాత బస్‌స్టేషన్ కూల్చివేత పనులు ప్రా రంభించారు. పాత భవనాలు కావడం, కూల్చివేత సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవ డంతో కూల్చివేత ప్రారంభమైన తొలిరోజే వాటర్ ట్యాంక్ కూలుస్తుం డగా కూలి వాటి కిందపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మరువక ముందే, మే 20న అర్ధరాత్రి పేలుడు పదార్థాలతో భవనాలను కూల్చివేశారు. కుడా అధికారుల పర్యవేక్షించకపోవడంతో కూల్చి వేత పనులు ఇంకా పూర్తి కావడంలేదని విమర్శ లు వినిపిస్తున్నాయి. రోడ్డుపై హోటళ్లు, రాకపోకలు యథావిధిగా కొనసాగుతుండటంతో ఇప్పట్లో బస్టాండ్ పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని నగరవాసులు మండిపడుతున్నారు.

రైల్వేస్టేషన్ నుంచి ర్యాంపు నిర్మించాలి..

రైల్వే, బస్టాండ్ ఎదురెదురుగా ఉన్న నేపథ్యంలో నూతన బస్‌స్టేషన్ నిర్మాణం రైల్వే, ఆర్టీసీ ప్రయాణికులకు అనుకూలంగా పనులు చేపట్టా లని ప్రయాణికులు కోరుతున్నారు. రైలు దిగిన వారు నే రుగా బస్టాండ్‌కు, అలాగే బస్సులు దిగిన వారు రైల్వేస్టే షన్‌కు చేరుకునేలా రెండింటినీ అనుసంధానం చేస్తూ నడకమార్గం ర్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మంత్రి చొరవ చూపాలి..

బస్టాండ్ నిర్మాణపనులు శరవేగంగా జరిగేలా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. 'కుడా' అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనులు చేసేలా చూడాలని, పనుల అలస్యానికి చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కుడా, ఆర్టీసీ అధికారులతో చర్చించి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలంటున్నారు.

తాత్కాలిక బస్టాండ్‌లో వసతుల లేమి

ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా సుమారు రూ.50లక్షలతో ఏర్పాటుచేసిన తాత్కాలి క బస్టాండ్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ప్లాట్‌ఫాంలు సరిపోవడం, షెడ్‌లు వెడల్పు లేకపోవడంతో ప్రయాణికు లు నిలుచునేందుకు కూడా ఇబ్బంది అవుతోంది. ప్లాట్‌ఫామ్ ఎత్తుకూడా చిన్నదిగా ఉండడంతో బస్సులు దూసుకువచ్చి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుం దోనని ప్రయాణికులు జంకుతున్నారు. షెడ్డు చిన్నదిగా ఉండడంతో ఎండ, వాన నుంచి రక్షణ లేకుండా పోతోంది. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది. వరదనీరు వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో అటు వర్షపునీరు, ఇటు డ్రైనేజీ నీరు బస్టాండ్‌లో నిలిచి చెరువులను తలపిస్తోంది. ఆర్టీసీ కార్గో కౌంటర్‌కు వెళ్లే వారంతా బస్‌స్టేషన్‌ల నుంచి వాహనాలపై రాకపోకలు సాగిస్తుండటంతో బస్సులను సంబంధిత వాహనాలు ఢీకొనే ప్రమాదాలు లేకపోలేదు. ఇదిలాఉంటే హైదరాబాద్, శ్రీశైలం తదితర దూర ప్రాంతాల సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు సైతం బస్సు సర్వీసులను రద్దు చేశారని వాపోతున్నారు.

రూ.75కోట్లతో బస్టాండ్‌కు శ్రీకారం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్‌స్టేషన్ అభివృద్ధిపై దృష్టి సారించింది. అధునాతన బస్టాండ్ నిర్మాణానికి 'కుడా' నుంచి రూ.75కోట్లను మంజూరు చేసింది. గత జూన్ 17న అప్పటి రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. మల్టీప్లెక్స్, రెస్టారెంట్ తదితర సదుపాయాలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు పాత బస్టాండ్ కూల్చివేత, తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుతో చేతులు దులుపుకున్నారు.



బస్‌స్టేషన్ నిర్మాణానికి గతేడాది జూన్ 17న వేసిన శంకుస్థాపన ఫలకం



రైల్వేగూడ్స్ షెడ్ గోడకు ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టేషన్

రూ.52లక్షల బంగారం అపహరణ

- తాను పనిచేసే బంగారం దుకాణంలోనే చోరీ
- అన్నంపెట్టిన యజమానినే మోసగించిన కేటుగాడు
- దొంగను పట్టుకున్న సీసీఎస్, మట్టెవాడ పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 19: ఉపాధి కల్పించిన యజమానినే మోసం చేశాడో ప్రబుద్ధుడు. ఆయన దుకాణానికే కన్నం వేసి రూ.52లక్షల విలు వ కలిగిన 800గ్రాముల బంగారం అపహరించాడు. ఈ సంఘటన మ ట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘరానా దొంగను సీసీఎస్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు అరెస్టు చేసి దొంగ నుంచి 700గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సం బంధించిన వివరాలను శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేక ర్ల సమావేశంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు.

మహారాష్ట్రకు చెందిన సురేష్ లక్ష్మణ్‌బాద్ కొన్ని నెలలుగా వరంగల్‌లో నివసిస్తూ బంగారం వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. జల్సాలకు అలవా టుపడిన సురేష్ లక్ష్మణ్‌బాద్ అప్పులు చేశాడు. ఉపాధి కోసం తిరగగా ఏపనీ దొరకకపోవడంతో కొద్దిరోజులు పిజ్జా సెంటర్ నడిపాడు. ఈ వ్యాపారంలోనూ నష్టం రావడంతో తనకు తెలిసిన వ్యక్తి ద్వారా వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించే వ్యాపారాన్ని నిర్వహిస్తున్న సంజయ్ వద్ద మే నెలలో పనిలో చేరాడు. నమ్మకంగా పనిచేయడంతో యజమాని సురేష్‌కు తాళాలు ఇచ్చి బయటికి వెళ్లేవాడు. అయితే యజమాని లేని సమయంలో నిందితుడు సురేష్.. గత నెల 14న షాపులోని కెమెరాలు ఆఫ్‌చేసి 800గ్రాముల బంగారం చోరీ చేసి పారిపోయాడు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణకు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుడు చోరీ చేసిన బంగారం అమ్మేం దుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్నాడనే సమాచా రంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారం స్వాధీనం చేసుకున్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

అయితే నిందితుడు సురేష్ లక్ష్మణ్‌బాద్ బంగారం చోరీ చేసిన అనం తరం తన స్వస్థలానికి వెళ్లాడు. అక్కడి తన మిత్రుడైన తానాజీ యాద వ్ వద్ద బంగారం కరిగించి బిస్కెట్లుగా చేసి వంద గ్రాముల బంగారం అతడికి అమ్మాడు. మిగతా బంగారం అదే ప్రాంతంలో అమ్మే ప్రయత్నం చేశాడు. వీలుకాకపోవడంతో విజయవాడలో అమ్మేందుకు వస్తున్న క్రమంలో నిందితుడు పోలీసులకు చిక్కాడు. కాగా, నిందితుడిని సకాలం లో పట్టుకున్న ప్రత్యేక బృందాన్ని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ సందర్భంగా అభినందించారు. విలేకర్ల సమావేశంలో అదనపు డీసీపీ రవి, వరంగ్ ఏసీపీ నందిరాంనాయక్, సీసీఎస్, మట్టెవాడ సీఐలు అబ్బ య్య, గోపీ, ఏఏవో సల్మాన్‌పాషా, మట్టెవాడ ఎస్ఐ విఠల్, ఏఎస్ఐ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

బాలసముద్రం, జూలై 19: ఆగస్టు 15లోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు నిర్మాణ పనులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అసంపూ ర్తిగా ఉన్న పనులన్నీ ఆగస్టు 15లోపు పూర్తి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బల్దియా కమిషనర్‌తో కలిసి కాళోజీ కళాక్షేత్రం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గుడిసెవాసుల పక్షాన పోరాడుతాం

- కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, జూలై 19: నగరంలోని గుడిసెవా సులకు కార్పొరేషన్ నుంచి జారీ అయిన నో టీసులు వెనక్కి తీసుకోవాలని, లేదంటే కలిసి వచ్చే సంస్థలతో గుడిసెవాసుల పక్షాన పోరాడు తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వి నయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం హ నుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వి నయభాస్కర్ మాట్లాడారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఐదు దశాబ్దాలుగా నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా ప్రాంతాల్లో గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. నగరంలో పలు ప్రాంతా లకు చెందిన గుడిసెవాసులు ఖాళీ చేయాలని కార్పొరేషన్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే నా యిని రాజేందర్‌రెడ్డిని బాధితులు కలిస్తే స్పం దించకపోవడం దారుణమన్నారు. గుడిసెవాసు ల ఓట్లు దండుకుని వారికి నోటీసులు ఇస్తే ని ర్లక్ష్య ధోరణితో మాట్లాడటం ఎంతవరకు సమం జసమని ఆయన ప్రశ్నించారు. పోరాటాలు చేసి సాధించుకున్న గూడును కూల్చే ప్రయ త్నం చేయడం సరికాదన్నారు. నిరుపేదలకు అండగా ఉంటామని హామీలు ఇచ్చిన కాం గ్రెస్.. గుడిసెవాసుల గూడును కూల్చే ప్రయ త్నం చేస్తుందన్నారు. గుడిసెవాసులకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని విన యభాస్కర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం మోసపూరిత మాటలు చెప్పి అధికారంలో వచ్చి ఏడు మాసాల్లో చేసింది ఏమీలేదన్నారు. బీఆర్ఎస్ పాలనపై పలు ఆరోపణలు చేస్తూ కాలయాపన మినహా చేసిన అభివృద్ధి ఏమీలేద న్నారు. ప్రశ్నించిన నిరుద్యోగ యువతపై కేసు లు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. తమ హయాంలో మంజూరైన పనులకు నగ రంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొబ్బరికాయ లు కొడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీ ఆర్ఎస్ పోరాడుతుందని వినయభాస్కర్ స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో నేత లు మర్రి యాదవరెడ్డి, జోరిక రమేశ్, అశోక్, మధు, పులి రజనీకాంత్, వెంకన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకంపై అవగాహన కల్పించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బ్యాంకర్లు, మెప్మా అధికారులతో ప్రత్యేక సమావేశం

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: స్వయం సహాయక మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు మహిళాశక్తిపై పూర్తి అవగాహన కల్పించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వా కడే సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బందితో కలిసి ప్రత్యేక స మావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని కోరారు. ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసు కుని వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అంది స్తుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, క్యాటరింగ్ క్యాంటీన్, ఈవెంట్ మే నేజ్‌మెంట్, కట్టడాలకు సంబంధించిన సామగ్రి తదితర 8 రంగాలకు క మ్యూనిటీ ఆర్గనైజర్ల సహాయంతో బ్యాంకుల ద్వారా రుణాలు మంజూ రు చేస్తుందన్నారు. 600 మంది సభ్యులకు వ్యక్తిగతంగా రుణాలు అం దించేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. సంఘాలను ప్రోత్సహించే బాధ్యత మెప్మా అధికారులపై ఉందని గుర్తుచేశారు. వారంరోజుల్లోగా లోన్ గ్రౌండ్ అయ్యేలా చూడాలని బ్యాంకర్లకు సూచిం చారు. తొలిదశలో భాగంగా రూ.32కోట్ల రుణాలు అందజేస్తామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సెక్రెటరీ విజయలక్ష్మి, టీపీఆర్‌వో కోల రాజేశ్, ఎల్‌డీఎం రాజు, శ్రీనిధి రిజినల్ మేనేజర్ అశోక్, టీఎంసీ రమేష్, బ్యాంకు మేనేజర్లు, సీవోలు పాల్గొన్నారు.



బదిలీలు రద్దు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

బల్దియా కార్మికులకు బదిలీల గండం

75ఏళ్లలో ఎప్పుడూ చేయలేదని ఆవేదన

నేడు సీఎంను కలువనున్న యూనియన్ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా పారిశుధ్య కార్మికులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. గురువారం 445 మంది కిందిస్థాయి ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు ఏకంగా అంబులెన్స్‌లలో కౌన్సెలింగ్‌కు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రధానంగా 30 కేటగిరీలలో పనిచేస్తున్న 445 మంది ఉద్యోగుల్లో ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 75 యేళ్ల వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నాలుగోతరగతి ఉద్యోగులకు ఎన్నడూ బదిలీలు జరగలేదని అంటున్నారు.

నేడు చలో హైదరాబాద్

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయడం సరైంది కాదని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఇటీవల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంశ్రీహరిని కలిసి సమస్యలు వెల్లడించారు. వారు సైతం సానుకూలంగా స్పందించినా బదిలీల తంతు ఆగడం లేదు. దీంతో శనివారం ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలువనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా బదిలీల తీరుపై హైకోర్టును ఆశ్రయించి బదిలీల రద్దుకు పోరాటం చేస్తామని సంఘం నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ధర్మరాజులు తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ



హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని వరంగల్, హనుమకొండ ఎస్ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ సూచించారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, ఏఈల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రమాదాల నుంచి బయటపడాలంటే కింది జాగ్రత్తలను పాటించాలని వినియోగదారులకు సూచించారు.

- వ్యవసాయం నిమిత్తం రైతులు పంపుసెట్లను వినియోగిస్తున్నప్పుడు కరెంట్ మోటార్లు కానీ, పైపులు కానీ, ఫుట్‌వాల్వులను అశ్రద్ధతో తాకొద్దు. ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాలు కురిసినప్పుడు విద్యుత్‌స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టార్టర్లను, మోటార్లను తాకొద్దు. వేలాడుతున్న కరెంట్ తీగల గురించి మీకు దగ్గర్లోని కరెంట్ ఆఫీస్, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- సర్వీస్ వైర్లను వీధి దీపాలను సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దు. విద్యుత్ సిబ్బంది సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వరండాలో మరియు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ దగ్గరలో (జీఐ) వైరును దండెముగా కట్టి తడిబట్టలను ఆరవేయడం ప్రమాదకరం. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరగా ఉన్న వ్యక్తులు షాక్ గురైన వ్యక్తులను రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని వస్తువులను వాడటమే సరైన పరిష్కారం.
- చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదు.
- బోరు వేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లు తాకి కొంతమంది చనిపోతున్నారు. బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా లేదా అని ఒక సారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేసుకోవాలి.
- జెండాలు ఎగుర వేస్తున్నప్పుడు జెండా పైపులు పైన విద్యుత్ వైర్‌కు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వరికోతల సమయంలో హార్వెస్టర్స్‌కు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటంతో షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలి.
- జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్టరిత్యా నేరం. విద్యుత్ కంచెలు వేయరాదు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి..

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కాళోజీ జంక్షన్, జూలై 19: హనుమకొండ బాలసముద్రంలోని కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని అక్కడే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ ఉద్యమం - గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు డీఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అధ్యక్షత వహించారు. కళాక్షేత్రం ప్రారంభం కాకముందే పేరు పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. గద్దర్ అంటే కేవలం ఒక ప్రాంతానికి, వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి మనిషి అని ఐలయ్య అన్నారు. కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టకుంటే, విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే ఉద్యమాలు చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోకుంటే పోరాడి సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంకా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు.

చదరంగ వీరులు



- చెస్‌లో రాణిస్తున్న ఓరుగల్లు అణిముత్యాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్జున్, రాజారిత్విక్, సరయు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: చదరంగం అంటేనే ప్రత్యర్థి కదలికను గమనిస్తూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ చిత్తు చేయడం. అంతేకాకుండా ప్రత్యర్థి ఆలోచనల్ని విభిన్న కోణాల నుంచి పసికడుతూ విజయం వైపు దూసుకెళ్లాల్సి ఉంటుంది. మైండ్‌గేమ్‌గా ప్రాచుర్యం పొందిన చెస్‌లో రాణించాలంటే చిన్నతనం నుంచి ఆట పట్ల ఆసక్తి, ఏకగ్రాత, క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది. 1966 జూలై 20న యునెస్కో ఆలోచన మేరకు ఫిడే ఆదేశాలతో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో యేటా భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో చదరంగ దినోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు చెస్ దిగ్గజాలు, గ్రాండ్ మాస్టర్లు, (జీఎం)లు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

జిల్లా కుసుమాలు

ప్రపంచ స్థాయిలో ఆదరణ పొందిన చెస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడకారులు సత్తా చాటుతున్నారు. అర్జున్, రాజరిత్విక్, సరయులు అంతర్జాతీయ చెస్‌లో రాణిస్తూ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్లుగా అర్హత సాధించి రాష్ట్రానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ 15 ఏళ్లకే క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో రాష్ట్రం నుంచి తొలి గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాను సాధిం చాడు. ప్రపంచస్థాయి క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్ లో 4వ స్థానంలో నిలవగా, భారతదేశం నుంచి క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో తొలి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా నగరానికి చెం దిన మరో అంతర్జాతీయ చెస్ దిగ్గజం రాజావరం రాజారిత్విక్.. తన తండ్రి స్వతహాగా చెస్

నేడు అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

క్రీడాకా రుడు కావడంతో 6ఏళ్ల వయస్సులో కోచ్ బొళ్లం సంపత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంచె లంచెలుగా ఎదుగుతూ క్లాసికల్ ఫిడే చెస్ రేటిం గ్‌లో 17ఏళ్ల వయస్సులోనే తెలంగాణ నుంచి రెండో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అలాగే మొండ్రాయి గ్రామం లోని నిరుపేద కుటుంబానికి చెందిన సరయు చిన్నతనంలోనే చెస్ క్రీడ పట్ల అసక్తి పెంచుకుం ది. ఇది గమనించిన తండ్రి చెస్‌లో శిక్షణ ఇప్పిం చాలని నిర్ణయించుకున్నాడు. కోచ్ బొళ్లం సంపత్ వద్ద శిక్షణ తీసుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్‌పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను అంతర్జాతీయ గుర్తిం పు సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన సరయు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయి నా ఐఎం హోదాను సాధించి 3 నార్మ్‌లు చెస్‌లో పాల్గొని అత్యధిక ఫిడ్ చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించే అవకాశం దగ్గరలోని ఉంది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

చెస్ క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెస్ మేధావులను ప్రభుత్వం గుర్తించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టించే అవకాశం ఉందంటున్నారు. చదరంగంలో రాణించాలంటే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఆదరిస్తే మరికొంత మంది క్రీడాకుసుమాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందంటున్నారు.

చాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యం

ఇరిగేసి అర్జున్, చెస్ గ్రాండ్ మాస్టర్ హనుమకొండ



25వ అబుదాబీ చెస్ ఫెస్టివల్, మాస్టర్స్ టోర్నమెంట్‌లో మూడో నార్మ్‌లో విజయం సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల పర్యవేక్షణతోనే జీఎం హోదాను సాధించాను. ఫిడే రేటింగ్‌లో ప్రపంచ చాంపియన్‌గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించి ప్రపంచ చెస్ చాంపియన్ సాధించడమే నా లక్ష్యం.

సూపర్ గ్రాండ్ మాస్టర్ సాధిస్తా..

రాజావరం రాజారిత్విక్, చెస్ గ్రాండ్ మాస్టర్



మైండ్ గేమ్ అయిన చెస్ రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరి, 17ఏళ్ల వయస్సులో రాష్ట్రం నుంచి రెండో చెస్ గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాను. సూపర్ గ్రాండ్ మాస్టర్‌గా నార్మ్స్ సాధించి ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ప్రపంచ చెస్ చాంపియన్‌గా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది.

గ్రాండ్ మాస్టర్ సాధించడమే కర్తవ్యం

సరయు, చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించి ఫిడే చెస్ రేటింగ్ ఆధారంగా వివిధ హోదాలు అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే క్యాన్‌డిడేట్ మాస్టర్ (సీఎం) ఫిడే మాస్టర్ (ఎఫ్‌ఎం) ఇంటర్నేషినల్ మాస్టర్ (ఐఎం) హోదాను సాధించాను. దీంతో పాటుగా మూడు నార్మ్‌లు వివిధ దేశాల ప్రత్యర్థులతో పాల్గొని ఫిడే చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలనేదే నా కర్తవ్యం.

ఇద్దరు గ్రాండ్ మాస్టర్లుగా ఎదగడం గర్వకారణం

బాసిరి వెంకట రాజ్‌గోపాల్, వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఇరిగేసి అర్జున్, రాజవరం రాజారిత్విక్‌లు చిన్న వయస్సులోనే చెస్‌లో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం గర్వకారణం. చిన్నప్పటి నుంచి చెస్ క్రీడ పట్ల పట్టుదలతో సాధనం చేయడం ద్వారానే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

రేపు నేత్ర, అవయవ, శరీరదాన ఐక్య వేదిక సమావేశం

కాళోజీ జంక్షన్, జూలై 19: నేత్ర, అవయవ, శరీరదాన రాష్ట్ర ఐక్య వేదిక సమావేశం ఆదివారం హనుమకొండలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని అభి నిలయంలో నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక వరంగల్ జిల్లా డైరెక్టర్ కొనరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వరలింగం, కో కన్వీనర్ రాంకల్యాణ్, ప్రముఖ డాక్టర్ దాసరి ప్రసాదరావు, పలు సేవా కార్యక్రమాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీరదాన ప్రాముఖ్యతను, భావజాలాన్ని వ్యాప్తి చేయడం సమావేశ ఉద్దేశమని మల్లారెడ్డి వివరించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాలొనాల్సిందిగా ఆయన కోరారు. సమావేశ వివరాల కోసం సెల్ నంబర్లు: 87905 48706 / 97037 38699 లను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



మర్కండి వేణు (ఫైల్)

మట్టెవాడ, జూలై 19: ఆర్థిక ఇబ్బందులు తాళలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హంటర్ రోడ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం. నగరంలోని హంటర్‌రోడ్ ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మర్కండి వేణు (54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పని నిమిత్తం బయటికి వెళ్లిన వేణు భార్య స్వరూపకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణుకు భార్య స్వరూప, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దామెర, జూలై 19 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బిల్లా సురేందర్ రెడ్డి, బిల్లా దివ్యలు ద్విచక్రవాహనంపై హనుమకొండ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ప్రమాదవ శాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: గంజాయిలాంటి మత్తు పదార్థాల నియంత్రణకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయాలపై, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక టీం పనిచేస్తుందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రగ్స్ కిట్‌లతో నిరంతరం రోడ్లపై తనిఖీలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో డీ ఎడిక్షన్ సెంటర్ సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెలుతున్నట్లు అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కౌన్సెలింగ్‌కు వెళ్లిన నర్సింగ్ ఆఫీసర్లు

ఎంజీఎంలో ఇబ్బందులు పడుతున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 19: రాష్ట్ర ఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయ నిర్లక్ష్యం వల్ల నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఎంజీఎం నుంచి 200లకు పైగా నర్సింగ్ ఆఫీసర్లు గురువారం రాత్రి నుంచే సెలవులు పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాకా మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అని ప్రకటించారు. అప్పటికే తప్పుల తడకగా ఉన్న లిస్టుతో కౌన్సెలింగ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా నర్సింగ్ ఆఫీసర్లు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ముందు వేకెన్సీ లిస్టును, స్పౌజ్, వికలాంగులు తదితర ప్రాధాన్యక్రమంకు సంబంధించిన జాబితాలు ప్రకటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌కు అడ్డుతగిలారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. దీంతో ఎంజీఎంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో సేవలను అధికారులు నెట్టుకు వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎంజీఎం రోగులకు శాపంగా మారింది.

వంగపహాడ్‌లో త్వరలో పోలీసు ఔట్‌పోస్ట్

అడ్డుకునేందుకు కొందరి ప్రయత్నాలు

వరంగల్ క్రైం, జూలై 19: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ ప్రారంభంలో పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 2010 నుంచి 2015 వరకు ఔట్‌పోస్ట్ ఉండేది. తర్వాత ఔట్‌పోస్ట్ ఎత్తేశారు. ఓఆర్‌ఆర్‌పై అసాంఘిక కార్యకలాపాలు సాగుతుండటం, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమదందాలు సాగుతుండటంతో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలీసులు చేస్తున్నట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం సాగుతుండటంతో దందాలు చేసేవారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే దందాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతో బేరసారాలు చేస్తున్నారని తెలిసింది. కొందరు పోలీసులు సైతం ఒక బేరం కుదుర్చుకుని ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటుపై కాజీపేట ఏసీపీని వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

26 నుంచి కేయూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ జూలై 26 నుంచి ఇంజనీరింగ్ (బిటెక్) రెండో, మూడో సెమిస్టర్ నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు శుక్రవారం ప్రకటించారు. జూలై 26, 30, ఆగస్టు 1, 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెండు, మూడో సెమిస్టర్లకు చెందిన రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచి ర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డెపల్లి, జూలై 19: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని, వీరి సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఏడునెలలు కావొస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని పేర్కొన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇమ్మడిశెట్టి రాజు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు గౌని రాజు, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, అక్కనపెల్లి అంజయ్య, గోపనబోయిన రాజు, బరిగెల కృష్ణమూర్తి, ఆమంచ ప్రశాంత్, బండారి శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, పత్తి నర్సయ్య, తాళ్ల అంజి, వస్కుల రాజ్‌కుమార్, గడ్డం కిరణ్, తప్పెట పరశురాములు, కొట్టె జోసఫ్ పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జూలై 19: పనితీరును మరింత మెరుగుపరుచుకొని వినియోగదారులకు అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సూచించారు. డిస్కమ్ పరిధిలో ఉద్యోగుల ప్రతిభ ఆధారంగా నెలవారీగా అందించే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన మేనెల జ్ఞాపికలను సీఎండీ ఉద్యోగులకు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రశంసలు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజనీర్లకు ఈ సందర్భంగా సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డిస్కమ్ పరిధిలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో హనుమకొండ టౌన్ ఏడీఈ మల్లికార్జున్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్ - నక్కలగుట్ట, ఏఈ రమేశ్ - దామెర, నవీన్‌కుమార్ - సుబేదారి, బి.పద్మ - హనుమకొండ రూరల్ డివిజన్, ఐనవోలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ టి.మధుసూదన్, సీజీఎం కిషన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి. సామ్యనాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటాలు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ● ఎంచగూడెంలో సంస్మరణ సభ



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క భరత్ కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 19 : జనశక్తి నేత భరత్ తన ఉద్యమంలో చూపిన తెగువతోనే గోదావరి లోయ విప్లవోద్యమంలో అనేక పోరాటాలు జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో జనశక్తి నేత భరత్ 24వ సంస్మరణ సభను భరత్ కుమారులు కృష్ణ, శ్రీను, కుటంబసభ్యులు, బంధుమిత్రులు శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా భరత్ కుమారులు, కుటుంబసభ్యులు, అభిమానులతో కలిసి భరత్ స్తూపం వద్ద నివాళులు విమలక్క అర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తాను అజ్ఞాతంలో పనిచేయలేదని కాని విప్లవాన్ని, అమరత్వాన్ని తన పాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విప్లవోద్యమ చరిత్రలో భరత్ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. నేడు విప్లవోద్యం చీలికలై బలహీనపడుతుందన్నారు. ఉద్యమాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన చేందారు. విప్లవకారులు, ప్రజలు బాధపడుతున్నారన్నారు. చీలికలను ఆసరగా చేసుకుని పెట్టుబడి దారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ఉద్యమకారులు భరత్‌తో ఉన్న తమ అనుభవాలను, నాటి పోరాటలను గుర్తు తెచ్చుకున్నారు. కాగా, విమలక్క, పుష్పక్క, యోచన పాడిన పాటలు ఉత్తేజపరిచాయి, మరికొన్ని కన్నీళ్లు పెట్టించాయి. సభలో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, మాజీ జనశక్తి రాజన్న, విష్ణుమూర్తి, జగ్గన్న, సత్తెన్న, రవీందర్, విజయక్క, నాగన్న, ఎన్డీ నాయకులు గౌని అయిలయ్య, శ్రీశైలం, భరత్ బంధువులు బండి పెద్దకుమార్, బండి కుమారస్వామి, జిట్టబోయిన యాకయ్య, సుంకరబోయిన మొగిలి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్‌టీఈ ఆఫీసర్ విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, జూలై 19: వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని హైదరాబాద్‌లోని రీజికల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటప్రెన్యూర్‌షిప్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా కళాశాలల ఆవరణలో విద్యార్థులకు అప్రెంటిషిప్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర టెక్నికల్ సంస్థ శిక్షణ సంస్థ ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.7వేలు ఉపకార వేతనంగా శిక్షణ సమయంలో చెల్లిస్తుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ రీడర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ), జాబ్‌మేళా కన్వీనర్ ఎ.గోపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ స్థాయిలో ఇలాంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిష్ మేళా కోకన్వీనర్ కె. మాధవరావు, జనగామ నోడల్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, జాబ్‌మేళాకు అభ్యర్థులు విశేషంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగాలు పొందారు.





ఘటన స్థలంలో భవాని, దినేష్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, జూలై 19: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వివాహిత మృతిచెందగా, భర్త, కుమారుడు తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలోని గూడెప్పాడ్ క్రాస్‌వద్ద జరిగింది. లారీ శరీరం మీది నుంచి పోవడంతో ఛిద్రమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలభద్ర దినేష్-భవాని(23) దంపతులకు కుమారుడు ప్రద్యుమన్ ఉన్నారు. వీరు వరంగల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్లిన వీరు.. మధ్యాహ్నం వరంగల్ నుంచి గూడెప్పాడ్‌కు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న లారీ.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ క్రాస్ వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భవాని, దినేష్‌తో పాటు రెండేళ్ల బాలుడు ఎగిరి పడ్డారు. భవానిపై లారీ ముందు టైరు వెళ్లడంతో పొట్టపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ భవాని మృతి చెందినట్లు సీఐ తెలిపారు. భర్త దినేష్, కుమారుడు ప్రద్యుమన్‌లు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వానమబ్బుల వేళ.. పుడమి పచ్చందాల కళ..

ఓ వైపు వానమబ్బులు.. మరోవైపు పచ్చని అందాలను పరుచుకున్న పుడమి. ఆ అపురూప దృశ్యాల కలయిక ఎంతో చూడముచ్చటగా ఉంటుంది కదూ. గుట్టల మాటు నుంచి పొగమంచు తెరల్లా కనిపిస్తున్న ఆ చిరుజల్లుల సవ్వడిలోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమైన దృశ్యాలు కనులవిందు చేశాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా వద్ద శుక్రవారం కనిపించింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఆలయంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న వికాస్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి

వడ్డెపల్లి, జూలై 19: హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డు వికాస్ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను వికాస్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దొండపాటి రత్నాకర్‌రెడ్డి, మందడి యాదగిరిరెడ్డి, గోపాల్‌రావు, నైనకంటి జనార్ధన్‌రెడ్డి, శ్యామ్, వర్ధం జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, దాత చంద్రమౌళి

ఐనవోలు, జూలై 19: రోటరీ క్లబ్ జిల్లా బాధ్యుడు కోరే చంద్రమౌళి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను బహూకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీ, డ్యూయల్ డెస్కులు లాంటివి కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విభజనను పూర్తిచేయించి ఉపాధ్యాయుల పోస్టుల మంజూరుకి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్ రత్నకుమార్, కమిటీ చైర్మన్ సకీనాబేగం, పెండ్లి నవీన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ మండలపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే నాగరాజు క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు పున్నేలులో అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మోర సురేష్‌కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల సమర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, జిల్లా, మండల నాయకులు మధు, సాంబయ్య, రఫీ, రహీం, సంపత్, రాజు, ఏలిషా, సారయ్య, రవీందర్, భాస్కర్, సునిల్, చినరాజ్, బుచ్చిరెడ్డి, రాకేష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహిమూద్, వెంకటేశ్వర్‌రావు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు

వడ్డెపల్లి, జూలై 19: న్యాయ విద్యార్థులు సమాజంపై అవగాహన అలవర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్. రమేష్‌బాబు అన్నారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదర్శ లా కాలేజీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుక లను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ.. న్యాయ విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలని ఉద్బోధించారు. విద్యార్థుల ఆట పాటలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభా రాథోడ్‌తో పాటు న్యాయ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేసిన పోలీసులు


వరదనీరు రోడ్డుపైకి చేరకుండా కాలువలో చెట్లను తొలగిస్తున్న ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది

ఐనవోలు, జూలై 19: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి(563)పై పంథిని వద్ద వరదనీరు రోడ్డుపైకి రాకుండా ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పనులు చేశారు. రెండు ఎక్స్‌కవేటర్ లోడర్‌లను పెట్టి కాలువలోని చెట్లు, పొదలను తొలగించి నీరుసాఫీగా వెళ్లే విధంగా మరమ్మతులు చేయించారు. టిప్పర్ల ద్వారా మొరం తెప్పించి గత సంవత్సరం రోడ్డు పక్కన ఏర్పడిన ఐదు ఫీట్ల లోతుగల ప్రమాదకర గుంతలను పూడ్చివేశారు. ఐనవోలు పోలీసుల పనికి వాహనదారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్


ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాన్ని శుక్రవారం గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల నమోదు, సవరణ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఆరు గ్యారంటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి కంప్యూటర్ ఆపరేటర్ వద్ద నిలబడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో నమోదు చేసిన దరఖాస్తులలో ఎందుకు తప్పులు దొర్లాయి.. జిరాక్స్ ప్రతులు ఎందుకు అప్లోడ్ కాలేదని తెలుసుకున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరి దరఖాస్తును స్వీకరించి న్యాయం జరిగే విధంగా అధికారులు కృషి చేయాలని చెప్పారు. వివిధ సమస్యలతో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. కమిషనర్ వెంట సెక్రెటరీ విజయలక్ష్మితో పాటు బల్దియా సిబ్బంది ఉన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

అత్యవస సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రజలకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని కంట్రోల్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో దృష్ట్యా అత్యవసర సమయంలో సహాయ నిమిత్తం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 18004251980, 9701999645 నెంబర్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద సమస్యలు ఎదురైనప్పుడు మాన్సూర్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. టీఆర్ఎఫ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిస్తారని అన్నారు. కమిషనర్ వెంట బల్దియా సెక్రెటరీ విజయలక్ష్మితో పాటు సిబ్బంది ఉన్నారు.

జేఎన్ఎస్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్


జేఎన్ఎస్‌ను సందర్శించి డీవైఎస్‌వో నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని జిమ్నాస్టిక్‌హాల్, రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌తో పాటు నిర్మాణంలో ఉన్న కబడ్డీ, రెజ్లింగ్ కోర్టులను పరిశీలించి క్రీడాకారులతో ముచ్చటించారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి అశోక్‌కుమార్‌ను హాస్టల్ నిర్వాహణ, మౌలిక వసతులతో పాటు ఇతర క్రీడా అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశాలమైన ఔట్‌డోర్ స్టేడియాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు గార్డెనింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అదే విధంగా రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉండే బాల బాలికల కోసం నూతన వసతి గృహం నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని డీవైఎస్‌వోకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

ఇటీవల బెంగుళూరులో నిర్వహించిన ఆలిండియా పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో 400, 1500 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన అకీరానందన్‌ను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా జేఎన్ఎస్‌లో అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, డీఎస్ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మడికొండ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాధికాగుప్తా

మడికొండ, జూన్ 19: మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. అంగన్‌వాడీ సందర్శనలో భాగంగా వచ్చిన ఆమె అదే ప్రాంగణంలో గల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తరపున, మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన మైనర్ రిపేర్లు, మంచినీటి వసతి, ఎలక్ట్రిసిటీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగదులు కూలిపోయాయని, బాలురకు, సిబ్బందికి టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు మాలకొండారెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన అదనపు కలెక్టర్.. టాయిలెట్స్, వంట గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, జ్యోతి, సిబ్బంది కళ్యాణి పాల్గొన్నారు.

ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను తక్షణమే మార్చాలి


పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు, జూలై 19: ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను తక్షణమే ఆ భవనం నుంచి సురక్షితమైన భవనంలోకి మార్చాలని ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు పోలీసు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పైఅంతస్థులో ఉన్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని చూసి అవాక్కయ్యారు. పైన పటారం లోన లొటారంలాగా ఉంది.. ఇందులో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. భవనం పటిష్టంగా లేదని, వెంటనే ప్రైవేటు భవనాన్ని చూసి అందులోకి వెళ్లాలని సూచించారు. శాశ్వత భవన నిర్మాణం కోసం కృషిచేస్తానని, అప్పటి వరకు ఏదైనా ప్రైవేటు భవనంలోకి మార్చాలని ఎస్సై శ్రీనివాస్‌కు సూచించారు.

విద్యార్థి నాయకులు ముందస్తు అరెస్టు

హనుమకొండ టౌన్, జూలై 19: నిరుద్యోగులు పిలుపునిచ్చిన ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థి నాయకులను హనుమకొండ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ.. 2లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. గ్రూప్-2,3లో పోస్టుల సంఖ్య పెంచి వాయిదా వే యాలని డిమాండ్ చేశారు. అరెస్టులకు భయపడేలేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో నిరుద్యోగుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ పిల్లల నాగరాజు, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోతు రాజేశ్‌నాయక్ ఉన్నారు.

జంగా రాఘవరెడ్డిని కలిసిన రైల్వే కార్మిక నేతలు

మడికొండ, జూలై 19: రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని టేకులగూడెంలోని ఆయన నివాసంలో రైల్వే కార్మిక నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, ఏఐఆర్ఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత కురుసపల్లి రవీందర్, ఏఐజీడీఎస్ నాయకులు మర్రి కుమురారెడ్డి, పిట్టల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధురాలికి రేషన్ అందజేత

మడికొండ, జూలై 19 : నిరుపేద వృద్ధురాలిపై స్థానిక హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ ఔదార్యం ప్రదర్శించారు. మడికొండ ముదిరాజ్ కాలనీకి చెందిన నిరుపేద మహిళ నాయిని వెంకట సాయమ్మ వృద్ధాప్య దశలో ఆర్థిక ఇబ్బందులు పడుతోందని తెలుసుకున్నాడు. శుక్రవారం తన సొంత ఖర్చులతో వెంకటసాయమ్మకు నెలకు సరిపడా రేషన్ సరుకులు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌ను పలువురు అభినందించారు.

గ్రామంలోకి భారీ వాహనాలు రావొద్దు..

లారీలను అడ్డుకుని యువకుల నిరసన

మడికొండ, జూలై 19: మడికొండలోనికి భారీ వాహనాలు, లారీలు రావద్దంటూ స్థానిక యువకులు శుక్రవారం సాయంత్రం హల్ చల్ చేశారు. లారీలను అడ్డుకుని కదలనిచ్చేదిలేదంటూ భీష్మించారు. లారీలు వెళ్తున్న సమయంలో అంబులెన్స్ వచ్చినా లారీడ్రైవర్లు సైడ్ ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తులైన యువకులు.. అసలు లారీలు గ్రామంలోనికి రావద్దని నిలిపివేశారు. సుమారు గంటకుపైగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్కూల్ బస్సుల్లో పిల్లలు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ పోలీస్ సిబ్బందితో వచ్చి యువకులకు నచ్చ జెప్పి పంపించేశారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించి వాహనాలు పంపించారు.

కేయూ టెక్నికల్ బాధ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీలో టెక్నికల్ అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కేయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ పేర్కొన్నారు. ఇటీవల నియమితులైన నూతన పాలక మండలి సభ్యులు బానోతు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్, బొద్దిరెడ్డి రమారెడ్డి, చిర్ర రాజులను శుక్రవారం కేయూ టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, వి.నందయ్యల నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులకు సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకాన్ని అందచేసి, శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌సాగర్, ఎస్.రాము, వై.బాబు, బొక్క మొగిలి, అక్రమ్, భవానిప్రసాద్, జహీర్‌ఖాన్, భాస్కర్, ప్రకాశ్, జయాకర్ తదితరులు పాల్గొన్నారు.


పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న టెక్నికల్ అసోషియేషన్ నేతలు

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్

వడ్డెపల్లి, జూలై 19: మాజీ మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్, సర్వోదయ మిత్ర మండలి సంయుక్తంగా శుక్రవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని వడ్డెపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. ఆప్తామాలజిస్టు డాక్టర్ సుప్రియ దేశ్‌పాండే, అనిరుధ్ దేశ్ పాండే, వినాయక ఆస్పత్రి చైర్మన్ రాజు ఆధ్వర్యంలో కంటి పరీక్షల అనంతరం అవసరం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ నాగపురి అశోక్, డివిజన్ అధ్యక్షుడు రోకుల సతీష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, యాదగిరి, ప్రవీణ్, నరేష్, శివ, సంతోష్, రాము, గుండె అశోక్, బాబీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న డీఎంకు సన్మానం


డీఎం సురేశ్‌కు సత్కారం

బాలసముద్రం, జూలై 19: బదిలీపై వెళ్తున్న వరంగల్-2 డిపో మేనేజర్‌ను శుక్రవారం హైర్ బస్ ఓనర్ల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ సురేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు బాధ కల్గించినా బాధ్యతతో వెళ్లక తప్పదన్నారు. కార్యక్రమంలో హైర్ బస్ ఓనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, రీజియన్ అధ్యక్షుడు రాంరెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వేజ్, సదానందం, షఫీ, లింగారెడ్డి పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సును ప్రారంభించిన ఆర్ఎం

బాలసముద్రం, జూలై 19: గురుపౌర్ణిమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షణకు హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్‌ను వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ... దర్శనం, గిరి ప్రదక్షణ శుభప్రదంగా జరిగి, క్షేమంగా తిరిగి రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం, రెడ్డిపురం, బుద్ధనగర్, యాదవనగర్, రాంపూర్, మడికొండ టెక్స్‌టైల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

వరంగల్ పరిధిలో...

దేశాయిపేట, ఏజే మిల్స్, ఏనుమాముల సబ్‌స్టేషన్ల పరిధిలోని ఏనుమాముల మార్కెట్ రోడ్డు, రెడ్డిపురం, కొత్తపేట, దేశాయిపేట, ఎల్‌బీ నగర్, బాలాజీనగర్, ఓసిటీ, లేబర్‌కాలనీ, రాంకీ, ఎస్ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, హంటర్‌రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని వరంగల్ డీఈ శంకేసి మల్లిఖార్జున్ తెలిపారు.

నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

హనుమకొండ టౌన్, జూలై 19: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెవాసులతో కలిసి హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ.. హనుమకొండ మండలంలో సెంటు భూమి, నిలువ నీడ లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని గుండ్లసింగారం, పలివేల్పుల, జంగభద్రయ్య నగర్, పోచమ్మకుంట, భగత్‌సింగ్‌నగర్, గణేశ్‌నగర్, సుందరయ్యనగర్-2తో పాటు అనేకప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో పేదప్రజలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు గుడిసెవాసులకు పట్టాలిచ్చి, డబుల్ బెడ్ రూంలు ఇస్తానని హామీ ఇచ్చి తుంగలో తొక్కడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించామన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిప్రతం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్‌స్టాలిన్, జిల్లా సమితి సభ్యులు శ్రీనువాస్, రవి, సుదర్శన్, దేవా, రాజేందర్, అమృతయ్య, శివకుమార్, విజయలక్ష్మీ, మంగ, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఇంజనీరింగ్ ఏఈ కృష్ణమూర్తి

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా పని చేస్తూ వ్యక్తిగత కారణాల వల్ల మే 8 నుంచి సెలవుపై వెళ్లిన కె.కృష్ణమూర్తి శుక్రవారం తిరిగి విధుల్లో చేరినట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కృష్ణమూర్తి పని చేసిన 3, 14, 15, 16, 17తోపాటు 47వ డివిజన్‌లను కృష్ణమూర్తికి అప్పగిస్తున్నట్టు వెల్లడించారు. సెలవులో ఉన్నకాలంలో ప్రస్తుత డివిజన్‌లను ఎం.సతీష్ కుమార్, ఎమ్డీ ముర్తుజా ఏఈలు అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. కృష్ణమూర్తి విధుల్లో చేరడంతో పాత అవే డివిజన్‌లను కేటాయిస్తున్నట్టు కమిషనర్ వెల్లడించారు.

నూతన సంస్థకు కేయూ సెక్యూరిటీ అప్పగింత


నూతన సెక్యూరిటీ ప్రతినిధులకు ఉత్తర్వులు ఇస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 19: ఆగస్టు 1 నుంచి కేయూ క్యాంపస్‌తో పాటు, ఖమ్మం, కొత్తగూడెం కళాశాలల్లో నూతన సెక్యూరిటీ సంస్థ విధులు నిర్వహిస్తుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇప్పటి వరకు పనిచేసిన సెక్యూరిటీ సంస్థ స్థానంలో నూతన సెక్యూరిటీ సంస్థకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలో 133 మంది శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డులను, మరో 6గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను 11 నెలల కాలానికి నియమించినట్లు తెలిపారు. సెక్యూరిటీ సంస్థను టెండర్ ప్రక్రియ, వర్సిటీ కమిటీతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నూతన సెక్యూరిటీ సంస్థకు అవకాశంవచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వాసుదేవారెడ్డి, తోట రాజయ్య, సీహెచ్. ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూలోకంలో అమృతం
మజ్జిగ

అమరత్వం యథా స్వర్గం దేవానామమృతాద్భవేత్!
తక్రాద్భూమౌ తథా నృణామమరత్వం హి జాయతే!

సమస్త దోషాలనూ హరింపచేసే మజ్జిగని మానవులు తప్పనిసరిగా తాగాలి. అమరత్వం కోసం స్వర్గంలో దేవతలకు అమృతాన్ని, భూమ్మీద మానవులకు మజ్జిగని ఇచ్చాడు పరమాత్ముడు. మంచినీళ్లు అడిగితే మజ్జిగ ఇచ్చి పంపే సంస్కృతి మనది. మజ్జిగ లేదా చల్లకూ... తెలుగువారికీ అనుబంధం అనాదిగా ఉంది.



క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో మజ్జిగతో అనేక ప్రయోగాలు చెప్పాడు. మజ్జిగని సంస్కృతంలో 'తక్రం' అంటారు. 'తక్రం' ఆరోగ్య పరిరక్షణకు, వ్యాధి నివారణకూ పనికొచ్చే ఔషధం. వాపుల్ని కరిగించే శక్తి ఉంది. మొత్తం జీర్ణాశయ వ్యవస్థని బల సంపన్నం చేస్తుంది. లివరు, స్ప్లీను లాంటి మృదువైన అవయవాలలో కలిగే వ్యాధుల్ని నివారిస్తుంది. రక్త పుష్టి ఇస్తుంది. తీసుకున్న ఆహారంలో పోషకాలు వంటబట్టేలా చేస్తుంది. వేసవిలోనే కాదు, అన్ని కాలాల్లో తీసుకోదగిన ఔషధం మజ్జిగ. నెయ్యి, నూనెలతో కూడిన ఆహార పదార్థాలను ఎక్కువగా తిన్నప్పుడు మజ్జిగ తాగితే ఆ దోషం పోతుంది. జఠరాగ్ని పెరుగుతుంది.

కొందరికి మజ్జిగంటే పడదు. దాని వాసన సరిపడకపోవటం ఒక కారణం. ఇంకొందరికి మజ్జిగ తాగితే జలుబు చేస్తుందని భయం. మరికొందరికి మజ్జిగ అరగదనీ, త్రేన్పులు వస్తాయని అనుమానం. మజ్జిగలో నీళ్లు తప్ప ఏమీ లేవనే అభిప్రాయం కూడా కొందరిలో ఉంది. ఇవన్నీ మజ్జిగ ఉపయోగాలు తెలియక పెంచుకున్న అపోహలు.

ఒక గ్లాసు పెరుగుని చిలికి మూడు నుండి ఎనిమిది గ్లాసుల నీళ్లు కలిపి ఒక పూటంతా ఉంచాలి. ఆ పెరుగులో ఉన్న ఉపయోగపడే బాక్టీరియా ఆ నీళ్ల నిండా పెరుగుతాయి. ఈ ఉపయోగపడే బాక్టీరియా కోసమే మజ్జిగ. దీన్ని ప్రోబయాటిక్ ఔషధంగా చెబుతారు. జీర్ణశక్తి బలంగా ఉండాలంటే ఈ ప్రోబయాటిక్ కావాలి. అందుకు మజ్జిగే మంచి ఉపాయం. పాల కన్నా పెరుగు మంచిది. పెరుగు కన్నా చిలికిన మజ్జిగ తాగేవారి శరీరానికి వృద్ధాప్యం వచ్చినా పేగులకు రాదు.

మజ్జిగ అంటే పూర్ణచంద్రుడిలా, మల్లెపువ్వులా, శంఖంలా తెల్లగా ఉండాలి. బాగా చిలికితే తేలికగా అరుగుతాయి. ఫ్రిడ్జ్‌లో ఉంచిన మజ్జిగైతే దాని చల్లదనం పోయేదాకా బయటే ఉంచి తీసుకుంటే జలుబు చెయ్యదు. ఈ పెద్ద గ్లాసు మజ్జిగలో అరచెంచా నెయ్యి కలిపి, తగినంత సైంధవ లవణం, చిటికెడు ఇంగువ చేర్చి తాగితే అన్ని వ్యాధుల మీదా ఔషధంగా పని చేస్తుంది. అన్నంలో కూడా తినవచ్చు.

> **బాగా మీగడ కట్టిన పెరుగుని చిలికి, వెన్న తీసిన మజ్జిగని బటర్‌విఎల్క్ అంటారు. నిజమైన బటర్‌మిల్క్ అంటే 'వెన్న తీసిన మజ్జిగ' అని అర్థం. రోజూ పెరుగు మీద మీగడని సేకరించి, ఒక పాత్రలో భద్రపరచి, చిలికి వెన్న తీసిన బటర్‌మిల్క్ కూడా మంచి ప్రోబయోటిక్ గుణాలు కలిగి ఉంటుంది. చిలికినకొద్దీ మజ్జిగలో తేలికగా అరిగే గుణాలు వస్తాయి.**

పెరుగుని చిలికి, దానికి మూడు నుంచి ఎనిమిది రెట్లు నీళ్లు పోసి, రాత్రంతా ఫ్రిడ్జ్‌లో కాకుండా బయటే ఉంచాలి. ఉదయాన్నే అందులో సైంధవ లవణం, జీలకర్ర, కాల్చిన శొంఠి దంచి, ఆ పొడి తగుపాళ్లలో కలిపి రోజూ తాగితే వాతం, పైత్యం, కఫ దోషాలు పోతాయి. కడుపులో నొప్పి, ఉబ్బరం, గ్యాసు, మంట తగ్గుతాయి. మొలల వ్యాధి కూడా తగ్గుతుంది. అజీర్తి పోతుంది. షుగరు, బీపీ, స్థూలకాయం, కీళ్లవాతం, చర్మ వ్యాధులు. సైనసైటిస్, మైగ్రేన్ తలనొప్పికి మంచి ఔషధం.

శొంఠి, మిరియాలు, ఉప్పు, జీలకర్ర, కమలాపండు పైన తొక్కలను తగు పాళ్లలో తీసుకొని, దంచి, ఆ పొడిని చిలికిన మజ్జిగలో కలపాలి. ఇంగువ పొంగించిన నెయ్యితో తిరగమోత పెడితే ఆ మజ్జిగని 'గౌరీ తక్రం' అంటారు. దీన్ని పార్వతీదేవి శివుడి కోసం తయారు చేసిందన్నాడు క్షేమశర్మ. ఇది ఆకలిని పుట్టిస్తుంది. తీసుకున్న ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. సమస్త వ్యాధుల్లోనూ ఔషధం. దీని రుచి 'దివ్యం' అన్నాడు.

పులిసిన మజ్జిగలో ఎనిమిది రెట్లు నీళ్లు కలిపి, ఔషధంగా మలుచుకోవచ్చు. వాత వ్యాధుల్లో సైంధవ లవణం (పింక్ సాల్ట్), పైత్య వ్యాధుల్లో చక్కెర, కఫ వ్యాధుల్లో శొంఠి, పిప్పలి, మిరియాల పొడి కలిపి తాగాలన్నాడు.

నిన్నటి మజ్జిగ మిగిలిపోతే ఒక వస్త్రంలో పోసి, మూటగట్టి, వడగట్టండి. సైంధవ లవణం, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, పిప్పళ్లు, శొంఠి, ఇంగువ, ఆవాలు, మెంతులు దంచి, ఆ పొడిని తగినంత కలిపిన మజ్జిగని 'అచ్చిక' అంటారు. ఇది అన్ని దోషాల మీదా పని చేస్తుంది. ముఖ్యంగా అజీర్తిని పోగొడుతుంది. భోజనం చేసిన తరువాత పైన చెప్పిన పద్ధతుల్లో ఏదైనా మజ్జిగని ఎంచుకుని, రోజూ తాగుతుంటే భుక్తాయాసం కలగదు. తీసుకున్న ఆహారం తేలికగా అరుగుతుంది. అన్నంలో విష దోషాలు పోతాయి. చర్మానికి మంచి కాంతి వస్తుంది. స్థూలకాయం తగ్గుతుంది. నరాలకు ఉత్తేజం కలుగుతుంది. షుగరు రోగులు ఈ మజ్జిగని తాగితే షుగరు త్వరగా అదుపులోకి వస్తుంది.

• గంగరాజు అరుణాదేవి



ఆంధ్రజ్యోతి
9
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 20 జూలై 2024



కొన్ని వంటకాలు కాలక్రమేణా మరుగవుతుంటాయి. ఎందుకిలా అవుతుంటాయో మనకు తెలీదు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన వంటకాలు.. తూకా రోటీ, కొబ్బరిపాలు పులావ్, కిబ్తి, గ్రేటెడ్ కార్న్ స్నాక్స్‌ను వండుకోవచ్చు ఇలా..

మరిచిపోయినా...
మరపురాని వంటకాలు

వంటిల్లు

గ్రేటెడ్ కార్న్ స్నాక్

కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్ కంకులు- 4, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి), అల్లం- చిన్న ముక్క (సన్నగా తరగాలి), శనగపప్పు- 2 టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి సరిపడ, ధనియాల పొడి- పావు టీస్పూన్, యాలకులు- 3, ఆవాలు- పావు టీస్పూన్, నూనె- 2 టీస్పూన్స్, నెయ్యి- టీస్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, తురిమిన ఎండుకొబ్బరి- 1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ- 1

తయారీ విధానం: స్వీట్‌కార్న్ గింజలు తీసి మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని కుక్కర్‌లో వేసి సన్నగా తరిగిన అల్లం ముక్కలు, పచ్చిమిర్చి వేసి కలపాలి. స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి రెండు నిముషాలు గరిటెతో తిప్పాక.. కప్పు నీళ్లు పోసి.. మూత పెట్టకుండా మాత్రమే లోహీట్‌లో ఇరవై నిముషాల పాటు ఉంచితే బాగా ఉడుకుతుంది. స్వీట్‌కార్న్ మిశ్రమాన్ని బౌల్‌లో ఉంచి చల్లబర్చాలి.

గుంతప్యాన్‌లో నూనె, నెయ్యి కలిపి వేడి చేయాలి. ఇందులో శనగపప్పు, ఆవాలు వేసి కలపాలి. చేత్తో యాలకులు నలిపి వేయాలి. లోహీట్‌లో ఉంచి స్వీట్‌కార్న్ మిశ్రమం వేయాలి. ఇందులో పసుపు, ఉప్పు, కారం, ధనియాల పొడి వేసి ఇరవై నిముషాల పాటు కలపాలి. అంటే ఉప్మాలా కలపాలి. దీన్ని పొయ్యి మీద నుంచి తీసేసి ఐదు నిముషాల పాటు చల్లార్చాలి. ఆ తర్వాత కొబ్బరి తురుము, కొత్తిమీర, నిమ్మరసం చల్లుకుని కలపాలి. ఈ స్వీట్‌కార్న్ స్నాక్ రుచికరంగా ఉంటుంది.

కొబ్బరిపాల పులావ్



కావాల్సిన పదార్థాలు: నూనె- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టీస్పూన్, యాలకులు-2, దాల్చిన చెక్క-1, లవంగాలు- 4, సోంపు- అర టీస్పూన్, బిర్యానీ ఆకు-1, జీడిపప్పు- 12, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, క్యారెట్- 1 (సన్నగా తరగాలి), బీన్స్- 5 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 2, బఠాణీలు- 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరిపాలు- 2 కప్పులు, బాస్మతి బియ్యం- కప్పు(ఇరవై నిముషాలు నానబెట్టాలి), తరిగిన కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడ

తయారీ విధానం: కుక్కర్‌లో నూనె వేసి జీలకర్ర, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, సోంపు, బిర్యానీ ఆకు వేసి లోఫ్లేమ్‌లో కలపాలి. మంచి సువాసన వస్తుంది. జీడిపప్పు వేసి రంగుమారేంత వరకూ కలపాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిలువుగా చీరిన పచ్చిమిర్చి వేయాలి. క్యారెట్, బీన్స్ ముక్కలతో పాటు బఠాణీలు వేసి రెండు నిముషాలు కలపాలి. వెంటనే కొబ్బరి పాలు పోయాలి. మూడు నిముషాలు ఉడికిన తర్వాత నానబెట్టిన బాస్మతి బియ్యం, తగినంత ఉప్పు వేసి కలియబెట్టాలి. కుక్కర్ మూత క్లోజ్ చేసి రెండు విజిల్స్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. ఆ తర్వాత గరిటెతో బాస్మతి బియ్యం విరక్కుండా మెల్లగా కలపాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుంటే సరి.. కొబ్బరిపాల పులావ్ రెడీ.



తూకా రోటీ



కావాల్సిన పదార్థాలు

బియ్యం- 500 గ్రాములు, పచ్చిమిర్చి- 8, మీడియం సైజ్ ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), కొత్తిమీర- టేబుల్ స్పూన్, ఉప్పు- తగినంత, ఎండు మిర్చి గింజలు- టీ స్పూన్, నూనె- 2 టేబుల్ స్పూన్లు



తయారీ విధానం

బియ్యాన్ని మెత్తగా అయ్యేంత వరకూ నానబెట్టుకోవాలి. ఆ తర్వాత బియ్యాన్ని తీసి జార్‌లో వేయాలి. వీటితో పాటు పచ్చిమిర్చి వేసి మిక్సీ పట్టాలి. ఈ పేస్ట్‌ను బౌల్‌లో వేసి.. ఇందులో ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, ఉప్పు, ఎండుమిర్చి గింజలు, నూనె వేసి మెత్తగా కలపాలి. ఈ పిండితో చపాతీల్లా ఒత్తుకుని.. ప్యాన్‌మీద కొద్దిగా నూనె వేసి స్పూన్‌తో ప్యాన్ అంతా స్ప్రెడ్ అయ్యేట్లు చేసిన తర్వాత ఈ రోటీని రెండు వైపులా కాల్చుకోవాలి. ప్రతి రోటీ కాల్చే ముందు ప్యాన్ మీద నూనె చిలకరించాలి. ఈ రోటీలను స్నాక్స్‌లా తినొచ్చు లేదా చట్నీ, ఊరగాయలతో తినొచ్చు.

కిబ్తి



కావాల్సిన పదార్థాలు

పెద్ద ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), ధనియాల పొడి- టీస్పూన్, కారంపొడి- టీస్పూన్, కుంకుమపువ్వు- కొద్దిగా, బాదాం- 20, నెయ్యి- ఫ్రైకి తగినంత

మారినేషన్ కోసం

బోన్‌లెస్ చికెన్ థై- 8, పెరుగు- 4 టేబుల్ స్పూన్లు, నల్ల మిరియాలు- 8, యాలకులు- 5, బాదాం- 12, లవంగాలు- 4, అల్లం వెల్లుల్లి పేస్ట్- టేబుల్ స్పూన్, తరిగిన పచ్చిమిర్చి ముక్కలు- అర టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత

తయారీ విధానం

ముందుగా నల్లమిరియాలు, యాలకులు, లవంగాలను వేయించి పొడిగా చేసుకుని ఉంచుకోవాలి. బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి పెరుగుతో పాటు తయారు చేసుకున్న పొడి వేయాలి. పది ఆల్మండ్స్‌ను వేడినీటిలో నానబెట్టి పొట్టును తీసేసి ముక్కలుగా తరిగి వేయాలి. ఈ మిశ్రమంలోకి అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, తగినంత ఉప్పు వేసి నలభై ఐదు నిముషాల పాటు మారినేట్ చేసుకోవాలి.

ప్యాన్‌లో టీస్పూన్ నెయ్యి వేసి పది ఆల్మండ్స్‌ను వేయించాలి. వీటిని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ప్యాన్ మీద చికెన్ ముక్కలు ఉంచి రెండు వైపులా మీడియం హీట్‌లో రంగు మారేంత వరకూ వేయించాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేసి గోల్డెన్ బ్రౌన్ వచ్చేంత వరకూ వేయించాలి. ఇందులోకి కారంపొడి, ధనియాల పొడి వేసి కలపాలి. చికెన్ ముక్క జ్యూసీగా ఉన్నట్లు కనపడిన వెంటనే ఇందులోకి నెయ్యి చిలకరించి.. కుంకుమ పువ్వు వేయాలి. గరిటెతో బాగా కలపాలి. చివరగా వేయించిన బాదం పలుకులతో గార్నిష్ చేసుకుని స్నాక్స్‌లా తినాలి. •



ఈ పరుగు... నాన్న కల కోసమే!

ఈ అమ్మాయి.. పదమూడేళ్ల వయసులో స్కూల్ రన్నింగ్ పోటీల్లో పాల్గొని ఓడిపోయింది. 'ఓడిపోయినా పర్వాలేదు.. మళ్లీ గెలవొచ్చు' అంటూ భుజం తట్టారు ఆ అమ్మాయి తండ్రి శ్రీనివాసరావు. ఓడిన ఆ అమ్మాయే.. ఆగష్టు తొమ్మిదో తేదీ పారిస్ ఒలింపిక్స్‌లో రన్నింగ్ చేయటానికి రెడీగా ఉంది. పేరు జ్యోతిక శ్రీ. ప్రస్తుతం పోలెండ్‌లో ఉన్న ఈ రన్నర్ తన పరుగుల ప్రయాణాన్ని 'నవ్య'తో పంచుకుందిలా...

పోలెండ్‌లోని ఇండియా క్యాంప్‌లో ఉన్నా. ఐదు రోజులయ్యింది ఇక్కడికొచ్చి. ముఖ్యంగా యూరప్ వాతావరణానికి అలవాటు పడవచ్చు. విదేశీ కోచ్‌ల శిక్షణ ఉంటుంది. ఇక్కడినుంచి ఒలింపిక్స్ వేదిక పారిస్‌కి దగ్గర కూడా. ఇకపోతే పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకులో పుట్టిన నేను.. ఒలింపిక్స్ దాకా వచ్చానంటే.. నమ్మశక్యం కాదు. అయితే నాన్న ఎప్పుడో నమ్మారు. ప్రపంచ స్థాయికి వెళ్తానని నాన్న కల కన్నారు. అదే నిజమైంది.

నాన్న ప్రోత్సాహకానికి మాటల్లేవు...

పదమూడేళ్ల వయసులో మా స్కూల్‌లో పీఈటీ వంద మీటర్ల పరుగు పందేనికి నన్ను ఎంపిక చేశారు. నాకు చదువంటేనే ఆసక్తి. తప్పదు కాబట్టి పోటీల్లో పాల్గొన్నా. నాలుగో స్థానం వచ్చింది. పరుగులో ఓడిపోయా. 'గెలిచిన ముగ్గురికీ ఆయాసం వచ్చింది. నాకేమీ రాలేదు నాన్న. నేను ఇంకా పరిగెత్తుతా' అన్నాను. అంతే.. 'ఇది ఓటమి కాదు. నువ్వు మరింత వేగంగా పరిగెత్తగలవు. వెయ్యి మీటర్లు కూడా పరిగెత్తే సత్తా నీది' అన్నారు నాన్న. సీతారామయ్య సర్ దగ్గరకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు. నాన్న పెద్దగా చదువుకోలేదు. బీరువాలు తయారు చేసే వర్క్‌షాప్. ఈ ఆటలేందీ? అని కొందరు అన్నారు. అవేమీ పట్టించుకోలేదు. మంచి శిక్షణ ఇప్పించారు. జోనల్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ వచ్చింది. వైజాగ్‌లో జాతీయ స్థాయి పోటీ జరిగింది. అందులో తప్పుగా 400 మీటర్లు రాయకుండా.. వెయ్యి మీటర్ల పరుగు పందెం అని రాశారు. దీంతో పరిగెత్తా. కాంస్య పతకం గెలుచుకున్నా. ఆ తర్వాత 400 మీటర్లు పరుగుపందెం నేషనల్స్ స్థాయిలో కేరళలో జరిగింది. అక్కడ రజత పతకం సాధించాను. వీటివల్ల టర్కీలోని ప్రపంచగేమ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించా. ఇందుకోసం మా స్థానిక ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణగారు లక్ష రూపాయలు సాయం అందించారు. నాకు పదో తరగతిలో 9.7 శాతం గ్రేడింగ్ వచ్చింది. పదికి పది రాలేదని బాధపడ్డా. 'నీకు జాతీయస్థాయిలో రెండు పతకాలు వచ్చాయి. రాష్ట్రస్థాయి చదువుల్లో మూడు శాతం తగ్గినా.. ఇబ్బంది లేదు. నీకు ఇంకా మంచి భవిష్యత్ ఉంది' అంటూ నాన్న ప్రోత్సహించారు.

ప్రతి గెలుపులో నాన్న ఉన్నారు...

మా అమ్మ పేరు లక్ష్మి నాగ వెంకటేశ్వరి. నాకో అక్క ఉంది. తన పేరు కీర్తి సత్యశ్రీ. మా నాన్నగారు బాడీబిల్డింగ్‌లో రాష్ట్రస్థాయిలోనూ పాల్గొన్నారు. అయితే ఆర్థిక పరిస్థితి వల్ల తన కలను వదిలేశానని చెప్పేవారు. ఆటల్లోనే నువ్వు పేరు తెచ్చుకోవాలమ్మా అనేవారు. నాన్న మాటే.. నాకు వేదం. నా ప్రతి గెలుపులో నాన్న ఉన్నారు. పదోతరగతి తర్వాత ఇంటర్ చదవడానికి విజయవాడకు వెళ్లా. ఖర్చులు ఎక్కువయ్యాయి. అయినా శిక్షణ ఇప్పించారు. కోచ్ వినాయక్ ప్రసాద్ శిక్షణలో రాటుదేలాను. అండర్ 18 విభాగంలో జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ కొట్టాను. గోల్డ్ మెడల్ సాధించా. నాన్న ఆనందానికి అవధుల్లేవు. హైదరాబాద్‌లోని ప్రముఖ కోచ్ నాగపురి దగ్గర చేరి మెళకువలు తెలుసుకున్నా.

> 
>
> నేను బాడీబిల్డర్‌ను. జిల్లా స్థాయిలో సత్తా చాటాను. అబ్బాయి పుడితే మిస్టర్ ఇండియా చేయాలనుకున్నా. నాకు ఇద్దరు అమ్మాయిలు. జ్యోతిక శ్రీ.. మా చిన్నమ్మాయి. ఏదైనా సాధించాలనే మొండిఘటం. కష్టపడుతుంది. సాధన చేస్తుంది. గత రెండేళ్లనుంచీ ఇండియన్ కోచ్‌లు, విదేశీ కోచ్‌ల నిర్వహణలో రోజుకు ఆరుగంటలు శిక్షణ తీసుకుంది. ఇల్లు అమ్ముకున్నా.. రేకుల షెడ్డులో ఉంటున్నా... నాకెలాంటి బాధలేదు. సంతృప్తిగా ఉంది. మా అమ్మాయి నేను ఊహించిన దానికంటే మెరుగైన విజయాలు అందుకుంది. యూరప్‌కు బయలుదేరేముందు 'పతకంతో వస్తాను నాన్న' అన్నది. ఫలితాలు ఎలా ఉంటాయో మనకు తెలీదు. అయితే నా బిడ్డ ఒలింపిక్స్ దాకా వెళ్లింది. తండ్రిగా గర్వపడుతున్నా! ఇంతకంటే నాకేం కావాలి?
>
> - దండి శ్రీనివాసరావు



మాకోసం జీవితం అంకితం...

ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ వరల్డ్ రిలేలో సత్తా చాటాను. అప్పుడే మోకాలి నొప్పి వల్ల ఇబ్బంది పడ్డాను. అందుకే ఆసియన్ గేమ్స్ ఆడలేకపోయా. గాయం మానిన తర్వాత ఫిట్‌నెస్ సాధించా. ఒలింపిక్స్‌కు అర్హత సాధించటం చాలామంది క్రీడాకారులకు జీవితకాలం కల. నాన్న గురించి ఇంకో విషయం చెప్పాలి. గతేడాది మా ఇంటిని అమ్మారు. అక్క పెళ్లి చేశారు. నాకోసం తెచ్చిన అప్పులను కట్టారు. మేం రేకుల షెడ్డులో ఉంటున్నాం... అదికూడా మా వర్క్‌షాప్‌లో. ఇప్పుడు చెప్పండి? మా నాన్న మిగతా వారికంటే ప్రత్యేకమే కదా! మాకోసం జీవితాన్ని అంకితం చేశారు. 400 మీటర్లు రిలే పరుగు పందెంలో ఒలింపిక్ పతకాన్ని గెలవాలన్నది మా నాన్న కల. అదే నా కల".

• పి.సి.హెచ్. కృష్ణమూర్తి, తణుకు

నారింజ తొక్కతో నాజూకు!

నారింజ పండ్లు తింటూ రుచిని ఆస్వాదిస్తారు. కానీ ఆ తొక్కతో ఏముందిలే అని పారేస్తారు. మీకో విషయం తెలుసా.. నారింత తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుంటే.. హాయిగా ఫేస్‌మాస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చు. ఎ-విటమిన్, సి-విటమిన్ ఉండే నారింజ తొక్కల పొడితో నాజూగ్గానూ తయారు కావొచ్చిలా...

నారింజ పండ్లు తింటూ రుచిని ఆస్వాదిస్తారు. కానీ ఆ తొక్కతో ఏముందిలే అని పారేస్తారు. మీకో విషయం తెలుసా.. నారింత తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుంటే.. హాయిగా ఫేస్‌మాస్క్‌గానూ ఉపయోగించుకోవచ్చు. ఎ-విటమిన్, సి-విటమిన్ ఉండే నారింజ తొక్కల పొడితో నాజూగ్గానూ తయారు కావొచ్చిలా..

- బౌల్‌లో టేబుల్ స్పూన్ నారింజ తొక్కల పొడితో పాటు టేబుల్ స్పూన్ పెరుగు వేసి చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పొడిలోకి టీస్పూన్ తేనె, కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి ముఖానికి పట్టించుకోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- నారింజ తొక్క పొడిలోకి అంతే పరిమాణంలో సున్నిపిండి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టిస్తే మృతకణాలు తొలగిపోతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ పీల్ పొడిలో, టేబుల్ స్పూన్ కొబ్బరినూనె, టేబుల్ స్పూన్ పాలు కలిపి చూర్ణం చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకుంటే



మొటిమలు తగ్గిపోతాయి.
- ముందుగా ఆరెంజ్ పీల్ పౌడర్‌ను టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఇందులో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి చూర్ణం చేయాలి. అవసరమైతే పేస్ట్‌కు తగినట్లు నిమ్మరసం వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే మచ్చలు మాయమవుతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ ఆరెంజ్ తొక్కల పొడిని తీసుకుని అందులో టీస్పూన్ చక్కెర, టీస్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి చూర్ణం చేసుకోవాలి. ఇది స్క్రబ్‌లా ఉపయోగపడుతుంది. చర్మం మీద స్క్రబ్‌లా అప్లయ్ చేసుకోవటం వల్ల మృతకణాలు తొలగిపోతాయి. ఫ్రెష్‌గా అనిపిస్తుంది.
- ఆరెంజ్ పీల్ పౌడర్‌ను నీళ్లతో కలిపి ముఖానికి పట్టించుకుంటే చాలు.. చర్మంలో నూనె శాతం తగ్గుతుంది. యువీ కిరణాల బారిన నుంచి రక్షించే గుణం ఈ పొడికి ఉంది. ఇందువల్ల వృద్ధాప్యఛాయలు త్వరగా దరిచేరవు. •

సాఫ్ట్ లుక్ కోసం...

మేకప్ ఎంత సహజంగా ఉంటే అంత ఆకర్షణీయంగా కనిపిస్తాం! కాబట్టే కొత్త పెళ్లికూతురు, అంబానీ కోడలు, రాధిక మర్చంట్ సాఫ్ట్ మేకప్‌ను ఎంచుకుంది. అలాంటి న్యాచురల్ లుక్‌ను మరిపించే సాఫ్ట్ మేకప్ టిప్స్ ఇవే!

మేకప్

చర్మం ఇలా సిద్ధం

చర్మం తగినంత తేమగా ఉంటేనే సహజత్వం ఉట్టిపడుతుంది. కాబట్టి ఎస్‌పిఎఫ్ లేదా మాయిశ్చరైజర్ కలిగి ఉండే బ్రైటెనింగ్ సీరమ్ ఎంచుకోవాలి. లేదంటే పిగ్మెంట్ కలిసి ఉండే, అల్ట్రా లైట్ లోషన్, యాంటీఆక్సిడెంట్ విటమిన్ ఇ కలిసి ఉండే బిబి క్రీమ్‌ను కూడా అప్లై చేసుకోవచ్చు.

అండర్ ఐ కన్‌సీలర్

కళ్ల కింద నలుపును కవర్ చేయడం కోసం, ఇన్‌వర్టెడ్ ట్రయాంగిల్ ఆకారంలో కన్‌సీలర్‌ను అప్లై చేసి, మునివేలితో చర్మంలో కలిసిపోయేలా అద్దుకోవాలి. ఈ కన్‌సీలర్‌తో కళ్ల కింది వాపు, నలుపు చర్మంలో కలిసిపోయి, కళ్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తుంది.

మెరిసే బుగ్గల కోసం...

సాఫ్ట్ మేకప్‌తో ముఖం చదునుగా కనిపించకుండా ఉండడం కోసం చెక్కిళ్లకు గులాబీ రంగు బ్లష్ అద్దుకోవాలి. ఇందుకోసం రోజీ క్రీమ్ బ్లష్‌ను అప్లై చేసి బుగ్గల నుంచి కణతల వైపు బఫ్ చేసుకోవాలి. న్యాచురల్ లుక్ కోసం, బ్లష్ కోసం ముదురు రంగు గులాబీ రంగుకు బదులుగా వీలైనంత లేత గులాబీ రంగు బ్లష్‌ను ఎంచుకోవాలి.

గ్లాసీ హైలైట్

హైలైటర్ అనగానే షిమ్మర్ కలిసిన పౌడర్లు, క్రీమ్స్ గుర్తుకొస్తాయి. కానీ చర్మానికి షిమ్మర్ లుక్‌కు తెప్పించడానికి బదులుగా, గ్లాసీ హైలైట్‌ను ఎంచుకోవాలి. ఇందుకోసం చీక్‌బోన్స్, కనురెప్పలు, ముక్కుకు ఇరుపక్కల హైలైటర్‌ను అప్లై చేసుకోవాలి. ఒకవేళ గ్లాస్ లేకపోతే, దానికి బదులుగా నచ్చిన లిప్‌గ్లాస్‌ను కూడా అప్లై చేసుకోవచ్చు.

ఐలైనర్ ఇలా...

ముచ్చటగా తీర్చిదిద్దినట్టుండే ఐలైనర్ ఫ్యాషన్‌కు కాలం చెల్లింది. స్మడ్జ్ లుక్ లేటెస్ట్ ఫ్యాషన్. అందు కోసం కుదురుగా గీసుకోడానికి బదులుగా కనురెప్పల అంచుల్లో వీలైనంత మామూలుగా లైనర్ గీసుకుని, స్మడ్జ్ బ్రష్ లేదా దూది ఉండతో స్మడ్జ్ చేసుకోవాలి.



మస్కారా ముద్దుగా

కనురెప్పల కుదుళ్ల నుంచి అంచుల వరకూ మస్కారా అప్లై చేసుకోవాలి. మస్కారా అప్లై చేయడంలో ఈ చిన్న టెక్నిక్ పాటిస్తే, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. కనురెప్పలు మరింత చిక్కగా కనిపించడం కోసం, రెండో కోట్ కూడా అప్లై చేసుకోవాలి.

లిప్‌స్టిక్ ఇలా...

లిప్ బ్రష్ ఉపయోగించి, లిప్‌స్టిక్ పెదవులు దాటకుండా కుదురుగా వేసుకోవచ్చు. గ్లిట్టర్, గ్లాస్ కలిగిన లిప్‌స్టిక్‌కు బదులుగా మ్యాట్ లిప్‌స్టిక్‌ను ఎంచుకుంటే న్యాచురల్ లుక్ సొంతమవుతుంది. బ్లాటింగ్ పేపర్‌తో అదనపు రంగును తొలగించుకుంటే పెదవులు సహజసిద్ధమైన గులాబీ రంగును సంతరించుకుంటాయి. •

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/o6A9rTXలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్ చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.



ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్థన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.



వివాదం
విచారణ
వివరణ

వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైశ్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలే మిటో చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్ట్‌కు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతున్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్ట్‌కు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.



విచారణకు రాలేను

- రాజ్‌తరుణ్



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీ వాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారి తీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లుగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.



ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసేయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్లుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.



కౌలు రైతులకూ 'భరోసా'!

అందరి అభి ప్రాయంమేరకే 'రైతుభరోసా' నిర్ణయం.. వరితో కష్టాలు... ఆయిల్‌పామ్ సాగుతో లాభాలొస్తాయి

- దేశానికి కోటి టన్నుల పామాయిల్ కావాలి.. 3లక్షల టన్నులే ఉంది
- ఒక్క రైతుబంధునే గత సర్కారు సర్వరోగ నివారిణిగా చూపింది: తుమ్మల
- రుణమాఫీ ద్వారా సోనియా, రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం : ఉత్తమ్
- ఐటీ ఉన్నరైతులకూ భరోసా: పొంగులేటి
- రైతు ఆకాంక్ష మేరకే భరోసా: పొన్నం
- ఐదెకరాలకే భరోసా ఇవ్వాలి: జీవన్ రెడ్డి
- కరీంనగర్‌లో అభిప్రాయసేకరణ



కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో మంత్రులు దుద్దిళ్ల, పొన్నం

కరీంనగర్ టౌన్, కరీంనగర్ అర్బన్, పెద్దపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, పంటల బీమా పథకాల అమలుకు రూపకల్పన చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో రైతుభరోసా పథకం ఎలా అమలు చేయాలన్నదానిపై అన్నదాతల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల, పొన్నం, శ్రీధర్ బాబు, పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా, అంతకుముందు విలేకర్ల సమావేశంలో, మీడియాతో ఇష్టాగోష్ఠిగానూ మంత్రులు మాట్లాడారు. కౌలురైతులకు రైతుభరోసా పథకం వర్తింపజేస్తామని, అయితే వారికి ఈ సాయం ఎలా ఇవ్వాలనేదానిపై సూచనలివ్వాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 10వేల ఆర్థిక సహాయాన్ని అందించామని చెప్పారు. వరిసాగుతో కష్టనష్టాలుంటాయని.. బదులుగా అంతర పంటలు వేసుకునే వీలుండే ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలు గడించవచ్చునని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ కంపెనీలు కొనుగోలు చేసి మూడురోజుల్లోనే డబ్బులు ఖాతాల్లో జమచేస్తాయని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లాగా ప్రతినెలా డబ్బులు వస్తాయని చెప్పారు. 1988లో ఎన్టీఆర్ ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటారని 1992 వరకు వాటిని పరిశీలించి తాను ఆయిల్ పామ్ సాగుచేస్తూ ఆదాయాన్ని గడిస్తున్నానని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డ్రిప్ రైతులకు, ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ పథకాలను అమలు చేయలేదని ఆరోపించారు. ఒక్క రైతుబంధు పథకాన్నే సర్వరోగ నివారిణిగా చూపించారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో కూడా లక్ష రూపాయలను ఏకకాలంలో మాఫీ చేయలేదని విమర్శించారు. దేశానికి కోటి టన్నుల పామాయిల్ అవసరం ఉందని, కానీ 3 లక్షల టన్నులు మాత్రమే అందుబాటులో ఉందని, మిగతాది మలేసియా, ఇండోనేసియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తుమ్మల తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే వారికి మూడేళ్లలో 51 వేల రూపాయల సబ్సిడీ వస్తుందని, ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని మరింత పెంచాలని ప్రధాని మోదీని కోరామన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతోందని.. సంక్షేమ పథకాలను అడ్డుకునే ప్రయత్నాలను బీజేపీ, బీఆర్ఎస్ మానుకోవాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఆగస్టులో పూర్తి చేస్తామని చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ రైతు సమస్యలపై ఏనాడూ మాట్లాడకుండా ఇప్పుడు రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఆరుగ్యారెంటీల అమలును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అనంతరం పొంగులేటి మాట్లాడారు. ఐటీ ఉన్న రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వరంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని.. ఇది జీర్ణించుకోలేక విపక్షాలు అవకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. పెట్టుబడి సాయాన్ని గతంలో మాదిరిగా ఇష్టారాజ్యంగా అమలు చేయబోమని చెప్పారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ కోసం రూ.39వేల కోట్లు ఖర్చుచేసిందని.. అయినా కూడా ఊర్లలో 30 శాతం ఇళ్లకు కూడా నీళ్లు రావడం లేదన్నారు. అనంతరం పొన్నం మాట్లాడారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగానే రైతు భరోసా అమలు చేస్తామని పొన్నం పేర్కొన్నారు. రైతు సంఘాలు, పార్టీ నేతలు, మేధావుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

బీఆర్ఎస్ మునిగిపోతోందనే.. :ఉత్తమ్

రైతుల రుణమాఫీ ఓ విప్లవాత్మకమైన మార్పు అని, చరిత్రలో నిలుస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీ అమలు ద్వారా సోనియా, రాహుల్ ఇచ్చిన హామీ నెరవేర్చామని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు మాఫీ చేసింది రూ.25వేల కోట్లు మాత్రమేనని.. కాంగ్రెస్ సర్కారు 8నెలల్లోనే రూ.31వేల కోట్లు మాఫీ చేసిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద తప్పిదమని, దీన్ని సాగునీటి కోసం కాకుండా కమీషన్ల కోసమే నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారని.. ఫలితంగా రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని పేర్కొన్నారు. తుమ్మడిహెట్టి వద్ద నిర్మించాల్సి న ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చి అతి పెద్ద తప్పుచేశారని విమర్శించారు. ఈ నెలాఖర్లో సదర్‌మాట్ బ్యారేజీని, ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టులోని రాజీవ్ గాంధీ కెనాల్‌ను సీఎం ప్రారంభోత్సవం చేస్తారని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతోందని, దీన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలు గుర్తించి కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

ఐదెకరాలకు పరిమితం చేయాలి: జీవన్‌రెడ్డి

చిన్న, సన్నకారు రైతులే కాకుండా ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ సాగు చేస్తున్న ఐదు ఎకరాలకు ఆర్థిక సహాయాన్ని పరిమితం చేసి.. అందరికీ పథకాన్ని వర్తింపజేయాలని ఓ రైతుగా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువమంది 10 ఎకరాల వరకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని ఇవ్వాలని.. రాళ్ల రప్పలు, కొండలు, గుట్టలకు పెట్టుబడి సాయం ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు.

ప్రభాకర్‌రావు, శ్రవణ్‌ను కోర్టులో హాజరుపర్చండి

- ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు అధికారులకు జడ్జి ఆదేశం
- అమెరికాకు హైదరాబాద్ పోలీసులు!

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మరో నిందితుడు శ్రవణ్‌ను తమ ఎదుట హాజరుపరచాలని దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని ప్రభాకర్ రావు చేసుకున్న అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇదే కేసులో అరెస్టయిన ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్న రిమాండ్ గడువు ముగిసింది. దీంతో దర్యాప్తు అధికారులు వారిని నాంపల్లి 12వ ఏసీజేఎం కోర్టు జడ్జి ఈశ్వరయ్య ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. ఈ నలుగురి రిమాండ్‌ను న్యాయమూర్తి జూలై 26 వరకు పొడిగించారు. అయితే, ఏ1 ప్రభాకర్‌రావు, ఏ6 శ్రవణ్‌పై ఇది వరకే వారెంట్ జారీ అయినందున తదుపరి విచారణ నాటికి కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, అనారోగ్యానికి గురైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నానని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని ప్రభాకర్ రావు లేఖ పంపారని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇందుకు అంగీకరించని జడ్జి.. వారెంట్ ఇదివరకే జారీ అయినందున ప్రధాన నిందితులు ఇద్దరినీ తమ ఎదుట హాజరు పరచాల్సిందేనని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, మరో నిందితుడు శ్రవణ్‌ను తదుపరి విచారణ నాటికి న్యాయస్థానంలో హాజరుపరచాలనే ఆదేశాల నేపథ్యంలో దర్యాప్తు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ప్రభాకర్‌రావును అరెస్టు చేసేందుకు హైదరాబాద్ పోలీసులు త్వరలో అమెరికా వెళ్లనున్నారు. న్యాయపరమైన సలహా తీసుకున్న అనంతరం ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక బృందాన్ని అమెరికా పంపేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కాగా ట్యాపింగ్ పరికరాల కొనుగోలులో కీలకంగా వ్యవహరించిన శ్రవణ్ అజ్ఞాతంలో ఉన్నాడు. శ్రవణ్ ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేసే పనిలో దర్యాప్తు అధికారులు ఇప్పటికే నిమగ్నమయ్యారు.

దేశంలో అత్యధిక ఆదాయం కలిగిన ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ అగ్రస్థానంలో నిలిచింది. అన్ని ప్రాంతీయ పార్టీల రాబడి రూ.1740.48 కోట్లు కాగా.. ఇందులో గులాబీ పార్టీ ఆదాయమే రూ.737.67 కోట్లు!

ఇంజనీరింగ్ సీట్లకు టాపర్లు దూరం!

ఐఐటీ, ఎన్ఐటీల వైపు ఎప్‌సెట్ టాప్ ర్యాంకర్లు

వెయ్యి లోపు ర్యాంకర్లకు.. 86 మంది మాత్రమే రాష్ట్రంలో చేరేందుకు ఆసక్తి

ఎప్‌సెట్ తొలి దశ సీట్ల కేటాయింపు పూర్తి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్లలో చేరేందుకు టాపర్లు ఆసక్తి చూపడం లేదు. ఎప్‌సెట్‌లో 100లోపు ర్యాంకు పొందిన వారిలో ఒక్కరు, 200 లోపు ర్యాంకులు వచ్చిన వారిలో ఇద్దరు, 500లోపు ర్యాంకులు సాధించిన వారిలో 12 మంది, వెయ్యిలోపు ర్యాంకులు వచ్చిన వారిలో 86 మంది మాత్రమే ఇక్కడ సీట్లలో చేరేందుకు అనుకూలంగా ఉన్నారు. ఎప్‌సెట్ టాప్ ర్యాంకర్లు ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థల్లో సీట్లు సాధించారు. అందుకే వారు ఇక్కడ సీట్లలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం మొదటి దశ సీట్ల కేటాయింపు జరిగింది. కన్వీనర్ కోటాలో మొత్తం 78,694 ఇంజనీరింగ్ సీట్లు ఉండగా 75, 200 సీట్లు భర్తీ అయ్యాయి. 3,494 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ కళాశాలల్లో 95.9 శాతం, ప్రభుత్వ యూనివర్సిటీల్లో 89.1 శాతం, ప్రైవేట్ యూనివర్సిటీల్లో 99.6 శాతం, ప్రైవేట్ కళాశాలల్లో 96 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 6,038 మంది అభ్యర్థులు ఈడబ్ల్యుఎస్ కోటా కింద సీట్లను పొందారు. వెబ్ ఆప్షన్లలో పాల్గొన్న వారిలో 20,535 మందికి సీట్లు లభించలేదు. ప్రస్తుతం సీట్లు పొందిన వారు ఈనెల 23లోపు కళాశాలల్లో ఫీజును చెల్లించి, రిపోర్ట్ చేయాలి. కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు కంప్యూటర్ బేస్డ్ ఇంజనీరింగ్ కోర్సుల వైపే మొగ్గు చూపారు. కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సుల్లో 99.31 శాతం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో 92.55 శాతం, సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 77.52 శాతం, ఇతర కోర్సుల్లో 77.34 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగా ఇంజనీరింగ్ సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు...

ర్యాంకు	సీట్లు పొందిన విద్యార్థులు
0 నుంచి 100	1
101 నుంచి 200	1
201 నుంచి 500	10
501 నుంచి 1,000	74
1,001 నుంచి 5,000	1,822
5,001 నుంచి 10,000	2,945
10,001 నుంచి 20,000	5,809
20,001 నుంచి 30,000	5,878
30,001 నుంచి 40,000	5,878
40,001 నుంచి 50,000	5,623
50,001 నుంచి 1,00,000	22,964

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు.. గండిమైసమ్మ-బౌరంపేట సర్వీసు రోడ్డులో ఘటన

దుండిగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో శుక్రవారం ఘోర ప్రమాదం సంభవించింది. ఆగివున్న లారీని ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ప్రయాణిస్తున్న ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం వివరాలను పోలీసులు వెల్లడించారు. అక్షయ్, హరి, అస్మిత్, నవనీత్, జశ్వంత్ బాచుపల్లిలోని ఓ హాస్టల్లో ఉంటున్నారు. వీరిలో నలుగురు వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కాలేజీలో, ఒకరు మరో కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. శుక్రవారం ఐదుగురు కలిసి టీ తాగేందుకు స్కోడా కారులో దుండిగల్ చౌరస్తాకు వెళ్లారు. తిరిగివస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు గండిమైసమ్మ-బౌరంపేట వద్ద అదుపు తప్పి రోడ్డుపక్కన ఆగివున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. తీవ్రగాయాలతో అక్షయ్, హరి, అస్మిత్ అక్కడికక్కడే మృతి చెందారు. నవనీత్, జశ్వంత్ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి, మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

థ్యాంక్యూ.. అక్కా!

మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్ల కృతజ్ఞతలు



తెలంగాణ అంగన్‌వాడీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులతో మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ ఎంప్లాయిస్ యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం ప్రజాభవన్‌లోని ఆమె నివాసంలో యూనియన్ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంగన్‌వాడీల్లో పనిచేసి పదవీ విరమణ పొందే టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష అందించడంపై ... 'థ్యాంక్యూ అక్కా' అంటూ సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్‌ను పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారితో పాటు స్వచ్ఛంద పదవీ విరమణ పొందేవారికి కూడా ప్రయోజనాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 20 జూలై 2024

రోయింగ్ ఒకే ఒక్కడు



పారిస్ క్రీడలకు భారత్ నుంచి తొలి కోటా అందుకున్న ఆటగాడు బల్‌రాజ్ పన్వర్. హరియాణాకు చెందిన 25 ఏళ్ల ఈ ఆర్మీ మ్యాన్.. ఈ ఒలింపిక్స్‌లో దేశం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఏకైక రోయింగ్ క్రీడాకారుడు. ఆసియా-ఓషియానియా ఒలింపిక్ క్వాలిఫికేషన్స్ ఈవెంట్‌లో మూడోస్థానంలో నిలిచిన పన్వర్ పురుషుల సింగిల్స్ స్కల్ ఈవెంట్‌లో పారిస్ బెర్త్ దక్కించుకున్నాడు. ఒలింపిక్స్ రోయింగ్‌లో భారత్ నుంచి గతంలో ఒక్కరు కూడా కనీసం సెమీస్ చేరలేకపోయారు. ఈసారి తాను సెమీస్ దాటగలనన్న ధీమాతో పన్వర్ సిద్ధమయ్యాడు.

ఈక్వెస్ట్రియన్ అనూష్



గుర్రంతో ఆటాడించే ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత్ నుంచి అర్హత సాధించింది ఒక్కడే. కోల్‌కతాకు చెందిన 24 ఏళ్ల అనూష్ అగర్వాల ఈక్వెస్ట్రియన్‌లో వ్యక్తిగత డ్రెసేజ్ ఈవెంట్‌లో పోటీపడుతున్నాడు. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించి పారిస్ టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న అనూష్ ఇక్కడ మెరుగైన ప్రదర్శన ఇవ్వగలనన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు.



పారిస్ ఒలింపిక్స్ 6 రోజుల్లో

పారిస్ ఒలింపిక్స్‌లో 32 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నా..అథ్లెటిక్స్‌కు ఉండే క్రేజే వేరు. గతంలో ఈ విభాగానికి సంబంధించి భారత్‌కు పెద్దగా చెప్పుకోవాల్సింది ఉండేది కాదు. కానీ టోక్యో విశ్వ క్రీడల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా చారిత్రక స్వర్ణ పతకం కొల్లగొట్టడంతో ప్రపంచ అథ్లెటిక్స్ దృష్టి ఒక్కసారిగా భారత్‌పై నిలిచింది. ఈ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో భారత్‌పై అంచనాలు పెరిగిపోయాయి. టోక్యో గేమ్స్ తర్వాత నీరజ్ చోప్రా మరింత అద్భుతంగా రాణిస్తుండడం, పురుషుల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో అవినాష్ సబ్లే మెరుపులు మెరిపిస్తుండడంతో పారిస్ క్రీడల ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకాల పరంగా భారత్ మెరుగవుతుందేమో చూడాలి. ఈసారి విశ్వ క్రీడల్లో అథ్లెటిక్స్ పోటీలు ఆగస్టు ఒకటిన ప్రారంభం కానున్నాయి. 29 మందితో కూడిన భారత అథ్లెటిక్స్ బృందం 16 అంశాల్లో అదృష్టాన్ని పరీక్షించుకొంటోంది.

నీరజ్‌కు ఎదురుందా?

'90'పై చోప్రా నజర్



సబ్లే

షాట్‌పుట్

భారత షాట్‌పుట్‌కు పర్యాయపదంగా నిలిచే తజిందర్ పాల్ సింగ్ తూర్ ఆసియా దిగ్గజంగానూ పేరు పొందాడు. అయితే తరచూ గాయాలతో ప్రపంచ స్థాయిలో అంతగా పేరు తెచ్చుకోలేకపోయాడు. ఫెడరేషన్ కప్‌లో 20.38 మీ. గుండు విసిరి సీజన్ అత్యుత్తమ ప్రదర్శన చేసిన తూర్..ప్రపంచ స్థాయిలో సత్తా చాటేందుకు 'పారిస్'ను మించిన వేదిక లేదు.

జావెలిన్ త్రో

పారిస్ క్రీడల్లో భారత్ కచ్చితంగా పసిడి పతకం గెలిచే ఈవెంట్ జావెలిన్ త్రో. టోక్యోలో టైటిల్ నెగ్గిన 26 ఏళ్ల నీరజ్ చోప్రా అనంతరం వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజత, స్వర్ణ పతకాలతో తన సంచలన ప్రదర్శనను కొనసాగించాడు. '90' మీటర్ల లక్ష్యానికి గురి పెట్టిన నీరజ్.. పారిస్‌లో దానిని అందుకోవడంతోపాటు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోగలనన్న విశ్వాసంతో ఉన్నాడు. 28 ఏళ్ల కిషోర్ జెనా కూడా తలపడుతున్నాడు. మహిళల విభాగంలో అన్నూ రాణి బరిలో దిగుతోంది.

3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్

ఈసారి విశ్వ క్రీడల్లో జావెలిన్ తర్వాత పురుషుల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్ ఆసక్తి రేపుతోంది. 29 ఏళ్ల అవినాశ్ సబ్లే ఈ విభాగంలో ఇటీవలే ఎనిమిది నిమిషాల 9.91 సెకన్ల టైమింగ్‌తో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఇది ఆసియాలో నాలుగో అత్యుత్తమ సమయం కావడం విశేషం. టోక్యో ఒలింపిక్స్ హీట్స్‌లో నయా జాతీయ రికార్డుతో సబ్లే అంచనాలను పెంచినా..ఫైనల్‌కు చేరడంలో మాత్రం విఫలమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కెన్యాకు చెందిన హెగిమొనీ మీట్ రికార్డును బద్దలుగొట్టిన అవినాశ్ రజత పతకం సాధించాడు. దరివిలా పారిస్‌లో అతడిపై అంచనాలు పెరిగాయి. ఇక..మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో జాతీయ రికార్డు హోల్డర్ (9.15.31సె.) పారుల్ చౌధరి పారిస్‌లో తనదైన ముద్ర వేయాలంటే తన శక్తికి మించి ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.

వీళ్లపైనా ఆశలు

వరల్డ్ ర్యాంకింగ్స్‌తో పారిస్ క్రీడలకు అర్హత సాధించిన ట్రిపుల్ జంపర్లు ప్రవీణ్ చిత్రవేల్ (17.12మీ), అబ్దుల్లా అబూబాకర్ (17మీ.) ఈ సీజన్‌లో 17 మీటర్ల మార్క్‌ను దాటారు. పారిస్‌లో ఈ ఇద్దరిలో ఎవరైనా ఫైనల్‌కు చేరితే వారి కెరీర్‌లో అది అత్యుత్తమ ప్రదర్శనే అవుతుంది. పురుషుల హైజంప్‌లో సర్వేష్ కుషారే, లాంగ్‌జంప్‌లో జస్విన్ అల్డ్రిన్, మహిళల 5వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధురి, 400 మీ.లలో కిరణ్ పహల్, 100 మీ. హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ, 4×400మీ. పురుషులు, మహిళల రిలేలు, 20 కి.మీ. రేస్ వాక్‌లో ముగ్గురు పురుషులు, ఓ మహిళ, మిక్స్‌డ్ మారథాన్ రిలేలో ఇద్దరు భారత అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. 4×400మీ. రిలేలో తెలుగు అథ్లెట్ జ్యోతికశ్రీ దండి కూడా తలపడుతోంది.



జ్యోతి



జ్యోతికశ్రీ

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

స్విమ్మింగ్ 14 ఏళ్లకే..



పారిస్ ఒలింపిక్స్‌కు ఈసారి భారత్ నుంచి స్విమ్మింగ్‌లో ఇద్దరే బరిలో ఉన్నారు. ఒకరు శ్రీహరి నటరాజ్ కాగా, మరొకరు భారత జట్టులోనే అతి పిన్నవయసు అథ్లెటైన 14 ఏళ్ల దినిధి దేసింఘు. శ్రీహరి పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో, దినిధి 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తలపడుతున్నారు. ఈసారి భారత స్విమ్మర్లు ఎవరూ ఒలింపిక్స్ అర్హతకు ప్రామాణికమైన టైమింగ్‌ను అందుకోలేకపోవడంతో.. యూనివర్సాలిటీ నిబంధనల ప్రకారం ప్రతి దేశం నుంచి ఇద్దరిని (పురుషుల్లో ఒకరు, మహిళల్లో ఒకరు) ఆడించే అవకాశం ఉండడంతో మెరుగైన ర్యాంకులున్న శ్రీహరి, దినిధి ఎంపికయ్యారు. అయితే, 23 ఏళ్ల శ్రీహరికి గత టోక్యో ఒలింపిక్స్‌లో ఆడిన అనుభవం ఉంది. పతకంపై పెద్దగా ఆశలు లేకున్నా, సెమీఫైనల్ చేరినా తన ప్రదర్శన మెరుగుపడినట్టేనని శ్రీహరి చెబుతున్నాడు. గత క్రీడల్లో శ్రీహరి 27వ స్థానంలో నిలిచాడు. ఇక, తొలిసారి అర్హత సాధించిన దినిధిపైనా అంచనాలు లేకున్నా.. ప్రతిభ చాటుతానని ధీమా వ్యక్తం చేస్తోంది. 9వ తరగతి చదువుతున్న దినిధి..2022 ఆసియా క్రీడల్లో పోటీపడింది. అలాగే.. ఈ ఏడాది దోహాలో జరిగిన ప్రపంచ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ పాల్గొంది. కాగా, శ్రీహరి, దినిధి ఇద్దరూ బెంగళూరుకు చెందినవారే. ఆర్తి సాహా (11 ఏళ్ల వయసులో 1952 ఒలింపిక్స్‌లో పాల్గొంది) తర్వాత విశ్వక్రీడల బరిలో దిగుతున్న అతిపిన్న వయసు భారత అథ్లెట్ దినిధినే.



హాడ్జ్ శతకం

విండీస్ తొలి ఇన్నింగ్స్ 351/5

ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ దీటుగా బదులిస్తోంది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న మిడిలార్డర్ బ్యాటర్ కవెమ్ హాడ్జ్ (120) శతకంతో అదరగొట్టగా.. అథనజె (82) అర్ధశతకంతో రాణించాడు. దీంతో శుక్రవారం రెండోరోజు ఆట ముగిసేసరికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 84 ఓవర్లలో 351/5 స్కోరు చేసింది. తొలి వికెట్‌కు బ్రాత్‌వైట్ (48), లూయిస్ (21) 53 రన్స్ జత చేశారు. అలాగే 84/3 స్కోరు వద్ద అథనజెకు హాడ్జ్ కలవడంతో ఇంగ్లండ్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ రెండో సెషన్‌లో వికెట్ కోల్పోకుండా ఆడి జట్టును పటిష్ఠ స్థితికి చేర్చారు. చివరకు 62వ ఓవర్‌లో అథనజెను స్టోక్స్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఇక సెంచరీ చేశాక హాడ్జ్‌ను వోక్స్ అవుట్ చేసినా.. ఆట చివర్లో కీపర్ జోషువా (32 బ్యాటింగ్), హోల్డర్ (23 బ్యాటింగ్) వికెట్‌ను కాపాడుకుంటూ రోజును ముగించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416 రన్స్ చేసింది.

భారత్ అదిరే బోణీ

పాక్‌పై ఘనవిజయం • మహిళల ఆసియాకప్



దీప్తి (3/20)

దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. పాకిస్థాన్‌తో ఆసక్తికరంగా సాగుతుందనుకున్న మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేసింది. ముందుగా బౌలర్లు సమష్టిగా సత్తా చాటగా, ఓపెనర్లు స్మృతి మంధాన (45), షఫాలీ (40) మెరుపులు తోడవ్వడంతో.. శుక్రవారం గ్రూప్ 'ఎ'లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.2 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. ఆరంభంలో సిద్రా అమీన్ (25), చివర్లో ఫాతిమా (22 నాటౌట్), తౌబా హస్సేన్ (22) మాత్రమే ప్రభావం చూపారు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్ దీప్తికి మూడు.. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, స్పిన్నర్ శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి.

ఆడుతూ.. పాడుతూ

స్వల్ప ఛేదనను భారత్ 14.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 109 పరుగులతో సునాయాసంగా ముగించింది. ఓపెనర్లు షఫాలీ, స్మృతి మంధాన నువ్వా.. నేనా? అనే రీతిలో సాగించిన ఎదురుదాడికి పాక్ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. ఈ జోడీ బౌండరీల బాదుడుకు పవర్‌ప్లేలో జట్టు 57 పరుగులు సాధించింది. ఆరంభంలో షఫాలీ జోరు చూపినా.. ఆ తర్వాత మంధాన బ్యాట్ ఝుళిపిస్తూ ఎనిమిదో ఓవర్‌లో ఏకంగా ఐదు ఫోర్లతో 21 పరుగులు రాబట్టింది. అయితే ఈ ఇద్దరే ఛేదనను పూర్తి చేస్తారనిపించినా.. లెగ్ స్పిన్నర్ అరూబ్ షా తన వరుస ఓవర్లలో మంధాన, షఫాలీ వికెట్లను తీసింది. దీంతో తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు హ్యాట్రిక్ ఫోర్లతో మురిపించిన హేమలత (14) 13వ ఓవర్‌లో వెనుదిరిగినా, అప్పటికి ఏడు పరుగులే అవసరం కావడంతో 35 బంతులుండగానే విజయం ఖాయమైంది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 19.2 ఓవర్లలో 108 ఆలౌట్. (సిద్రా అమీన్ 25, ఫాతిమా 22 నాటౌట్, తౌబా హస్సేన్ 22; దీప్తి 3/20, రేణుకా 2/14, శ్రేయాంక 2/14, వస్త్రాకర్ 2/31).

భారత్: 14.1 ఓవర్లలో 109/3. (మంధాన 45, షఫాలీ 40; అరూబ్ షా 2/9).

నేపాల్‌కు 'తొలి' విజయం

యూఏఈతో మ్యాచ్


దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్ చరిత్రలో నేపాల్ జట్టు తొలి విజయాన్ని అందుకుంది. శుక్రవారం యూఏఈతో జరిగిన గ్రూప్ 'ఎ' ఆరంభ మ్యాచ్‌లో ఈ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. 2012, 2016 టోర్నీల్లోనూ పాల్గొన్నప్పటికీ వీరికి ఒక్క గెలుపు కూడా దక్కలేదు. ఓపెనర్ సంఝానా ఖడ్కా (72 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో కీలకంగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 8 వికెట్లకు 115 పరుగులు చేసింది. ఖుషీ శర్మ (36), కవిష (22) మాత్రమే రాణించారు. పేసర్ ఇందు బర్మకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో నేపాల్ 16.1 ఓవర్లలో 4 వికెట్లకు 118 పరుగులు చేసి నెగ్గింది. కవిషకు మూడు వికెట్లు దక్కాయి.

బిజినెస్

తగ్గిన రిలయన్స్ లాభం

- క్యూ1లో 5 శాతం క్షీణతతో రూ.15,138 కోట్లకు పరిమితం
- డీలాపడిన ఓ2సీ వ్యాపారం
- ఆదాయం రూ.2.36 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభం మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ఆర్ఐఎల్ నికర లాభం రూ.15,138 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.22.37) పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.16,011 కోట్ల (ఒక్కో షేరుకు రూ.23.66) లాభంతో పోలిస్తే 5 శాతం తగ్గింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఆర్జించిన రూ.18,951 కోట్ల లాభంతో పోలిస్తే ఏకంగా 20 శాతం క్షీణించింది. ముడిచమురు శుద్ధి వ్యాపార లాభాల మార్జిన్ తగ్గడం, ఇంధన విక్రయ మార్జిన్ల క్షీణతతోపాటు తరుగుదల వ్యయాలు, రుణ వ్యయాల పెరుగుదల కంపెనీ లాభాలకు గండికొట్టింది. టెలికాం, రిటైల్ వ్యాపారాల జోరు కొనసాగడం కంపెనీని ఆదుకుంది. కాగా, ఈ క్యూ1లో రిలయన్స్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.2.36 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రాబడి రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.2.64 లక్షల కోట్ల రెవెన్యూతో పోలిస్తే మాత్రం ఈ ఏప్రిల్-జూన్‌లో భారీగా తగ్గింది.



Reliance Industries Limited

ఆయిల్ అండ్ గ్యాస్

ఈ ఏప్రిల్-జూన్ కాలానికి ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి వ్యాపార ఆదాయం 33.4 శాతం వృద్ధి చెంది రూ.6,179 కోట్లకు పెరిగింది. స్థూల లాభం 29.8 శాతం పెరుగుదలతో రూ.5,210 కోట్లుగా నమోదైంది. కేజీ బేసిన్‌లోని డీ6 బ్లాక్ నుంచి రోజుకు సహజ వాయువు సగటు ఉత్పత్తి 28.7 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లకు చేరుకుంది.

{ గత త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభం వార్షిక ప్రాతిపదికన మెరుగుపడింది. ఓ2సీ వ్యాపార పరిస్థితులు బలహీనంగా ఉన్నప్పటికీ టెలికాం, రిటైల్‌తో పాటు ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి వ్యాపారాలు బలమైన పనితీరు కనబర్చడం ఇందుకు దోహదపడింది. కంపెనీ చురుకైన నిర్వహణ, ఆర్థిక పనితీరు విభిన్న వ్యాపారాల బలాన్ని నొక్కి చెబుతుంది. }

-ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ,ఆర్ఐఎల్

జియో ప్లాట్‌ఫామ్స్

రిలయన్స్ జియో సహా డిజిటల్ వ్యాపారాలన్నింటినీ ఏకతాటికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ నిర్వహణ ఆదాయం ఈ క్యూ1లో 13 శాతం పెరిగి రూ.29,449 కోట్లకు చేరుకుంది. నికర లాభం 12 శాతం వృద్ధితో రూ.5,698 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రిలయన్స్ జియో కస్టమర్లు మరో 80 లక్షల మేర పెరిగి 48.97 కోట్లకు చేరుకున్నారు. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7గా నమోదైంది. జియో కస్టమర్ల సగటు డేటా వినియోగం నెలకు 30.3 జీబీ లేదా రోజుకు ఒక జీబీకి చేరుకుంది. అంతేకాదు, డేటా వినియోగపరంగా జియో ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీగా అవతరించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ డేటా ట్రాఫిక్ 44.1 బిలియన్ జీబీలు, వాయిస్ కాలింగ్ ట్రాఫిక్ 1.42 లక్షల కోట్ల నిమిషాలుగా నమోదైంది.

రిలయన్స్ రిటైల్

గడిచిన త్రైమాసికంలో ఈ విభాగ స్థూల ఆదాయం 8.1 శాతం వార్షిక వృద్ధితో రూ.75,615 కోట్లకు చేరుకోగా.. నికర లాభం 4.63 శాతం పెరుగుదలతో రూ.2,549 కోట్లుగా నమోదైంది. గత మూడు నెలల్లో రిలయన్స్ రిటైల్ 331 కొత్త విక్రయ కేంద్రాలను ప్రారంభించింది. దాంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,918కి చేరుకుంది. కాగా, మూడు నెలల్లో తమ స్టోర్లను 29.6 కోట్ల మంది సందర్శించారని కంపెనీ తెలిపింది.

ఆయిల్ టు కెమికల్స్

గత క్వార్టర్‌లో ఓ2సీ విభాగ ఆదాయం 18 శాతం పెరిగి రూ.1.57 లక్షల కోట్లకు చేరుకున్నప్పటికీ, స్థూల లాభం మాత్రం 14 శాతం తగ్గి రూ.13,093 కోట్లకు పరిమితమైంది. ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే విభాగ మార్జిన్లు 30 శాతం క్షీణించడంతో పాటు కెమికల్ వ్యాపారాల మార్జిన్లు కూడా గణనీయంగా తగ్గడం ఇందుకు ప్రధాన కారణమైంది.

మీడియా

గత మూడు నెలల్లో కంపెనీ మీడియా వ్యాపారం రూ.221 నికర నష్టాన్ని చవిచూసింది. ఆదాయం కూడా 3.7 శాతం తగ్గి రూ.3,650 కోట్లకు పరిమితమైంది.

శరత్ సిటీ క్యాపిటల్ మాల్ ప్రమోటర్, పారిశ్రామికవేత్త శరత్ గోపాల్ కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ పారిశ్రామికవేత్త బొప్పన శరత్ గోపాల్ శుక్రవారం కన్నుమూశారు. శనివారం హైదరాబాద్, జూబ్లీహిల్స్ విస్పర్‌వ్యాలీలోని వైకుంఠ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విద్య, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో శరత్ గోపాల్ తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్, కొత్తగూడలో ఆయన నిర్మించిన శరత్ సిటీ క్యాపిటల్ మాల్ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మాల్‌గా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా ఆయన స్థాపించిన మ్యాట్రిక్స్ లేబొరేటరీస్ బల్క్‌డ్రగ్స్ తయారీలో అగ్రగామిగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని పెంజెండాలో 1949లో జన్మించిన శరత్ గోపాల్.. వరంగల్ ఎన్ఐటీ నుంచి 1974లో మెటలర్జీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1978లో ప్రీమియర్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. అనంతరం 1988లో మ్యాట్రిక్స్ లేబొరేటరీస్‌ను ప్రారంభించారు. 1991లో డైమ్స్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ కెమికల్ ప్రాసెస్ మెషినరీ తయారీలో కీలకంగా ఉంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1995లో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈఈపీసీ నుంచి ఉత్తమ పారిశ్రామికవేత్త పురస్కారాన్ని అందుకున్నారు. కాగా ప్రస్తుతం కొండాపూర్‌లో ఏ గ్రేడ్ ఐటీ బిల్డింగ్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అంతేకాకుండా ఇంజనీరింగ్ విద్యలో కీలకమైన విద్యాసంస్థగా ఉన్న వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీని శరత్ గోపాల్ స్థాపించారు.

జీఆర్‌టీ జువెలర్స్‌లో ఆషాఢ ఆశ్చర్యం ఆఫర్లు



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. వినియోగదారులకు ఆషాఢ ఆశ్చర్యం పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, విలువైన రత్నాలకు సంబంధించి చేతితో తయారు చేసిన ఆభరణాలు వినియోగదారులకు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. అంతేకాకుండా ఈ ఆషాఢ మాసంలో జీఆర్‌టీ జువెలర్స్‌కు చెందిన అత్యంత నమ్మకమైన 'కైరాసీ' ఆభరణాలు కొనుగోలు చేయకుండా వినియోగదారుల షాపింగ్ పూర్తి కాదని పేర్కొంది. అలాగే ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని అందించనున్నట్లు తెలిపింది. దీంతోపాటు ఈ ఆషాఢ మాసంలో పాత బంగారం మార్చుకునే కస్టమర్లకు ప్రతి గ్రాముకు అదనంగా రూ.50 అందుకుంటారని జీఆర్‌టీ జువెలర్స్ వెల్లడించింది.

గూగుల్ క్లౌడ్‌తో ఎల్4జీ జట్టు

హైదరాబాద్: విద్య, నైపుణ్యాభివృద్ధిలో కీలకంగా ఉన్న ఎల్4జీ (లెర్నింగ్ ఫర్ గ్రోత్) సొల్యూషన్స్.. గూగుల్ క్లౌడ్ ఇండియాతో కలిసి జెనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణను అందించనుంది. ఇందులో భాగంగా గూగుల్ క్లౌడ్ స్కిల్స్ బూస్ట్ (జీసీఎస్‌బీ) ప్లాట్‌ఫామ్ ద్వారా అవసరమైన కంటెంట్‌ను గూగుల్ క్లౌడ్ అందిస్తుంది. డెవలపర్ల కోసం జెనరేటివ్ ఏఐ, జెమినీ ఫర్ గూగుల్ క్లౌడ్‌లో లెర్నింగ్ పద్ధతులను ఆఫర్ చేయనుంది. అలాగే జీసీఎస్‌బీ ప్లాట్‌ఫామ్‌పై కెరీర్ లాంచ్‌పాడ్ కార్యక్రమం కింద లెర్నర్స్‌కు ఉచితంగా లెర్నింగ్ విధానాలను అందించనుంది. కోర్సు పూర్తయిన అనంతరం లెర్నర్స్‌కు కంప్లీషన్ బ్యాడ్జ్‌ను అందించనున్నట్లు ఎల్4జీ సొల్యూషన్స్ తెలిపింది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	116
కరీంనగర్	110	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	126
కర్నూలు	110	నెల్లూరు	126
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	115		

విప్రో లాభం రూ.3,003 కోట్లు

- ఆదాయం రూ.21,963 కోట్లు
- ఈసారి 12,000 నియామకాలు

బెంగళూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.6 శాతం వృద్ధితో రూ.3,003.2 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.2,870 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.8 శాతం తగ్గి రూ.21,963.8 కోట్లకు పరిమితమైంది. 2023-24లో ఇదే సమయానికి రాబడి రూ.22,831 కోట్లుగా నమోదైంది. క్యూ1లో ఐటీ సేవల ద్వారా కంపెనీకి 262.59 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగియనున్న రెండో త్రైమాసికం (క్యూ2)లో ఐటీ సేవల ద్వారా ఆదాయం 260-265.2 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదు కావచ్చని విప్రో అంచనా వేసింది. అంటే, త్రైమాసిక ప్రాతిపదికన (క్యూ1తో పోలిస్తే) ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ప్లస్ ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని కంపెనీ భావిస్తోంది. మరిన్ని వివరాలు..

- గడిచిన మూడు నెలల్లో 120 కోట్ల డాలర్ల విలువైన బడా కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు విప్రో వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే సమయంలో దక్కిన డీల్స్ విలువతో పోలిస్తే మాత్రం 3.6 శాతం తగ్గింది.
- క్యూ1లో విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 337 పెరుగుదలతో 2,34,391కి చేరుకుంది. దాంతో వరుసగా ఆరు త్రైమాసికాలుగా సిబ్బంది సంఖ్య తగ్గుదలకు అడ్డుకట్టపడింది. కాగా, క్యూ1లో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 14.1 శాతానికి తగ్గింది. అంతక్రితం త్రైమాసికంలో అట్రిషన్ రేటు 14.2 శాతంగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో ప్రాంగణ నియామకాల ద్వారా దాదాపు 3,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగాల్లో చేర్చుకున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ (సీహెచ్ఆర్ఓ) సౌరభ్ గోవిల్ తెలిపారు. ముందుముందూ ప్రాంగణ నియామకాలతో పాటు ఆఫ్-క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సైతం జరపనున్నట్లు.. ఆర్థిక సంవత్సరం మొత్తానికి 10,000 నుంచి 12,000 నియమించుకోనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో నియామకాలు చేపట్టే అవకాశం ఉందని గోవిల్ సంకేతాలిచ్చారు.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 739 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఔటేజ్‌లో అంతర్జాతీయ మార్కెట్లలో పోటెత్తిన అమ్మకాలకు తోడు ఇటీవలి లాభాలను సొమ్ము చేసుకోవాలన్న ఆకాంక్షతో ఇన్వెస్టర్లు తెగబడి అమ్మకాలు సాగించడం మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ కౌంటర్‌లో జరిగిన అమ్మకాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. అయితే ట్రేడింగ్ ప్రారంభంలో సూచీలు జీవిత కాల గరిష్ఠ స్థాయిలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 81,587.76 పాయింట్లు, నిఫ్టీ 24,854.80 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. కాని చివరికి సెన్సెక్స్ 738.81 పాయింట్ల నష్టంతో 80,604.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 844.36 పాయింట్లు దిగజారి 80,499.10 స్థాయిని తాకింది. ఇంట్రాడేలో 292.70 పాయింట్లు నష్టపోయి 24,508.15 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 269.95 పాయింట్ల నష్టంతో 24,530.90 వద్ద ముగిసింది.. వారం మొత్తం మీద సెన్సెక్స్ 85.31 పాయింట్లు, నిఫ్టీ 28.75 పాయింట్లు లాభపడ్డాయి.

రూ.7.94 కోట్ల సంపద ఫట్

మార్కెట్లో ఏర్పడిన భారీ పతనంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.7.94 కోట్లు దిగజారింది. మార్కెట్ ముగిసే సమయానికి రూ.4,46,38,826.75 కోట్ల వద్ద (5.34 లక్షల కోట్ల డాలర్లు) స్థిరపడింది.

పేటీఎంకు రూ.840 కోట్ల నష్టం

డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన క్వార్టర్‌లో రూ.840 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 33.48 శాతం తగ్గి రూ.1,639.1 కోట్లకు పరిమితమైంది.



టాటా మోటార్స్.. భారత్‌లో తొలి ఎస్‌యూవీ కూపే 'టాటా కర్వ్'ను ఆవిష్కరించింది. ఆగస్టు 7న ఈ కారును లాంచనంగా మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తొలుత ఎలక్ట్రిక్ వెర్షన్ (ఈవీ) కర్వ్‌ను ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ వెర్షన్స్ అందుబాటులోకి తీసుకురానుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,350 ▼	68,150 ▼	97,750 ▼
ముంబై	73,240 ▼	67,088 ▼	88,983 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	



'డ్రగ్స్ తరిమేద్దాం' పాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

డ్రగ్స్‌ను తరిమేద్దాం..

» పాట పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యువతను పట్టి పీడిస్తున్న మహమ్మారి.. "డ్రగ్స్‌ను తరిమేద్దాం" అంటూ సీనియర్ జర్నలిస్ట్ ఏ.కొండల్ గౌడ్ పాడిన పాట పోస్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోదూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ అమెరికా పర్యటన ఖరారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ఖరారైంది. ఆగస్టు 3వ తేదీన రాత్రి రేవంత్ బృందం అమెరికా బయల్దేరనుంది. పర్యటనలో భాగంగా పలు కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. వారితో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురానున్నారు. డల్లాస్ తదితర రాష్ట్రాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది. ఆగస్టు 11వ తేదీన సీఎం అమెరికా నుంచి తిరిగి రానున్నారు.

నేటి నుంచి పీజీ కౌన్సెలింగ్!

రాష్ట్రంలో పీజీ సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను శనివారం నుంచి చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పీజీఈసెట్‌లో ర్యాంకుల ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నారు. అందులో భాగంగా శనివారం నోటిఫికేషన్ జారీ చేసి ఈనెల 30 నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు. ఆగస్టు 12, 13వ తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకునేందుకు, 14న ఆప్షన్లను ఎడిట్ చేసుకునేందుకు అవకాశమిస్తారు. 17న సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 18 నుంచి 21వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. ఆ తర్వాత ఆగస్టు 20 నుంచి రెండవ దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

'సమీకృత గురుకులాల'కు ఏకరీతి భవనాలు

» డిజైన్లు తయారు చేయాలన్న సీఎస్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలతో కలిపి ప్రభుత్వం ఏర్పాటు చేయదల్చిన 'సమీకృత సంక్షేమ గురుకుల పాఠశాలల' కోసం ఏకరీతి భవన డిజైన్లను రూపొందించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. 'సమీకృత సంక్షేమ గురుకుల పాఠశాల'లపై సచివాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ స్కూళ్ల కోసం భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలను చర్చించారు. పనుల పురోగతి పర్యవేక్షణకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

మరో 4 మార్కెట్ యార్డులకు పాలకవర్గాలు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు మార్కెట్ యార్డులకు పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. చేర్యాల, వనపర్తి రోడ్డు, దేవరకద్ర, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గ సభ్యులు, చైర్‌పర్సన్‌లను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ఇప్పటి వరకు 19 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమించాం. మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా కొత్త పాలక వర్గాలను త్వరలోనే నియమిస్తాం" అని తెలిపారు.

డీలర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయండి

» రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంచనున్నట్లు హామీ ఇచ్చారని, ఆ హామీలను వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 17,200 మంది రేషన్ డీలర్లు చాలీ చాలని కమీషన్‌లతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గన్నీ బ్యాగుల బిల్లు వెంటనే విడుదల చేయాలని కోరారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధమైంది. అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. ఒకేచోట రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం సర్వీసులో ఉన్న వారందరికీ స్థాన చలనం కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు, గ్రేడ్-1, గ్రేడ్-2, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, 11 జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (హైదరాబాద్‌లో రెండు) పనిచేస్తున్న వారందరూ ఏకకాలంలో బదిలీ కానున్నారు. ఈ బదిలీల కోసం ప్రభుత్వ రెండు రోజుల కిందటే ఉద్యోగుల నుంచి ఆప్షన్లు కోరింది. ఒక్కొక్కరూ 5 ఆప్షన్లు ఇస్తూ జూలై 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఒకటి రెండు రోజుల్లో ఈ జాబితా విడుదల కానుందని విశ్వసనీయ సమాచారం.

వైద్య కళాశాల ప్రొఫెసర్ల బదిలీలను ఆపాలి

» సీనియర్ రెసిడెంట్ వైద్య విద్యార్థులు

అడ్డగుట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రొఫెసర్ల బదిలీలను ఆపాలని సీనియర్ రెసిడెంట్ వైద్య విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల సూపర్ స్పెషాలిటీ ప్రొఫెసర్‌ల బదిలీల కారణంగా ఓ వైపు వైద్యసేవలపై, మరోవైపు బోధనపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు తమ సమస్యల్ని వివరిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి గాంధీ సీనియర్ రెసిడెంట్ విద్యార్థులు లేఖ రాశారు. ఆయా విభాగాల్లో మొత్తం బోధనా సిబ్బంది ఒకేసారి బదిలీ అయ్యారని, ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు వచ్చే అవకాశం లేదని వారు అన్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ ప్రొఫెసర్లు ఉంటారు కాబట్టి వైద్య విద్యార్థులు చేరుతున్నారని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల తరహాలో వైద్యవిద్య బోధనా సంస్థల్లో బదిలీలను పరిగణించవద్దని వారు కోరారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలాచార్యులు, కేవీ రమణాచారి

21న శ్రీ వైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు

పంజాగుట్ట, జూలై19 (ఆంధ్రజ్యోతి): శ్రీ వైష్ణవ సేవా సంఘం-తెలంగాణ రజతోత్సవాలు ఈ నెల 21న మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో జరగనున్నాయి. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచార్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.వి రమణాచారి, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శృంగారం తిరువేంగళాచార్యులు,సేనాపతి మోహన్‌లు రజతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 21న ఉదయం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి ముఖ్యఅతిథిగా, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొనున్నారని వేణుగోపాలాచార్యులు, రమణాచారి తెలిపారు. సాయంత్రం జరిగే రజతోత్సవ సభలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి మంగళాశాసనములు ఇస్తారని చెప్పారు.



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుపై ఆర్కిటెక్ట్‌లతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సెమీ రెసిడెన్షియల్

(మొదటిపేజీ తరువాయి)

తెరిచిన రోజే పిల్లలందరికీ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందజేయడంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా బడుల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, విద్యావేత్తలు ఇచ్చే మంచి సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, ఆల్డాస్ జానయ్య, పద్మజా షా, లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సూచనలు చేయడంతో పాటు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో కార్యకర్తలకు బోధించే నైపుణ్యం ఉండడం లేదని, సరైన వసతులు లేవని చెప్పారు. వాటిని ప్రీ స్కూళ్లుగా మార్చి, వలంటీర్లను తీసుకొని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చే యోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇక నాలుగో తరగతి నుంచి 12వ తరగతి దాకా సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు ప్రభుత్వమే ఉచిత రవాణా సదుపాయం కల్పించాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు.

నేను, భట్టి సర్కారీ బడిలోనే చదివాం..

పదేళ్లుగా యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది నియామకం జరగలేదని, వీసీలు లేరని ప్రొఫెసర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం.. ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశామని, త్వరలోనే వీసీల నియామకం పూర్తవుతుందని తెలిపారు. యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్లు ఇవ్వాలని, ప్రతి వర్సిటీలో వివిధ అంశాలపై లోతైన చర్చ జరగాలని, అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ జానయ్య ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, తామంతా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే చదువుకున్నామని, ప్రస్తుతం అక్కడా విద్యా ప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై విధాన పత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆయా అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంతోనూ చర్చించాలని వారికి సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అతి తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలు ఇస్తాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు వాటి సాధనకు ప్రయత్నిస్తున్నాయని ప్రొఫెసర్ జానయ్య సీఎంకు చెప్పగా.. ఆ అంశాన్ని పరిశీలిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యా శాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంపు అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, కచ్చితంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంచుతామని సీఎం అన్నారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని సీఎం నిర్ణయించారని, బడ్జెట్ కేటాయింపులు తప్పకుండా పెంచుతామని భట్టి తెలిపారు. భేటీలో ప్రభుత్వ సలహాదారు కేకే, సీఎం ప్రధాన కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి: సీఎం రేవంత్

రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆదేశించారు. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టితో పాటు అధికారులతో కలిసి ఆయన విద్యాశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సమీకృత రెసిడెన్షియళ్లతో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. 3వ తరగతి వరకు సొంత గ్రామాల్లోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చదివిన అనంతరం 4వ తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. 3వ తరగతి వరకు అంగన్‌వాడీల్లోనే విద్యాబోధన అందించేందుకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించాలని, అంగన్‌వాడీల్లో అదనంగా మరో టీచర్‌ను నియమించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. ఆయా ప్రణాళికలను రూపొందించడానికి ముందే విద్యావేత్తలతో చర్చించి, వారి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. వారి సూచనల మేరకు ఒకటి, రెండు మండలాల్లో ప్రీ స్కూల్, సెమీ రెసిడెన్షియల్స్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సూచించారు.

17 కోర్సులతో

స్కిల్స్ వర్సిటీ

» ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహణ

» బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు

» యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

» ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

» యూనివర్సిటీ ఏర్పాటుపై సమీక్ష

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై రానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు, నిర్వహణకు ఎంత ఖర్చయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించే సమున్నత లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలున్న రంగాలకు సంబంధించి 17 కోర్సులను ఈ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు, ఏటా 20 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా దీనిని తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి స్కిల్స్ యూనివర్సిటీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హరియాణలో ఉన్న స్కిల్ వర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్లో) ఈ యూనివర్సిటీ నెలకొల్పుతారు. మూడు నాలుగేళ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతోపాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులను కూడా ఇందులో నిర్వహిస్తారు.

సీఎం ఢిల్లీ పర్యటన వాయిదా

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్ వాయిదా పడింది. రైతు రుణమాఫీ హామీ అమలు నేపథ్యంలో వరంగల్‌లో తలపెట్టిన భారీ బహిరంగ సభకు రాహుల్‌ను ఆహ్వానించేందుకు శనివారం ఢిల్లీ వెళ్లాలని ఆయన తొలుత భావించారు. అయితే రాహుల్ గాంధీ అందుబాటులో లేక పోవడంతో పర్యటన వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పరిశ్రమల అవసరాల మేరకు..

తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను స్కిల్స్ యూనివర్సిటీ కోసం ఎంపిక చేశారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ-కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్ వంటి ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులను తొలుత ప్రవేశ పెడతారు. ప్రతి కోర్సునూ సంబంధిత రంగంలో పేరొందిన ఒక కంపెనీ భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. ఇందుకు సంబంధించి కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంటుంది. తొలి ఏడాది 2 వేల మందితో ప్రారంభించి, క్రమంగా పెంచుతూ ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. కాగా, హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ (ఈఎస్‌సీ) క్యాంపస్‌తోపాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్‌లు) ఏర్పాటు చేయాలనే చర్చ సమావేశంలో జరిగింది. అయితే జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే.. వాటిలో చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందుకే హైదరాబాద్‌లోనే అందరికీ శిక్షణ అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఈఎస్‌సీతోపాటు న్యాక్ క్యాంపస్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలన్నారు.

డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి

స్కిల్స్ యూనివర్సిటీలో డిమాండ్ అధికంగా ఉన్న రంగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నందున.. అటువంటి కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని చెప్పారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. కాగా దేవాదాయశాఖలో చేపట్టనున్న బదిలీల్లో అర్చకుల్ని బదిలీ చేయబోమని సీఎం రేవంత్ చెప్పారు. అర్చకుల బదిలీలకు సంబంధించి గందరగోళం నెలకొన్న నేపథ్యంలో సీఎంను ఆయన నివాసంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, జనరల్ సెక్రటరీ ఆనంద్‌శర్మ శుక్రవారం కలిశారు.

సోనియా, రాహుల్ డైరెక్షన్‌లో..

రుణమాఫీ మొదలెట్టిన రేవంత్, మంత్రివర్గం

» రుణమాఫీతో బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లకు నిద్రపట్టట్లేదు

» రైతుల పేరిట సినిమాలు తీసిన చిరంజీవి ఢిల్లీ నిరసనకు మద్దతెందుకు తెలపలేదు?

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం 4 గంటల నుంచి.. సోనియా, రాహుల్ డైరెక్షన్‌లో.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం.. రూ. 2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి చెప్పారు. పదేళ్ల అధికారంలో రూ.7 లక్షల కోట్ల మేరకు అప్పులు చేసిన కేసీఆర్, హరీశ్‌రావులు.. రైతు రుణమాఫీ పథకానికి ఖర్చు చేసింది కేవలం రూ.26 వేల కోట్లు మాత్రమేనన్నారు. కానీ.. సోనియాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.31 వేల కోట్ల మేరకు రైతు రుణమాఫీని మొదలు పెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇంకా నాలుగున్నరేళ్ల సమయం ఉన్నా.. ఆరు నెలల్లోనే పూర్తి చేస్తుందన్నారు. పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రైతులకు ఎన్ని వేలకోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేసిందో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చెప్పగలరా అంటూ నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకాన్ని ప్రారంభించగానే రైతుల ఇళ్లలో సంబరాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. రుణమాఫీ పథకం అమలుతో రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టడం లేదని, కొందరు నేతలైతే నిద్రమాత్రలు వేసుకుని పడుకున్నారని ఎద్దేవా చేశారు. గడిచిన పదేళ్లలో నీరవ్‌మోదీ, విజయ్ మాల్యా వంటి పది మంది పెద్ద మనుషులకు మోదీ ప్రభుత్వం రూ. 6 లక్షల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేసిందని, అందులో ఎవరైనా రైతులు ఉంటే చెప్పాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరారు. సోనియాగాంధీ నేతృత్వంలోని యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో ఒకేసారి రైతులకు రూ.75 వేల కోట్ల మేరకు మాఫీ చేసిందని గుర్తు చేశారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెస్తే.. వాటిని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన రైతులను.. కేంద్ర మంత్రుల పిల్లలు తమ వాహనాలతో తొక్కించి హత్య చేశారు. దీనిపై చర్చకు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. రైతుల పక్షాన ఖైదీ నెంబర్ 150 సినిమా తీసి హిట్ కొట్టిన చిరంజీవి.. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు నిర్వహిస్తున్న రైతులకు మద్దతు ఎందుకు తెలపలేదని ప్రశ్నించారు. బీజేపీకి మద్దతు ఇస్తున్న ఆయన తమ్ముడు పవన్ కల్యాణ్‌కు.. రైతుల గురించి ఎందుకు చెప్పలేకపోయారన్నారు. ఢిల్లీలో రైతుల ఆందళనలకు రాహుల్‌గాంధీ మద్దతు ఇచ్చారని, రైతుల పేరుతో సినిమాలు తీసి రూ.కోట్లు సంపాదించుకున్నవారు మాత్రం బీజేపీకి మద్దతు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్ ట్వీట్లకే పనికొస్తారని విమర్శించారు. రుణమాఫీకి డబ్బులు ఎక్కడ తెచ్చారన్నది సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికే తెలుసునని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

బ్యారేజీలపై నివేదికను అమలు చేశారా!

» నేడు సమగ్ర నివేదికతో సమావేశానికి రండి

» రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ లేఖ.. ఢిల్లీలో భేటీ

» హాజరుకానున్న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారణాలు తెలుసుకునేందుకుగాను తగిన పరీక్షలు చేయాలంటూ తామిచ్చిన నివేదికను అమలు చేశారా? అని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ నివేదిక ప్రకారం ఏయే చర్యలు తీసుకున్నారనే అంశాలపై సమీక్షించేందుకు శనివారం న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశానికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. కాగా, కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలపై వానాకాలానికి ముందు జియో ఫిజికల్, జియో టెక్నికల్, స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు చేసి, నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించింది. ఈ పరీక్షలను కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్(సీఎస్‌ఎంఆర్‌ఎస్), జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్‌ఐ)లతో చేయించాలని మే 1న ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదికను ఇచ్చింది. ఆ తరువాత.. ఈ నివేదిక అమలు ఎక్కడిదాకా వచ్చిందని ప్రశ్నిస్తూ మే 13వ తేదీతోపాటు జూన్ 25న, ఈ నెల 11న తెలంగాణకు ఎన్‌డీఎస్‌ఏ లేఖలు రాసింది. అయితే అన్నారం, సుందిళ్లలో పరీక్షల కోసం బోర్‌హోల్స్ వేస్తుండగా.. ఇసుక, నీరు బయటికి వస్తున్నాయని తెలంగాణ పేర్కొంది. ఈ నేపథ్యంలో పరీక్షలు నిలిపివేసి చేసి, జియో టెక్నికల్ పరీక్షల కోసం ప్రత్యామ్నాయాలు సూచించాలని తెలంగాణ ఈనెల 5న లేఖ రాసింది. దీంతో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఇప్పటిదాకా ఎన్ని బోర్‌హోల్స్/డ్రిల్లింగ్స్ చేశారు? బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో ఇప్పటిదాకా ఎన్ని డ్రిల్లింగ్ చేశారు..? వంటి అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని ఎన్‌డీఎస్‌ఏ కోరింది. సీడబ్ల్యూపీఆర్‌ఎస్ ఇచ్చిన నివేదిక, బ్యారేజీలపై అధ్యయనాలపై ఫొటోలు సహా సమగ్ర నివేదికను అందించాలని ఎన్‌డీఎస్‌ఏ నిర్దేశించింది. ఈ అంశాల ఆధారంగా శనివారం సమావేశంలో చర్చించనున్నారు.

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌కు..

రక్షణ కవచంగా హైడ్రా

» ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేసిన సర్కారు

» చెరువులు, పార్కుల కబ్జాలకు, నాలాలు, రోడ్ల ఆక్రమణలకు చెక్!

» హైడ్రా విధివిధానాలు ఖరారు.. జీవో 99 విడుదల చేసిన ప్రభుత్వం

» పాలక మండలి చైర్మన్‌గా సీఎం.. మంత్రులు, సీఎస్, డీజీపీ సభ్యులు

» పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా.. టికూర్ సబ్ కమిటీ

హైదరాబాద్/సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సర్కారీ ఆస్తుల ఆక్రమణలకు.. చెరువులు, పార్కుల కబ్జాకు చెక్ పెట్టే ప్రత్యేక వ్యవస్థ హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అందుబాటులోకి వచ్చింది! ఇప్పటికే కనుమరుగైపోయిన.. కబ్జాల బారిన పడి అన్యాక్రాంతమవుతున్న పార్కులు, ఖాళీ స్థలాలు, ఆట స్థలాలు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా దీని ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దాని విధివిధానాలను ఖరారు చేస్తూ శుక్రవారం జీవో 99 జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతోపాటు.. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలకు సంబంధి ఔటర్ రింగ్ రోడ్డు వరకూ విస్తరించిన పట్టణ ప్రాంతాలు, గ్రామ పంచాయతీలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టికూర్)గా పేర్కొంటూ ఆ పరిధిలో ఆస్తుల పరిరక్షణ బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ పరిధిలో వెయ్యిదాకా చెరువులు ఉంటాయని అంచనా. ప్రణాళిక, నిర్వహణ, సమన్వయం, ఆచరణ అన్న నాలుగు సూత్రాలను పరిగణలోకి తీసుకుని జాతీయ విపత్తుల నిర్వహణ ఏజెన్సీలకు దీటుగా హైడ్రా పని చేయాల్సి ఉంది. హైడ్రా కమిషనర్ విపత్తుల నిర్వహణతోపాటు.. ఈ పరిధిలోని సర్కారీ ఆస్తుల సంరక్షణ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. పురపాలక శాఖ ఆధీనంలోనే ఒక కమిషనర్ నేతృత్వంలో హైడ్రా ప్రత్యేక వ్యవస్థగా పని చేయనుంది.. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి పర్యవేక్షణలో అఖిల భారత సర్వీసులకు చెందిన కార్యదర్శి స్థాయి అధికారి దీనికి కమిషనర్‌గా వ్యవహరిస్తారు.

ఆస్తుల రక్షణ.. విపత్తుల నిర్వహణ

ఆస్తుల సంరక్షణకు ప్రత్యేక విభాగం హైడ్రా పరిధిలో పనిచేయనుంది. దీంతోపాటు విపత్తుల నిర్వహణ, లాజిస్టిక్ విభాగాలు హైడ్రాలో అంతర్భాగంగా పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలకు లోబడి స్థానిక సంస్థలతో కలిసి పాలనా పరమైన నిర్ణయాలు తీసుకునే వెసులబాటును కూడా హైడ్రాకు కల్పించారు. స్థానిక సంస్థల ఆధీనంలో ఉండే పార్కులు, ప్రభుత్వ భూములు, లేఅవుట్ ఖాళీ స్థలాలు, చెరువులు, కాలువలు, కుంటలు, వివిధ అవసరాలకు కేటాయించిన భూములు, రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి. కాలువలు, చెరువుల్ని ఎవరైనా ఆక్రమించుకుంటే జీహెచ్‌ఎంసీ, మునిసిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని తొలగించడం కూడా హైడ్రా బాధ్యతే. హోర్డింగులు, ప్రకటనలకు సంబంధించి అనుమతుల మంజూరు, రుసుముల వసూళ్లు, చర్యలు తీసుకునే అధికారాలను స్థానిక సంస్థలతో కలిసి నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే.. అత్యవసర సమయంలో విపత్తుల నిర్వహణకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఎంఏ తదితర జాతీయ, రాష్ట్ర సంస్థలతో కలిసి పనిచేయాలి. హైడ్రాకు ఒక పాలక మండలి కూడా ఉంటుంది. ముఖ్యమంత్రి దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పురపాలక, రెవెన్యూ శాఖల మంత్రులు, ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్‌ఎంసీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కమాండ్ కంట్రోల్ సెంటర్ హెడ్, కమిషనర్ హైడ్రా, పాలనావసరాల రీత్యా సీఎస్ ప్రతిపాదన నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఈ పాలక వర్గం హైడ్రా పనితీరును సమీక్షించనుంది. అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది. అలాగే.. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం ప్రకారం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టికూర్) కోసం ఒక విపత్తుల నిర్వహణ సబ్‌కమిటీని కూడా ఏర్పాటు చేశారు. దీనికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

'చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి' పరీక్షలు రద్దు

» గత ఏడాది జనవరిలో పరీక్షల నిర్వహణ

» సిట్, ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా రద్దు: టీజీపీఎస్సీ

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం 2023లో నిర్వహించిన పరీక్షలను రద్దు చేస్తున్నట్టు టీజీపీఎస్సీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది (బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో) జనవరి 3, 8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం నేపథ్యంలో ఈ పరీక్షలను రద్దు చేశారు. సిట్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రటించారు. ఈ పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపారు. దాదాపు ఏడాదిన్నర తర్వాత పరీక్షలను రద్దు చేయడం గమనార్హం.

ఎయిమ్స్‌లో కవితకు వైద్య పరీక్షలు

న్యూఢిల్లీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు శుక్రవారం ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. న్యాయమూర్తి అనుమతి ఇవ్వడంతో కవితకు ఆమె భర్త అనిల్ సమక్షంలోనే వైద్య పరీక్షలు చేశారు. కవిత జ్యుడిషియల్ కస్టడీతోపాటు సీబీఐ అదనపు చార్జిషీట్, బెయిల్ పిటిషన్లపై సోమవారం విచారణ జరగనుంది. సోమవారంలోపే వైద్య పరీక్షల నివేదికలను న్యాయస్థానానికి సమర్పించాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి కావేరి భవేజా ఆదేశించారు. అనారోగ్య సమస్యల నేపథ్యంలో కవితకు న్యాయస్థానంలో బెయిల్ లభిస్తుందా? లేదా? అనే విషయంపై విచారణ తర్వాత స్పష్టత వచ్చే అవకాశముంది.

సర్కారు మార్గదర్శకాలే మాఫీకి మరణ శాసనాలు

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రుణమాఫీ అయిన రైతులకన్నా.. కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని, సర్కారు రూపొందించిన మార్గదర్శకాలు రుణమాఫీ పథకానికి మరణ శాసనాలయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అన్నివిధాలా అర్హతఉన్నా.. ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పేవారేలేరని, రైతుల గోడు వినేవారే లేరని శుక్రవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆందోళనలో ఉంటే సంబరాలు జరుపుకోవడమేంటని ప్రశ్నించారు. జూన్‌లో వేయాల్సిన రైతుభరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వెయ్యలేదని, కౌలు రైతులకు.. ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యనేలేదన్నారు.

పేదరిక నిర్మూలనలో తెలంగాణ రెండోస్థానం హర్షణీయం

పేదరికలో నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండోస్థానంలో ఉందని నీతిఆయోగ్ నివేదికలో పేర్కొనడం హర్షణీయమని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పదేళ్లపాటు తెలంగాణలో పేదరిక నిర్మూలనతోపాటు సుస్థిర అభివృద్ధి కోసం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. తాజాగా విడుదల చేసిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) లెక్కలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. గతప్రభుత్వం రాష్ట్రాన్ని మెరుగైన స్థితికి చేర్చిందని ఈ ప్రభుత్వం కూడా ఆ స్ఫూర్తిని కొనసాగించి అభివృద్ధివైపు నడిపించాలని సూచించారు.

రైతులకు ఆర్థికసాయం..
బీఆర్ఎస్‌దే ఆల్‌టైమ్ రికార్డు: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలన సాగుకు స్వర్ణయుగమని, రైతు సంక్షేమం కోసం రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించినట్లు మాజీమంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆయా పథకాల ద్వారా రైతన్నలకు నేరుగా రూ.1,20,005 కోట్ల ఆర్థికసాయం అందించామని, దేశచరిత్రలో ఇది ఆల్‌టైమ్ రికార్డని తెలిపారు. ఆ మొత్తంలో 69 లక్షల రైతులకు రూ.72,972 కోట్ల రైతుబంధు ఇచ్చామని, 1.11లక్షల మందికి రూ.6,488 కోట్లు రైతుబీమా కోసం ఖర్చుచేశామన్నారు. అదే విధంగా రెండు దఫాల్లో రుణమాఫీకి రూ.29,144.61కోట్లను ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రూ.11.401 కోట్లు వెచ్చించినట్లు హరీష్‌రావు వెల్లడించారు.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎన్‌కౌంటర్!

» మావోయిస్టు మృతి

ములుగు, చర్ల, జూలై 19: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగింది. తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరగ్గా ఓ మావోయిస్టు మృతిచెందినట్టు ములుగు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎల్మిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీమలదొడ్డి అటవీ ప్రాంతం ఉరవసారి గుట్ట సమీపంలో శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు సుమారు 20మంది సభ్యులున్న మావోయిస్టు దళం ఎదురైంది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య 15 నిమిషాలపాటు ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించగా పోలీసులకు ఓ మావోయిస్టు సభ్యుడి మృతదేహం, సమీపంలో 9ఎంఎం కార్బన్ తుపాకీ, తూటాలు, డిటోనెటర్, మందుగుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం, కిట్‌బ్యాగు, నిత్యావసర వస్తువులు లభ్యమయ్యాయి. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహంతోపాటు లభ్యమైన సామగ్రిని స్వాధీనపర్చారు. కాగా కొద్దిరోజులుగా ములుగు ఏజెన్సీలో పోలీసు చర్యలు నివురుగప్పిన నిప్పులా మారాయి. అటవీ గ్రామాలు, గొత్తికోయ గూడాలలో పోలీసులు తనిఖీలు జరుపుతున్నారు. మావోయిస్టు పార్టీ మోస్ట్‌వాంటెడ్ నాయకులు ఛత్తీస్‌గఢ్ అడవులను వదిలి తెలంగాణ సరిహద్దు గ్రామాలకు వచ్చారని, రిక్రూట్‌మెంట్లను ప్రోత్సహిస్తున్నారనే నిఘావర్గాల హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఏసీబీకి చిక్కిన సూర్యాపేట ఇన్‌చార్జి డీఎఫ్‌వో

భానుపురి, జూలై 19: రూ.25 వేల లంచం సొమ్ముతో సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారి(డీఎఫ్‌వో) రూపేందర్‌సింగ్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఏసీబీ నల్లగొండ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చేపలు పట్టుకునేందుకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు రూపేందర్ లంచం డిమాండ్ చేస్తున్నారని సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. సమాచారం మేరకు శుక్రవారం సూర్యాపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బాధ్యులు రూపేందర్ ఇంటికి వెళ్లి రూ.25 వేలు ఇచ్చి బయటకు వస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు ఇంట్లోకి వెళ్లి సోదాలు చేసి ఆ డబ్బును పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు రూపేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, 2016లో నిజామాబాద్‌లో రూ.5 వేలు లంచం తీసుకుంటూ రూపేందర్ ఏసీబీకి పట్టుబడ్డారు.

నేడు బీజేవైఎం నిరుద్యోగ మహాధర్నా

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగ మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ ఆందోళనలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొననున్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 4వేల భృతి ఇవ్వాలని, గ్రూప్ 2లో పోస్టులను 2వేలకు పెంచాలని తదితర డిమాండ్లతో ఈ మహాధర్నా నిర్వహించనున్నారు.

ప్రముఖ కవి అడిగోపుల కన్నుమూత

» 28 కవితాసంపుటాలు వెలువరించిన వెంకటరత్నం

» నేడు స్వస్థలం నెల్లూరుకు భౌతికకాయం తరలింపు



తిరుపతి (కల్చరల్), జూలై 19: ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం (83) శుక్రవారం ఉదయం తిరుపతిలో కన్నుమూశారు. 50 ఏళ్లుగా కవిత్వం రాస్తున్న ఆయన 28 కవితా సంపుటాలను వెలువరించారు. ఆయన స్వస్థలం నెల్లూరు. ఇంజనీరుగా నాగార్జున వర్సిటీలో ఉద్యోగ విరమణ పొందిన తరువాత తిరుపతిలో స్థిరపడ్డారు. ఇటీవలే ఆయన కవితాసంపుటి 'నిలువెత్తు సంతకం' ఆవిష్కరణ జరిగింది. నూతలపాటి, తానా, విశాలాక్షి సహా 20కిపైగా సత్కారాలను ఆయన అందుకున్నారు. అడిగోపుల వెంకటరత్నం రచనలపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, నాగార్జున వర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. కాగా, తిరుపతి ఎన్‌జీవో కాలనీలోని వెంకటరత్నం నివాసంలో వారి భౌతికకాయాన్ని పలువురు సాహితీకారులు సందర్శించి, నివాళి అర్పించారు. వెంకటరత్నం కుమారుడు విదేశాల నుంచి రావలసి ఉంది. దీంతో శనివారం మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఆయన భౌతికకాయాన్ని నెల్లూరుకు తరలించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

డిసెంబరుకు గ్రూప్-2 వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 5 వరకు కొనసాగనున్నాయి. వెంటనే ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు ఉన్నాయి. దీంతో ఈ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 అభ్యర్థులు, నిరుద్యోగులు శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. గ్రూప్-2 పరీక్షలను డిసెంబరులో నిర్వహించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చిస్తామని భట్టి చెప్పారు. వెంటనే టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్ చేసి, పరీక్షలను డిసెంబరు చివరి వారానికి వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఉద్యోగ ఖాళీలను గుర్తించి, త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భట్టి తెలిపారు. ప్రభుత్వాన్ని బెదిరించి, కేసుల పాలైతే అభ్యర్థులే నష్టపోతారని అన్నారు. స్వార్థ రాజకీయాలతో కొందరు చేసే కుట్రల్లో ఇరుక్కుని నష్టపోవద్దని అభ్యర్థులకు హితవు పలికారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం నియోజకవర్గాల్లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తామన్నారు. మంత్రి భట్టి సూచనల తర్వాత గ్రూప్-2 పరీక్షలను డిసెంబరుకు వాయిదా వేస్తున్నట్లు టీజీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే పరీక్షల తేదీలను మాత్రం ప్రకటించలేదు.

ఇది నిరుద్యోగుల విజయం: బీజేపీ

గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నిరుద్యోగుల విజయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ తెలిపారు. నిరుద్యోగులకు మద్దతుగా బీజేపీ చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. కొత్త తేదీల ప్రకటనతో పాటు పోస్టుల సంఖ్య పెంపుపై కూడా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఓయూలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయడాన్ని హర్షిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో అభ్యర్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొందరికి ఇంకా పడలే!

జాబితాలో పేరున్నా ఖాతాల్లో జమకాని రుణమాఫీ సొమ్ము.. ఫోన్‌కు మెసేజ్ రాకపోవడంతో రైతుల ఆందోళన

» నేటితో రూ.లక్షలోపు అందరికీ వస్తాయంటున్న బ్యాంకర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష లోపు రుణమాఫీపై క్షేత్ర స్థాయిలో కొంత గందరగోళం నెలకొంది. రుణమాఫీ జాబితాలో పేరు ఉండి.. మాఫీ సొమ్ము ఖాతాలో పడనివారు కొందరైతే, మాఫీకి అర్హత ఉండి జాబితాలో పేరు రానివారు మరికొందరు గందరగోళానికి గురవుతున్నారు. లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లో ముందుగా వెల్లడించకపోవడమే ఇందుకు కారణమైంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మూడు నాలుగు రోజుల ముందే జాబితాలను వెల్లడించి ఉంటే.. రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు, లోటుపాట్లను సరిదిద్దుకునేందుకు అవకాశం ఉండేది. రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతు కుటుంబాలకు ఒకేసారి ఈ నెల 18న మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం, లక్షకు పైగా రుణం ఉన్నవారికి ఈ నెలాఖరులోగా, రూ.2 లక్షల వరకు రుణాలను ఆగస్టు 15 నాటికి మొత్తం మాఫీ చేస్తామని చెప్పడం తెలిసిందే. ఈ మేరకు రూ.లక్ష మాఫీని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మాఫీకి అర్హుల జాబితాలను వ్యవసాయ శాఖ.. బ్యాంకులకు అందజేయగా, వారు రైతుల బ్యాంకు ఖాతాల్లో మాఫీ సొమ్మును జమ చేశారు. ఈ మేరకు మాఫీ అయిన చాలా మంది రైతుల ఫోన్లకు బ్యాంకుల నుంచి మెసేజ్‌లు వచ్చాయి. అయితే కొందరికి మాత్రం రుణమాఫీ పొందేవారి జాబితాలో పేరు ఉండి కూడా.. మాఫీ అయినట్లుగా మెసేజ్ రాలేదు. దీంతో ఆయా రైతులు ఆందోళనకు గురై.. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు, బ్యాంకుల వద్దకు పరుగులు పెట్టారు. అయితే జాబితాలో ఉన్నవారందరికీ మాఫీ వస్తుందని, అందరి ఖాతాల్లో డబ్బు జమ అయ్యేందుకు 48 గంటల సమయం పడుతుందని బ్యాంకు అధికారులు రైతులకు చెప్పి పంపిస్తున్నారు. ఉదాహరణకు.. నల్లగొండ జిల్లాలో 83,124 మంది రైతులకు రూ.లక్ష చొప్పున మాఫీకిగాను రూ.455 కోట్లు మంజూరయ్యాయి. కానీ, జాబితాలో పేర్లున్న రైతుల ఖాతాల్లో శుక్రవారం వరకు కూడా డబ్బులు జమ కాలేదు. జనగామ జిల్లాలో 26,496 మందికి రుణ మాఫీ జరగాల్సి ఉండగా... 22 వేల మందికి మాత్రమే జమ అయ్యాయి. మరో 4 వేల పైచిలుకు మందికి రాలేదు.



అర్హత ఉన్నా జాబితాలో రాని పేరు..

మరికొన్ని చోట్ల.. కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది పేరిట భూమి ఉన్నా.. ఒకే బ్యాంకు ఖాతా ఉండి, రూ.లక్ష లోపే రుణం ఉన్నా మాఫీ జాబితాలో వారి పేరు రాలేదు. ఇంకొన్ని చోట్ల కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మందికి రుణం ఉండి, అంతా కలిపి రూ.లక్ష లోపు ఉండగా.. ఒక్కరి పేరుమీద ఉన్న మొత్తం మాత్రమే మాఫీ అయింది. మిగతా వారి పేరిట ఉన్న మొత్తం మాఫీ కాలేదు. ఇలాంటి వారందరికీ సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. అయితే.. ఈ మొత్తం గందరగోళానికి జాబితాలను ముందుగా వెల్లడించకపోవడమే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ అమలుకు ముందే లబ్ధిదారుల జాబితాలను గ్రామాల్లో వెల్లడించి, అందరి ఖాతాల్లో ఒకటి రెండు రోజులు అటు ఇటుగానైనా సొమ్ము జమ అవుతుందన్న విషయాన్ని చెప్పి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదని అంటున్నారు. అయితే ఆగస్టులో రుణమాఫీ చేస్తామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం.. ఆ తరువాత వెంటనే అమలుకు ఉపక్రమించింది. తొలుత రూ.లక్ష రుణం మాఫీ చేస్తామంటూ ఒక్కరోజులోనే మార్గదర్శకాలు విడుదల చేసి.. ఆ మరుసటిరోజే మాఫీ ప్రారంభించింది. జాబితాలను నేరుగా బ్యాంకులకు పంపించింది. దీంతో జాబితాలను గ్రామాల్లో వెల్లడించే అవకాశంలేక.. లబ్ధిదారులెవరో తెలుసుకునే వీలులేకుండా పోయింది.

రుణం 2లక్షలు.. మాఫీ 3వేలు!

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన నల్ల నరసింహారెడ్డి అనే రైతుకు మల్యాల సింగిల్‌విండో పరిధిలో గత ఏడాది సెప్టెంబర్19 నాటికే రూ.2.25లక్షల పంట రుణం ఉంది. ఈ రైతుకు ప్రభుత్వం విడుదల చేసే మూడవ విడతలో రూ.2లక్షలు మాఫీ కావాల్సి ఉంది. మొదటి విడత రూ.లక్ష రుణమాఫీ జాబితాలోనే రైతు పేరు రావడంతో జాబితా పరిశీలించాడు. ఇందులో రూ.3వేలు మాఫీ అయినట్లు వచ్చింది.

మల్లన్నసాగర్ నిర్వాసితుల పరిస్థితేంటి?

మల్లన్నసాగర్ నిర్వాసితుల్లో చాలా మందికి రుణ మాఫీ జరగలేదు. పంట రుణాలు చెల్లించొద్దని, తాము మాఫీ చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పడంతో 2016కు ముందు తీసుకున్న రుణాలను వారు చెల్లించలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీకి కటాఫ్ విధించడంతో నిర్వాసితులకు మాఫీ కాకుండా పోయింది. వీరిలో 17మంది రెన్యువల్ చేసుకోవడంతో వారి పేర్లు మాఫీ జాబితాలో వచ్చాయి.

గవర్నర్ దృష్టికి పార్టీ ఫిరాయింపుల వ్యవహారం

» నేడు కలవనున్న బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల వ్యవహారాన్ని రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసేందుకు శనివారం అపాయింట్‌మెంట్ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ముఖ్య నేతలు గవర్నర్‌ను కలిసి.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాయి. అదేవిధంగా ఎమ్మెల్యేల ప్రొటోకాల్ ఉల్లంఘన, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నేతలకు సంబంధిత అధికారులు ప్రాధాన్యం ఇవ్వడాన్ని కూడా నేతలు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లనున్నారు. దీంతోపాటు ఇటీవల నిరుద్యోగులపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టడం, వరుస హత్యోదంతాలు, రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై కూడా ఫిర్యాదు చేయనున్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

» మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తనను హత మార్చుతామంటూ బెదిరింపు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై ద్వేషం పెంచుకుందని విమర్శించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో తనపై కాల్పులు జరిపిన దుండగులను ఇప్పటికీ అరెస్ట్ చేయలేదని పేర్కొన్నారు ఒక పార్లమెంట్ సభ్యునిపైనే దాడులు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం, యూపీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అస్సాంలో ముస్లింల జనాభా 40శాతం దాటిందంటూ ముఖ్యమంత్రి హిమంత బిశర్మ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ అక్కడ 34 శాతం మాత్రమే ముస్లింల జనాభా ఉందని చెప్పారు.

రెండు నెలల్లో హెచ్చార్సీ పదవుల నియామకం

» హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవహక్కుల సంఘం (హెచ్చార్సీ) చైర్మన్, సభ్యుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని, రెండు నెలల్లో దీనిని పూర్తిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఖాళీగా ఉన్న ఈ కమిషన్ పదవులు భర్తీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ గతేడాది ఏప్రిల్‌లో అదాన్ మహమూబ్ అనే న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం మరోసారి ఈ పిటిషన్ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ ఏడాది మార్చి 10న ఈ పదవుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. మరో రెండునెలల్లో చైర్మన్, సభ్యుల నియామకాలు పూర్తిచేస్తామని తెలిపారు. ఈ వివరణను రికార్డుల్లోకి తీసుకున్న ధర్మాసనం.. విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

పత్రాలన్నీ సక్రమంగా ఉంటే వారం రోజుల్లో రిజిస్ట్రేషన్

» తిరస్కరిస్తే కారణాలు చెప్పాలి

» సబ్‌రిజిస్ట్రార్‌లకు హైకోర్టు మార్గదర్శకాలు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వివాదాలు పరిష్కారమైన భూముల్లో సైతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు పలువురు సబ్‌రిజిస్ట్రార్‌లు నిరాకరిస్తున్న నేపథ్యంలో హైకోర్టు పలు మార్గదర్శకాలు జారీచేసింది. వివాదాలు పరిష్కారమైనప్పటికీ తాజాగా కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ సబ్‌రిజిస్ట్రార్‌లు అస్సలు రిజిస్ట్రేషన్‌కు నిరాకరిస్తున్న నేపథ్యంలో హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం కోర్టు తీర్పులను అర్థం చేసుకోకుండా సబ్‌రిజిస్ట్రార్‌లు పౌరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పలు మార్గదర్శకాలు జారీచేసింది. " రిజిస్ట్రేషన్‌కు వచ్చిన డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చట్టం-1908, ఇండియన్ స్టాంప్ యాక్ట్ ప్రకారం సక్రమంగా ఉంటే వారంలో రిజిస్ట్రేషన్ చేయాలి. లేదంటే తిరస్కరిస్తున్నట్లు లిఖితపూర్వకంగా కారణాలు వివరించాలి. డాక్యుమెంట్లను తిరస్కరిస్తే స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల వాపసు చేసే ప్రక్రియను సరళీకృతం చేయాలి. కోర్టు వివాదాలు ముగిసి.. ఎలాంటి అప్పీళ్లు పెండింగ్‌లో లేనప్పుడు మళ్లీ కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలని పౌరులను ఇబ్బందులకు గురిచేయకుండా ఉన్నతాధికారులు విధివిధానాలు జారీచేయాలి. తీర్పులు వెలువడిన లేదా పిటిషన్లు కొట్టేసిన కేసుల్లో డాక్యుమెంట్లను తిరస్కరించరాదు. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జనరల్ డైరీ లేదా వాచ్ రిజిస్టర్ నిర్వహించాలి. అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం లేకుండా రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన పౌరుల వరుస సంఖ్య, తేదీ, సమయం అందులో రాయాలి. ఇవికాకుండా పలు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు పాటించాలి" అని ధర్మాసనం పేర్కొంది.

నేటి నుంచి కేజీఎఫ్ సదస్సు

» ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

» హాజరుకానున్న 2వేల మంది ప్రతినిధులు

» నాగార్జునసాగర్ నిర్మాణానికి ప్రధాన కారకుడైన ముక్త్యాల రాజావారి చరిత్రను వెలుగులోకి తెస్తాం

» కమ్మగ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కుసుమ్‌కుమార్



హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) తొలి సదస్సు ఇక్కడి హెచ్ఐసీసీలో శనివారం ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభించనున్నారు. పెట్టుబడుల సేకరణకు సంబంధించి జరిగే చర్చలో మంత్రి శ్రీధర్‌బాబు.. ఆదివారంనాటి సదస్సులో వ్యవసాయంపై చర్చలో, ముగింపు కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొననున్నారు. దేశ, విదేశాల నుంచి 2 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. రాజకీయాలు, విద్య, ఉద్యోగాలు, ఇతర రంగాల్లో కమ్మ యువతకు ప్రోత్సాహం.. 2030 కల్లా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 2.1 కోట్ల మంది కమ్మ సామాజిక వర్గంవారి సమగ్ర సమాచార సేకరణ.. తదితర అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్ తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికైన కమ్మ సామాజిక వర్గ నేతలకు ఈ సదస్సులో సన్మానం చేయబోతున్నట్లు వెల్లడించారు. అలాగే.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగు నీరు, విద్యుత్తును అందిస్తున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన కారకుడైన రాజా వాసిరెడ్డి రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాల రాజావారు) చరిత్రను వెలుగులోకి తీసుకువస్తామని కుసుమ్ కుమార్ వివరించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆయన ఆ రోజుల్లోనే (1954లో) రూ.52 లక్షలు విరాళంగా ఇచ్చారని.. 5 వేల ఎకరాలు దానం చేశారని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేజీఎఫ్ ప్రతినిధుల సభ డిమాండ్ చేయబోతున్నట్లు తెలిపారు.

వైద్యశాఖ బదిలీల్లో గందరగోళం

కౌన్సెలింగ్‌ను అడ్డుకున్న స్టాఫ్‌నర్స్‌లు.. రోడ్డుపైకి వచ్చి ఆందోళన

» బదిలీలు ఆపించుకునేందుకు జాబితాలో పేర్లు మాయం

» కౌన్సెలింగ్ వాయిదాతో రాత్రి స్టాఫ్ నర్సుల ఆందోళన

» జాబితా ఆన్‌లైన్‌లో ఉంచుతామన్న హామీతో నిరసన విరమణ



నర్సుల ఆందోళన వల్ల రోడ్డుపై ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, అఫ్జల్‌గంజ్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్‌నర్స్‌ల బదిలీల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో శుక్రవారం గందరగోళ పరిస్థితి నెలకొంది. బదిలీల ప్రక్రియలో లోపాలున్నాయని, తమకు అన్యాయం జరుగుతోందంటూ నర్సింగ్ ఆఫీసర్స్ కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకోవడమేకాకుండా ఆందోళనకు దిగారు. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని స్టాఫ్‌నర్స్‌కు శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. అయితే బదిలీ అయ్యేవారి జాబితా తప్పులుతడకగా ఉందని.. కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుకాగానే జాబితాలో 250వ పేరును తొలుత ఎలా పిలుస్తారంటూ మిగతా నర్సులంతా అభ్యంతరం వ్యక్తం చేశారు. సీనియారిటీ జాబితా అంతా అస్తవ్యస్తంగా ఉందని వారు ఆరోపించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకున్నారు. తర్వాత ఆడిటోరియం బయటకు వెళ్లి ఆందోళనకు దిగారు. సీనియారిటీ జాబితాలో రాత్రికి రాత్రే కొందరు నర్సుల పేర్లు మాయమయ్యాయని చెబుతున్నారు. కచ్చితంగా బదిలీ కావాల్సిన వారి పేర్లు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్టాఫ్‌నర్స్‌లు ఓ దశలో ప్రజారోగ్య సంచాలకుడు రవీంద్రనాయక్‌ను ఘెరావ్ చేశారు. కాగా బదిలీల కౌన్సెలింగ్‌ను అధికారులు వాయిదా వేయడంతో స్టాఫ్ నర్సులు ఆందోళన చేపట్టారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మెడికల్ కళాశాల నుంచి కోఠిలోని డీపీహెచ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బదిలీల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులు మాట్లాడుతూ.. పలు సంఘాల నేతలు మితిమీరిన జోక్యంతో బదిలీలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో భారీగా అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిరసన వ్యక్తం చేసిన నర్సులు శుక్రవారం రాత్రి మరోసారి ఆందోళనకు దిగారు. బదిలీల జాబితా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని హెల్త్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో రాత్రి 10.30 గంటల సమయంలో ఆందోళన విరమించారు. అధికార పార్టీ అనుబంధ సంఘం ముసుగులో కొందరు నేతలు అరాచకం సృష్టించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు వచ్చిన ఉద్యోగులు కొందరు వీరి తీరును ప్రశ్నించే ప్రయత్నం చేయగా... ఒకరిద్దరిపై చేయి చేసుకున్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

పలువురు డీఎంహెచ్‌వోల బదిలీలు

సుదీర్ఘకాలంగా ఒకేచోట సివిల్ సర్జన్స్‌గా పని చేస్తున్న వారినీ వైద్యశాఖ బదిలీ చేసింది. ఈ జాబితాలో పది మంది ఉండగా.. అందులో కొందరు డీఎంహెచ్‌వోలు, ఆర్ఎంవోలున్నారు.

టూత్‌పేస్ట్‌తోనూ ప్రమాదమే..!

» మూర్ఛలు, తలనొప్పి, ఆందోళనకు ఇదే కారణం

» ఏపీ 'న్యూరో సైంటిస్ట్స్' వైద్య సదస్సులో వెల్లడి

గుంటూరు (మెడికల్), జూలై 19: మద్యపానం, ధూమపానం, గుట్కా, ఖైనీ, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ.. మనం ప్రతిరోజూ ఉదయం పళ్లు తోమడానికి ఉపయోగించే సాధారణ టూత్ పేస్ట్‌లూ, తలనొప్పికి, ఒళ్లు నొప్పులకు వాడే పెయిన్‌బామ్‌లు సైతం మనిషి ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయని తెలుసా? అంటే.. అవును ఇది నిజమేనని ఆంధ్రప్రదేశ్ న్యూరోసైంటిస్ట్స్ (న్యూరాలజిస్టులు/న్యూరో సర్జన్లు) అసోసియేషన్ వెల్లడించింది. ఏళ్ల తరబడి టూత్‌పేస్ట్‌లు వాడటం వల్ల అందులో ఉంటే మూలకాలు మూర్ఛలు, మైగ్రేన్, తల తిరుగుడు, ఆందోళన, భయం వంటి పలు రుగ్మతలకు కారణమవుతున్నట్టు హెచ్చరించింది. కర్పూరం, సోపు, యూకలిప్టస్ ఆయిల్, ఆయుర్వేద, హెర్బల్, ఇతర పేర్లతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న టూత్‌పేస్ట్‌లు సమస్యలు సృష్టిస్తున్నట్లు తెలిపింది. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎన్ఎస్ఏ) ఆధ్వర్యంలో సంఘం 31వ వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది.

తలనొప్పికి ఇదే ప్రధాన కారణం

తొలి రోజు జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో బెంగళూరులోని సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీకి చెందిన న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ థామస్ మ్యాథ్యూ మాట్లాడుతూ.. తమ న్యూరాలజీ ఓపీకి వచ్చే తలనొప్పి రోగుల్లో 84 శాతం మందికి టూత్‌పేస్ట్‌ల వాడకమే ప్రధాన కారణమని తెలిపారు. వీరికి సాధారణ చికిత్సలు అందిస్తూనే టూత్‌పేస్ట్ వాడకాన్ని నిలిపివేశామని, రెండు వారాల తర్వాత 99 శాతం మందిలో తలనొప్పి మాయమైందని తెలిపారు. టూత్‌పేస్ట్‌లో ఉండే ఘాటైన వాసన గల మూలకాలు రోగుల్లో పలు రకాల రుగ్మతలను కల్పించే ట్రిగ్గరింగ్ ఫ్యాక్టర్‌గా పనిచేస్తున్నట్టు తాము గుర్తించామని డాక్టర్ థామస్ తెలిపారు. ఆయా మూలకాల ప్రభావం నేరుగా మెదడుపై పడుతుందని, దీనివల్ల తరచూ తలనొప్పి, మూర్ఛలు, ఆందోళన, ఇతర మానసిక వ్యాధులకు దారి తీస్తున్నట్లు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో
ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషనన్లు వర్తిస్తాయి. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: బయోఇన్ఫర్మాటిక్స్ 17, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 15, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- అభ్యర్థులు తమవెంట తీసుకురావాల్సిన పత్రాలు: పదోతరగతి, ఇంటర్, బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/తత్సమాన కోర్సు సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; గేట్ వ్యాలిడ్ స్కోర్ కార్డ్; కులం, వైకల్యం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు
- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in



ఆంధ్ర యూనివర్సిటీలో
బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్: ఇందులో అయిదు సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; బీఎస్‌లో కంప్యూటర్ సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఎంఎస్‌లో కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకటి ఎంచుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్: ఇందులో అయిదు సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; బీఎస్, ఎంఎస్‌లలో కంప్యూటర్ సైన్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్: ఇందులో పది సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్; బీఎస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్; ఎంఎస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్-సెన్సార్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశ వ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200(ఎక్స్ఎల్ఆర్ఐ అందిస్తున్న పీజీడీఎంలో చేరాలంటే అదనంగా రూ.200 చెల్లించాలి)
- **ఎక్స్ఎల్ఆర్ఐ ప్రోగ్రామ్‌లు:** బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్, ఎక్స్ఎల్ఆర్ఐ-ఆర్‌బీఎస్ డబుల్ మాస్టర్స్ ప్రోగ్రామ్, ఇన్నోవేషన్-ఆంత్రప్రెన్యూర్‌షిప్-వెంచర్ క్రియేషన్ ప్రోగ్రామ్
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 20 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **టెస్ట్ ప్రాథమిక కీ విడుదల:** 2025 జనవరి 10
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో
డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్, అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in



జాబ్ కార్నర్

నిమ్‌హాన్స్‌లో ఖాళీలు

ఖాళీలు 78

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)... ఖాళీగా ఉన్న గ్రూపు ఎ, బి, సి పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు

1. హిందీ ఆఫీసర్(అసిస్టెంట్ డైరెక్టర్): **1 పోస్టు**
2. లెక్చరర్(నర్సింగ్): **1 పోస్టు**
3. ఫిజిసిస్ట్ ఫర్ సైక్లోట్రోన్: 1 పోస్టు
4. సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్(న్యూరోమస్కులార్): **1పోస్టు**
5. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్: **5 పోస్టులు**
6. సైంటిస్ట్-సి(ఆయుర్వేద): **1 పోస్టు**
7. సైంటిస్ట్ - సి(కాగ్నెటివ్ సైన్స్): **1 పోస్టు**
8. సైంటిస్ట్-సి(న్యూరోఫిలాసఫీ): **1 పోస్టు**
9. సైంటిస్ట్-(యోగిక్ సైన్స్): **1 పోస్టు**

గ్రూప్-బి పోస్టు

10. అకౌంటెంట్: **11 పోస్టులు**
11. కంప్యూటర్ ప్రోగ్రామర్: **2 పోస్టులు**
12. ఈఈజీ టెక్నీషియన్: **2 పోస్టులు**
13. జూనియర్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్: **3 పోస్టులు**
14. మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్: **18 పోస్టులు**
15. న్యూరో అనస్థీషియా టెక్నాలజిస్ట్: **4 పోస్టులు**
16. అక్యుపేషనల్ థెరపిస్ట్: **1 పోస్టు**
17. ఫిజియోథెరపిస్ట్: **2 పోస్టులు**
18. రీసెర్చ్ అసిస్టెంట్: **1 పోస్టు**
19. రేడియోలాజికల్ టెక్నాలజిస్ట్: **8 పోస్టులు**
20. సీనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
21. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
22. సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్: **2 పోస్టులు**
23. అసిస్టెంట్ డైటీషియన్: **2 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు

24. అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్: **2 పోస్టులు**
25. మెడికల్ రికార్డ్స్ టెక్నీషియన్: **2 పోస్టులు**
26. మార్చురి అసిస్టెంట్: **1 పోస్టు**
27. ఫార్మసిస్ట్: **1 పోస్టు**
28. యోగా థెరపిస్ట్: **1 పోస్టు**

విభాగాలు: సైకాలజీ, యోగా సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, న్యూరో సైకాలజీ, అనస్థీషియా, ఫిజియోథెరపీ, రేడియోగ్రఫీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో నర్సింగ్, డిగ్రీ, ఎంబీబీఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 27 ఏళ్ల నుంచి 40 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఎ పోస్టులకు రూ.2360, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.1180; గ్రూప్-బి పోస్టులకు రూ.1180, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.885; గ్రూప్-సి పోస్టులకు రూ.885; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.590.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, నిమ్‌హాన్స్, పీబీ నెంబర్.2900, హోసూరు రోడ్, బెంగళూరు చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17

వెబ్‌సైట్: https://nimhans.ac.in/



ఎన్‌పీసీఎల్‌లో ఉద్యోగాలు

ఖాళీలు 74

బులంద్‌షహర్(ఉత్తరప్రదేశ్) జిల్లాలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)కు చెందిన నరోరా అటామిక్ పవర్ స్టేషన్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. నర్స్-ఎ: **1 పోస్టు**
2. కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్/సైన్స్ గ్రాడ్యుయేట్లు: **12 పోస్టులు**
3. కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ/టెక్నీషియన్: **60 పోస్టులు**
4. ఎక్స్‌రే టెక్నీషియన్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిప్లొమా(నర్సింగ్), బీఎస్సీ(కెమిస్ట్రీ/మేథ్స్/స్టాటిస్టిక్స్), డిగ్రీ, బీఈ/బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: నర్స్-ఎ పోస్టుకు 30 ఏళ్లు, కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ, ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టులకు 25 ఏళ్లు, కేటగిరీ-2 స్టయిపెండరీ ట్రెయినీ పోస్టుకు 24 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు నర్స్-ఎ పోస్టుకు రూ.67,350; కేటగిరీ-1 స్టయిపెండరీ ట్రెయినీ పోస్టుకు రూ.53,100; కేటగిరీ-2 స్టయిపెండరీ పోస్టుకు రూ.32,550; ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టుకు రూ.38,250.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, ఫిజికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: www.npcil.nic.in/

ఇఫ్‌కోలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్, ప్రధాన కార్యాలయం..కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సివిల్.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఓబీసీ అభ్యర్థులు కనీసం 60 శాతం ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 55 శాతం చాలు.


గరిష్ఠ వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు రూ.35,000

ఎంపిక విధానం: ప్రిలిమినరీ కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఫైనల్ ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

వెబ్‌సైట్: www.iffco.in/




లిటిల్స్

పులిగోరు

కృష్ణాపురంలో ఉండే కేశవానంద అనే స్వామీజీ వద్దకు రమణ అనే యువకుడు వచ్చి స్వామీ నాకు కోపం చాలా ఎక్కువగా వస్తోంది. దాని వల్ల అందరితో గొడవలు పడుతున్నాను .ఎవరిని చూసినా చిరాకుగా ఉంటుంది నాకు ఏదైనా ఉపాయం చెప్పండి అని అడిగాడు. దానికి ఆ స్వామీజీ నాయనా నీ కోపం చిరాకు తగ్గాలి అంటే నువ్వు అసలైన పులి గోరు మెడలో వేసుకోవాలి. పక్కనున్న అడవిలో ఒక పులి ఉంది దాని వద్దకు వెళ్లి నా పేరు చెప్పు నీకు గోరు ఇచ్చి పంపుతుంది. అన్నాడు అని రమణ అడవికి వెళ్లి ఒక బక్కచిక్కిన ముసలి పులిని కలిసి, కేశవ్ ఆనంద స్వామి పేరు చెప్పి తనకు గోరు కావాలని అడిగాడు. దానికి ఆ



పులి, నాకు ముసలితనం వచ్చి, చూపు సరిగా ఆనడంలేదు. నువ్వు నాకు రోజూ ఆహారం తెచ్చిస్తే నీకు గోరు ఇస్తానుఅన్నది దానికి సరేనన్న రమణ ప్రతిరోజూ మాంసం, చేపలు తీసుకెళ్లి పులికి ఇచ్చేవాడు. కొన్ని రోజుల తర్వాత ఆ పులి ఇక నేడో రేపో నేను చనిపోతాను. నేను చనిపోగానే నా గోళ్లు నువ్వు తీసుకెళ్లవచ్చు అని అదేరోజున ఆ పులి చనిపోయింది. పులి చనిపోవడం చూసి, చాలా బాధ పడిన రమణ సామీజీ వద్దకు వచ్చి, దుఃఖ పడ్డాడు అది చూసన సామీజీ ఇపుడు చనిపోయిన పులి మీద ఎంత జాలి, ప్రేమ చూపిస్తున్నావో, అదే ప్రేమ నీతోటి మనుషుల మీద కూడా చూపించు. నీ కోపం, చిరాకు ఇట్టే తగ్గుతాయి అని చెప్పాడు. ఆ రోజునుండి రమణ చుట్టూ ఉన్న అందరిలో మంచిని చూడసాగాడు.



6 తేడాలను గుర్తించండి?

దారి కనుక్కోండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 363

					3			
		8					7	6
	7			2		5	9	
	3	1	2		8			
6			1		7			5
			6		9	1	3	
	4	2		6			1	
9	8					2		
			4					

సుడోకు - 362 సమాధానం

2	3	1	4
4	1	3	2
3	4	2	1
1	2	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.